www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 21-12-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 285 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: పాడ్యమి ఉ.9.11 తదుపరి విదియ, నక్షత్రం: పూర్వాషాఢ తె. 3.36 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: ఉ.11.51-1.36, దుర్ముహూర్తం: సా.4.14-4.58, అమృతఘడియలు: రా.10.21-12.06, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.44, సూర్యాస్తమయం: 5.42 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

2026 జూన్ నాటికి ప్లాస్టిక్ ఫ్రీ ఏపీ

జనవరి 26 నాటికి రోడ్డుపై చెత్త కనిపించకూడదు: సీఎం



అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో ఇళ్ల నుంచి చెత్త సేకరణను పరిశీలించేందుకు బండి వెంట నడుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

- స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధన సాధ్యం
- అభివృద్ధి యజ్ఞం భగ్నానికి రాక్షసుల యత్నం
- మెగా డీఎస్సీ నుంచి కానిస్టేబుల్ పోస్టుల దాకా కేసులు
- అయినా ఆ రాక్షసులు నన్ను అడ్డుకోలేరు
- పేదలకు మెరుగైన వైద్యమే 'పీపీపీ' లక్ష్యం
- 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ప్రజావేదికలో సీఎం

అనకాపల్లి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను 2026 జూన్ నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. శనివారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని బంగారయ్యపేట గ్రామంలో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంపై నిర్వహించిన ప్రజావేదికలో ఆయన పాల్గొని ప్రసంగించారు. "రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలను ప్లాస్టిక్ రహితంగా చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్ర సచివాలయంలో ప్లాస్టిక్‌ను నివారించాం. ఇప్పటికే 21 విభాగాల్లో 69 రాష్ట్ర అవార్డులు, 1,257 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయి." అని వివరించారు. గత ప్రభుత్వం రూ.86 లక్షల టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చిందని, 2026 జనవరి 26 నాటికి రోడ్డుపై చెత్త అనేది కనిపించకూడదని లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతే కాకుండా ప్రజల ఆలోచనలు కూడా స్వచ్ఛంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. "ఇది బలవంతపు కార్యక్రమం కాదు. భావి తరాలకు ఆరోగ్యకరమైన

మిగతా 13వ పేజీలో...

ఈ వయసులోనే జీవితానికి బాట

- ఏం సాధించాలన్నా ఇప్పుడే ప్రారంభించాలి
- విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నాదీ హామీ
- శుభ్రత, ఆత్మవిశ్వాసం పెంచేందుకే 'ముస్తాబు'
- పిల్లలందరికీ త్వరలో వైద్య పరీక్షలు
- ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు



మీకు యోగి ట్రీట్‌మెంటే కరెక్ట్

రౌడీల విషయంలో రాజకీయ నిర్ణయం తీసుకుంటే మీ పరిస్థితి ఏంటి?

- మళ్లీ మేమొస్తాం.. జైలుకు పంపుతాం వంటి బెదిరింపులకు మేం భయపడం
- బలమైన నక్సలిజమే కకావికలమైంది.. మీరెంత?
- గీత దాటి మాట్లాడితే మీ చేతుల్లో గీతలు తీసేస్తాం
- జగన్ అండ్ కోకు డిప్యూటీ సీఎం పవన్ వార్నింగ్
- అంబేడ్కర్, గాంధీ, పొట్టిశ్రీరాములుకు కులం అంటగడితే భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్య
- అమరజీవి జలధార పథకానికి శంకుస్థాపన

13



'అమరజీవి జలధార'కు శంకుస్థాపన చేసి, ఆ పథకం నమూనాను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్



నేడు పల్స్ పోలియో

రాష్ట్రవ్యాప్తంగా 38,267 కేంద్రాల ఏర్పాటు 2

50 కార్లు చోరీ చేసిన 'పేట ముఠా'!

- నంబర్లు మార్చి పలువురికి విక్రయం 12
- కొన్నవారిలో రాజకీయ నేతలు కూడా
- నేరాలకు సహకరించిన పోలీసులకు కానుకలుగా అవే దొంగ వాహనాలు!




2

చొరబాటుదారులకు దేశద్రోహుల అండ

- ఓటరు జాబితా సవరణను అందుకే వ్యతిరేకిస్తున్నారు
- అసోం సభలో ఇండియా కూటమిపై మోదీ ఆరోపణలు
- బెంగాల్‌లోనూ జంగిల్‌రాజ్ మమతపై ప్రధాని విమర్శలు

శ్రీశైలం మరమ్మతులకు రూ.203.95 కోట్లు!

- నిధుల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం
- ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్ల ఏర్పాటుకు 180 కోట్లు అవసరమని అంచనా
- ప్రతిపాదనల తయారీలో ఇంజనీర్లు
- సీడబ్ల్యూసీ, సీడీవో సీఈ ఆమోదం పొందిన తర్వాత టెండర్లు పిలిచే యోచన



3

శ్రీశైలం డ్యాం ఎదుట ఉన్న ప్లంజ్‌పూల్ గుంత

పోస్టుతో పోస్టు గల్లంతు!

- సోషల్ మీడియా పోస్టులతో విదేశాల్లో భారతీయులకు తిప్పలు
- ప్రభుత్వానికి, మతాలకు వ్యతిరేకంగా ఉంటే వెనక్కి పంపుతున్న వైనం
- అమెరికా, బ్రిటన్, గల్ఫ్ దేశాల కొరడా
- ఈ ఏడాది వెనక్కి పంపిన భారతీయుల సంఖ్య 3 వేలకు పైనే
- 'డిజిటల్' చరిత్ర తవ్వేందుకు ప్రత్యేక కన్సల్టెన్సీల సేవలు



14

పూసపాటి.. దానంలో మేటి!

1000 కోట్ల విలువైన భూమి దానం

- ఏవియేషన్ ఎడ్యుసిటీకి 136 ఎకరాలు.. మాన్సాస్ ట్రస్టు తరఫున అందించిన పూసపాటి రాజవంశం
- ముందుకొచ్చిన అదితి గజపతిరాజు.. నాడు అశోక్ గజపతిరాజు చొరవతో భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు
- ఇప్పుడు దేశంలోనే తొలి సంస్థకు శ్రీకారం

14



ఊరంతా నిక్‌నేమ్‌లే!

ఆ పేరుతో పిలిస్తేనే పలుకుతారు

- ముద్దుపేర్లకు కేరాఫ్ ఫత్తేపురం!
- అసలు పేరు చిననింద్రకొలను
- నిక్‌నేమ్‌తో పిలవడం, పిలిపించుకోవడం వారికి.. అదో తుత్తి!
- గోదారి జిల్లాలంటేనే వెటకారం అన్నమాటకు రుజువు

ఏరా.. ట్రాక్టర్ శీనుగాడింటికి ఫంక్షన్‌కి ఇంకా బయల్దేరలేదా?
లేదురా.. ఆ కలెక్టర్‌గాడు కూడా వస్తే కలిసి వెళ్తాం..!
ఇంకెక్కడి కలెక్టర్.. ఆడూ.. ఐజీగాడూ ముందే వెళ్లిపోయారు...
అవునా.. నేనూ వస్తాను.. ఇక్కడుండమన్నాడు మరీ..!
సరిసర్లే.. బయల్దేరు.. నేనూ.. చంద్రబాబూ
ఒక బండిమీద వచ్చేస్తాం..!

..ట్రాక్టర్ శీనుగాడింట్లో ఫంక్షన్ ఏంటీ.. కలెక్టర్.. ఐజీ ఏంటీ.. చంద్రబాబు.. ఏంటీ అని ఆశ్చర్యపోతున్నారా?.. అవును ఆ ఊళ్లో అడుగు పెడితే ఇలాంటి సంభాషణలే వినిపిస్తాయి!. అయితే వాళ్లంతా నిజమైన కలెక్టరు.. ఐజీలు కాదు.. వారికి ఉన్న ముద్దు పేర్లు అవి!.. అసలు ఆ ఊరిపేరుకూ నిక్‌నేమ్ ఉంది.. అదే.. ఫత్తేపురం!.. అసలు పేరేంటి అని ఆలోచిస్తున్నారా?..!! చదవండి మరి!

11

మాజీ అగ్నివీర్‌లకు బీఎస్‌ఎఫ్‌లో 50% రిజర్వేషన్

న్యూఢిల్లీ, డిసెంబరు 20: బీఎస్‌ఎఫ్ కానిస్టేబుళ్ల భర్తీలో మాజీ అగ్నివీర్‌లకు ప్రస్తుతం ఉన్న 10% రిజర్వేషన్లను కేంద్ర హోం శాఖ 50శాతానికి పెంచింది. ఈ మేరకు బీఎస్‌ఎఫ్ జనరల్ డ్యూటీ కేడర్(నాన్ గెజిటెడ్) భర్తీ నిబంధనలు-2015లో సవరణలు చేస్తూ శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. భర్తీలో మరికొన్ని మినహాయింపులు ఇచ్చింది. మొదటి బ్యాచ్ అగ్నివీర్‌లకు అయిదేళ్ల పాటు, మిగిలిన బ్యాచ్‌ల వారికి మూడేళ్ల పాటు వయో పరిమితిలో సడలింపు ఇచ్చింది. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లు జరపాల్సిన పనిలేదని కూడా పేర్కొంది.

గుడ్లలో క్యాన్సర్ కారకాల్లేవు: ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ

భారత్‌లో లభ్యమయ్యే గుడ్లలో క్యాన్సర్ ముప్పు కారకాలున్నాయంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) కొట్టిపారేసింది. భారత్‌లో విక్రయిస్తున్న గుడ్లలో క్యాన్సర్ ముప్పునకు కారణమయ్యే నైట్రోఫ్యురాన్ మెటబాలైట్స్ ఉంటున్నాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ రెగ్యులేషన్స్ చట్టం-2011 ప్రకారం దేశంలోని పౌల్ట్రీలు, గుడ్ల ఉత్పత్తిలో నైట్రోఫ్యురాన్స్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నట్లు తెలిపింది.

రైలులో ఎందుకు గొడవపడ్డారు?

- రైలు పట్టాలపై నవ దంపతుల విషాదాంతంలో సందేహాలు
- భార్యాభర్తలు రైలులో ఘర్షణ పడిన వీడియో వైరల్


సింహాద్రి, భవాని (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఆలేరు సమీపంలోని రైలు పట్టాల వద్ద ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన నవ దంపతుల మృతదేహాలు దొరికిన ఘటనలో కొత్తకోణం వెలుగు చూసింది. తొలుత వారు రైలు నుంచి జారిపడి మరణించారని పోలీసులు భావించగా, వెలుగులోకి వచ్చిన ఓ వీడియోతో వారి మరణంపై సందేహాలు నెలకొన్నాయి. ఆ వీడియోలో దంపతులు గొడవపడుతున్నట్లు ఉండటంతో ఆత్మహత్య చేసుకున్నారా? అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం అసలేం జరిగిందంటే.. పార్వతీపురం మన్యం జిల్లా గురుగుల్ల మండలం రావుపల్లి గ్రామానికి చెందిన కొరాడ సింహాద్రి (25)కి విజయనగరం జిల్లా జీఎం వలస మండలం అంకవరం గ్రామానికి చెందిన కొంగరపు భవాని(19)కి అక్టోబరు 24న వివాహమైంది. సింహాద్రి హైదరాబాద్ జగద్గిరిగుట్టలో ఉంటూ, గాంధీనగర్‌లోని ప్రైవేట్ ఫార్మసీలో పనిచేస్తున్నాడు. భవానీ కూడా అదే ప్రాంతంలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. వైజాగ్‌లో ఉన్న భవానీ తల్లి వద్దకు వెళ్లేందుకు ఈనెల 18న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రాత్రి 8గంటలకు మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ ఎక్కి నవ దంపతులిద్దరూ బయలుదేరారు. అయితే కొద్ది సేపటికే వారి ప్రయాణం విషాదాంతం అయింది. శుక్రవారం ఉదయం తెలంగాణలోని ఆలేరు-వంగపల్లి మధ్య రైలు పట్టాల సమీపంలో గ్యాంగ్‌మన్ వారి మృతదేహాలను గుర్తించారు. అయితే సింహాద్రి, భవానీ రైలులో గొడవ పడుతున్న సమయంలో తోటి ప్రయాణికుడు వీడియో తీశాడు. అది వైరల్ అవ్వడంతో వారి మృతిపై అనుమానాలు రేకెత్తాయి. ఆ వీడియోలో భార్యను సింహాద్రి చాలా సేపు వారిస్తున్నట్లు కనబడుతోంది. ఆ తర్వాత ఏ జరిగిందో ఆ వీడియోలో లేదు. దీంతో ఒకరి తర్వాత ఒకరు రైల్లో నుంచి దూకేసి ఉంటారనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

చొరబాటుదారులకు దేశద్రోహుల అండ

ఓటరు జాబితా సవరణను అందుకే వ్యతిరేకిస్తున్నారు

- ఇండి కూటమిపై మోదీ ఆరోపణలు


గోపీనాథ్ బర్దోలోయ్ ఎయిర్‌పోర్టులో కొత్త టెర్మినల్ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీతో గౌతమ్ అదానీ

గౌహతి/ కోల్‌కతా, డిసెంబరు 20: చొరబాటుదారులకు దేశద్రోహులు అండగా నిలుస్తున్నారని ప్రధానమంత్రి మోదీ ఇండి కూటమి నేతలపై విమర్శలు గుప్పించారు. అందుకే ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. అక్రమ చొరబాటుదారులకు వ్యతిరేకంగా మాట్లాడాల్సిన టీఎంసీ నేతలు గో బ్యాక్ మోదీ అంటున్నారని చెప్పారు. అస్సాం గౌహతిలో రూ.4 వేల కోట్ల వ్యయంతో నిర్మించిన లోక్‌ప్రియ గోపీనాథ్ బర్దోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయం నూతన టెర్మినల్ ప్రారంభోత్సవం సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. అస్సాం తొలి సీఎం గోపీనాథ్ బర్దోలోయ్ 80 అడుగుల విగ్రహాన్ని కూడా ప్రధాని ఆవిష్కరించారు. అనంతరం మోదీ గౌహతిలో మెగా రోడ్‌షో నిర్వహించారు. అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తదితరులు ఆయన వెంట రోడ్‌షోలో పాల్గొన్నారు.

బిహార్‌లో జరిగిందే బెంగాల్‌లోనూ..

పశ్చిమబెంగాల్ నుంచి కూడా జంగిల్‌రాజ్‌ను వదిలించుకోవాలని ప్రధాని మోదీ ఓటర్లకు పిలుపునిచ్చారు. పశ్చిమబెంగాల్ రానాఘాట్‌లోని తాహెర్‌పూర్ నేతాజీ పార్క్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభను ఉద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. బిహార్ ప్రజలు జంగిల్‌రాజ్‌ను వదిలించుకున్నారని, అదే ఇప్పుడు బెంగాల్‌లోనూ జరగబోతుందన్నారు. దేశం వేగంగా అభివృద్ధి చెందాలనుకుంటోందని, అందుకే ప్రజలు బిహార్‌లో 20 ఏళ్ల తర్వాత కూడా ఎన్డీయే ప్రభుత్వానికి మరోమారు పట్టం కట్టారని చెప్పారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని, పశ్చిమబెంగాల్ కోల్పోయిన ఘనతను, కీర్తిని డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలతో తిరిగి తీసుకువస్తామన్నారు. మోదీని, బీజేపీని వ్యతిరేకించే పేరుతో మమత సర్కారు బెంగాల్ ప్రజలకు అభివృద్ధిని దూరం చేస్తోందని మోదీ ఆరోపించారు. ప్రతికూల వాతావరణం, దట్టమైన పొగమంచు కారణంగా మోదీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ తాహెర్‌పూర్ హెలిపాడ్ వద్ద ల్యాండ్ కాలేక కోల్‌కతాకు వెనక్కి మళ్లాల్సి వచ్చింది. దీంతో ఆయన బహిరంగ సభకు హాజరైనవారిని ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. మరోవైపు మోదీ సభకు హాజరయ్యేందుకు వస్తూ రైలు ఢీకొని ముగ్గురు మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ప్రతికూల వాతావరణం, దట్టమైన పొగమంచు కారణంగా రైలు కనపడకపోవడంతో ఈ ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. బీజేపీ కార్యకర్తల మృతిపై ప్రధాని మోదీ సంతాపం తెలిపారు.

లోకం తీరు



‘ఉపాధి’పై బుల్డోజర్ ప్రయోగం

- మోదీ ప్రభుత్వంపై సోనియా గాంధీ మండిపాటు



న్యూఢిల్లీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు, అణగారిన ప్రజలకు జీవనాధారంగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని దెబ్బతీసేందుకు మోదీ సర్కారు దానిపై బుల్డోజర్‌ను ప్రయోగిస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు 11 ఏళ్లుగా నిరంతరం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో పేదలకు ‘సంజీవని’లా పనిచేసిన పథకాన్ని ఇప్పుడు మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఎవరినీ సంప్రదించకుండా, విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోకుండా ఈ పథకం స్వరూపాన్ని మార్చేశారని విమర్శించారు. పథకం పేరు నుంచి ‘మహాత్మా గాంధీ’ పేరును తొలగించడాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. కొత్త మార్పులతో గ్రామ పంచాయతీల అధికారం పోయి, అంతా ఢిల్లీ నుంచే శాసించే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికి, ఎక్కడ పని ఇవ్వాలో క్షేత్రస్థాయి పరిస్థితులతో సంబంధం లేకుండా ఢిల్లీలో కూర్చున్న వారు నిర్ణయిస్తారా అని సోనియా నిలదీశారు. ఈ పథకం కోట్ల మంది నిరుపేదలు, అణగారిన వర్గాలకు జీవనాధారంగా మారిందన్నారు. పేదలకు ఉపాధి హక్కు కల్పించేందుకు గతంలో పోరాడిన విధంగానే నేడు ఈ నల్ల చట్టంపైనా పోరాడేందుకు అంతే నిబద్ధతతో ఉన్నామని సోనియా గాంధీ స్పష్టం చేశారు.

‘కౌశల్ వికాస్’లో అక్రమాల పర్వం!

- శిక్షణ ఇవ్వకుండానే సర్టిఫికెట్ల జారీ

న్యూఢిల్లీ, డిసెంబరు 20: చదువుకున్న యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా స్వయం ఉపాధిలో వారు నిలదొక్కుకునేలా చేయాలన్న లక్ష్యంతో కేంద్రం తీసుకువచ్చిన ‘ప్రధాన మంత్రి కౌశల్ వికాస్’ పథకంలో భారీ అక్రమాలు జరిగినట్టు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) అధికారులు గుర్తించారు. 2015-22 మధ్య మూడు దశల్లో నిర్వహించిన శిక్షణకు సంబంధించి బిహార్, ఉత్తరప్రదేశ్(యూపీ)లలో ఈ అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిపారు. 11111111111 నెంబరుతో బ్యాంకు ఖాతాలు సృష్టించడంతో పాటు ఒకే ఫొటోతో లక్షల మంది ఈ పథకం కింద నమోదు కావడం, శిక్షణ కేంద్రాలను మూసివేయడం వంటివాటిని గుర్తించినట్టు పేర్కొన్నారు. ఎలాంటి ‘మెరిట్’ లేకుండానే.. సంస్థలు లక్షలాది మందికి ‘బెస్ట్ ఇన్ క్లాస్’ పేరుతో నైపుణ్య సర్టిఫికెట్లు జారీ చేసినట్టు గుర్తించారు. దీనికి సంబంధించిన ఆడిట్ నివేదిక గత గురువారం లోక్‌సభలో ప్రవేశ పెట్టారు. కౌశల్ వికాస్ యోజన కింద 2015-22 మధ్య మూడు దశల్లో నిర్వహించిన కార్యక్రమంలో 1.32 కోట్ల మంది అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు రూ.14,450 కోట్లను కేంద్రం కేటాయించింది. మొత్తం మూడు దశల్లో 1.1కోట్ల మంది అభ్యర్థులు శిక్షణ సర్టిఫికెట్లు పొందారు. అయితే.. వీరి బ్యాంకు అకౌంట్లను పరిశీలించగా.. 90,66,264 మంది అభ్యర్థుల ఖాతా నెంబర్లు సున్నాగా పేర్కొనడం గమనార్హం. అదేవిధంగా 5,24,537 మంది ఖాతాలకు సంబంధించి 12,122 మందికి ఒకే నెంబరు, మరో 52,381 మందికి రిపీటెడ్ నెంబర్లు ఉన్నట్టు కాగ్ గుర్తించింది. 4,72,156 మంది అభ్యర్థుల ఖాతాలకు 11111111111 నెంబరు ఉన్నట్టు కాగ్ తెలిపింది. కాగా, 24.53 లక్షల మంది సర్టిఫైడ్ అభ్యర్థులకు డీబీటీ ద్వారా నిధులు మంజూరు అయ్యాయని, కానీ, వీరిలో 17.69 లక్షల మంది అభ్యర్థులు మాత్రమే శిక్షణను పొందారని తెలిపింది.

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో క్లింటన్ రాసలీలలు

- లక్షల పత్రాలు విడుదల చేసిన అమెరికా న్యాయశాఖ

వాషింగ్టన్, డిసెంబరు 20: అమెరికా రాజకీయాలను కుదిపేస్తున్న ‘ఎప్‌స్టీన్ ఫైల్స్’లో ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్ రాసలీలలు కూడా బయటకు వచ్చాయి. అమెరికా చరిత్రలోనే అతిపెద్దదిగా భావిస్తున్న ఈ లైంగిక కుంభకోణం సూత్రధారి జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఆ దేశ రాజకీయ, వ్యాపార ప్రముఖులు, సెలబ్రిటీలకు ఉన్న సంబంధాలను వెల్లడి చేసే 6 లక్షల పేజీల డాక్యుమెంట్లను అమెరికా న్యాయశాఖ శుక్రవారం విడుదల చేసింది. ఈ పత్రాల విడుదలకు అనుమతిస్తూ అధ్యక్షుడు ట్రంప్ నవంబర్ 19న ఆదేశాలపై సంతకం చేయగా, సరిగ్గా నెల తర్వాత వాటిని బయటపెట్టారు. ఈ పత్రాల విడుదలకు ప్రతిపక్ష డెమోక్రాట్లు భారీ ఉద్యమమే నడిపారు. అయితే, తీరా ఆ పత్రాల్లో ట్రంప్ కంటే డెమోక్రాటిక్ నేత క్లింటన్ రాసలీలలే అధికంగా ఉండటం సంచలనంగా మారింది. ఎప్‌స్టీన్‌కు చెందిన లగ్జరీ చార్టర్డ్ విమానంలో క్లింటన్ ఓ యువతిని తన తొడపై కూర్చోబెట్టుకొని ప్రయాణం చేస్తున్న ఫొటోతోపాటు ఈత కొలనులో ఎప్‌స్టీన్ సహచరి, ఈ కుంభకోణంలో మరో ప్రధాన నిందితురాలు ఘిస్లైన్ మ్యాక్స్‌వెల్‌తో ఉన్న ఫొటో, బాత్ టబ్‌లో ఓ యువతితో మసాజ్ చేయించుకుంటున్న ఫొటో తాజాగా విడుదలైన పత్రాల్లో ఉన్నాయి. ఎప్‌స్టీన్‌తో మైఖేల్ జాక్సన్ కలిసి ఉన్న ఫొటో కూడా బయటకు వచ్చింది.

ఆ జడ్జి అభిశంసనకు అనుమతించొద్దు

- ప్రతిపక్ష ఎంపీల నోటీసును వ్యతిరేకించండి
- మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తికి మద్దతుగా

36 మంది రిటైర్డు జడ్జీల ఉమ్మడి ప్రకటన

న్యూఢిల్లీ, డిసెంబరు 20: మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్‌ను అభిశంసించాలంటూ ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలు స్పీకర్‌కు నోటీసు ఇవ్వడాన్ని 36 మంది రిటైర్డు న్యాయమూర్తులు ఒక ప్రకటనలో వ్యతిరేకించారు. ఈ నోటీసును స్వీకరించవద్దని స్పీకర్‌ను కోరారు. ప్రతిపక్ష ఎంపీల చర్యను అనుమతిస్తే, స్వతంత్ర న్యాయవ్యవస్థ మూలాలు కదిలిపోయే ప్రమాదం ఉన్నదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమిళనాడులో తిరుపరన్ కుండ్రమ్‌లోని ఉచ్చి పిల్లయార్ మండపంలో దీపం వెలిగించేందుకు సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ నిర్వాహకులను అనుమతిస్తూ ఈ నెల ఒకటో తేదీన మద్రాస్ హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. దీనివల్ల మండపానికి సమీపంలోని దర్గా లేక అక్కడి ముస్లిం సముదాయ హక్కులకు భంగం వాటిల్లబోదని ఆ బెంచ్‌కు నాయకత్వం వహించిన జస్టిస్ స్వామినాథన్ తెలిపారు. అధికార డీఎంకేకు చెందిన ఎంపీలు ఈ తీర్పును వ్యతిరేకిస్తూ న్యాయమూర్తిని అభిశంసించాలంటూ ఈ నెల తొమ్మిదో తేదీన స్పీకర్ ఓం బిర్లాకు నోటీసు ఇచ్చారు. ఈ చర్యను తమ ఉమ్మడి ప్రకటనలో రిటైర్డు న్యాయమూర్తులు తప్పుబట్టారు. “సమాజంలోని ఓ నిర్దిష్ట వర్గ రాజకీయ, భావజాలపరమైన అభిప్రాయాలకు తలవొగ్గని న్యాయమూర్తులను బెదిరించడం సరికాదు. ఈ నోటీసును తిరస్కరించాల్సిందిగా అన్ని పార్టీల ఎంపీలను కోరుతున్నాం” అని ఆ ప్రకటనలో తెలిపారు.

బంగ్లాదేశ్ పార్లమెంటు ముట్టడి

- పార్లమెంట్ ఆవరణలోనే హాదీ అంతిమ కార్యక్రమాల నిర్వహణ
- హాజరైన లక్షలాది మంది ప్రజలు


బంగ్లాదేశ్ పార్లమెంటు ఆవరణలో లక్షలాది మంది నిరసనకారుల సంతాపం

ఢాకా, డిసెంబరు 20: భారత వ్యతిరేక రాడికల్ సంస్థ ఇంక్విలాబ్ మంచ్ కన్వీనర్, బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ(32) అంత్యక్రియలు శనివారం ముగిశాయి. ఢాకాలో ఈ నెల 12న గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో గాయపడిన హాదీ.. సింగపూర్‌లోని ఓ ఆస్పత్రిలో గురువారం మరణించాడు. హాదీ మరణవార్త తెలిసిన వెంటనే బంగ్లాలో శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగిన సంగతి తెలిసిందే. హాదీ మృతదేహం శుక్రవారం రాత్రి ఢాకా చేరుకోగా.. బంగ్లాదేశ్ పార్లమెంట్ ఆవరణలో శనివారం అంతిమ కార్యక్రమాలు నిర్వహించారు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు ముహమ్మద్ యూనస్, సలహామండలిలోని ఇతర సభ్యులు, ఆర్మీ చీఫ్ జనరల్ వాకర్ ఉజ్ జమాన్‌తోపాటు లక్షలాది మంది ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతో పార్లమెంట్ ఆవరణ జనసంద్రంగా మారింది. అలాగే, హాదీ మరణం నేపథ్యంలో శనివారం బంగ్లాదేశ్‌లో సంతాప దినం పాటించారు. కాగా, ఢాకా యూనివర్సిటీ ఆవరణలో ఉన్న బంగ్లా జాతీయ కవి ఖాజీ నజ్రుల్ ఇస్లామ్ సమాధి పక్కనే హాదీ భౌతికకాయాన్ని ఖననం చేస్తామని ఇంక్విలాబ్ మంచ్ ప్రతినిధులు మీడియాకు తెలిపారు.

బంగ్లాలో ఇస్లామిక్ చట్టమే..

సమీప భవిష్యత్తులో బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ చట్టాలే అమలవుతాయని, మనుషులు రూపొందించిన వ్యవస్థలు, చట్టాలు ఉండవని బంగ్లాదేశ్ జమాత్- ఈ- ఇస్లామి నేత ముజిబర్ రెహ్మాన్ ప్రకటించారు. ఢాకాలో శనివారం నిర్వహించిన ఓ ర్యాలీలో రెహ్మాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇన్నేళ్ల చరిత్రలో బంగ్లాదేశ్ పార్లమెంట్‌లో ఇస్లామ్‌ను విస్మరించారని, ఖురాన్ ఆధారంగా ఒక్క చట్టాన్ని అమలు చేయలేదని ముజిబర్ పేర్కొన్నారు. దాని వల్లే దేశంలో ప్రస్తుతం అశాంతి, అవినీతి రాజ్యమేలుతున్నాయని తెలిపారు. ఇక, ఇస్లామిక్ చట్టాలను పాటించినప్పుడే బంగ్లా ప్రజల తలరాత మారుతుందని ఇదే ర్యాలీలో పాల్గొన్న జమాత్ పాలక మండలి సభ్యుడు అజ్రుల్ ఇస్లామ్ పేర్కొన్నారు.

ఏనుగుల గుంపును ఢీకొట్టిన రైలు

- అసోంలో ఘటన..7 ఏనుగుల మృతి
- పట్టాలు తప్పిన 5 బోగీలు


ప్రమాద స్థలంలో ఏనుగుల కళేబరాలు

గుహవాటి, డిసెంబరు 20: అసోంలో రైలు ప్రమాదం సంభవించింది. రైలు ఢీకొని ఏడు ఏనుగులు మృతిచెందాయి. ఒక ఏనుగు గాయపడింది. హోజాయ్ జిల్లాలో శనివారం తెల్లవారుజామున 2:17 గంటలకు సాయిరంగ్-న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకెళుతుండగా పట్టాలపై ఏనుగులు అడ్డంగా వచ్చాయి. కో-పైలట్ ఎమర్జెన్సీ బ్రేకులు వేసినా అప్పటికే ఆలస్యమైంది. ఈ ప్రమాదంలో రైలు ఇంజిన్‌తో పాటు ఐదు బోగీలు పట్టాలు తప్పాయి. ప్రయాణికుల్లో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రమాదం ఫలితంగా ఆ మార్గంలోని రైళ్లలో కొన్నింటిని రద్దు చేశారు. ఈ ఘటనపై సమగ్ర నివేదికను అందజేయాలని రాష్ట్ర అటవీశాఖ అధికారులను అసోం సీఎం బిశ్వశర్మ ఆదేశించారు. ఏనుగుల మృతిపట్ల ఆయన తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన జీవాల్లో మూడు పెద్ద ఏనుగులు, నాలుగు పిల్లలు ఉన్నాయి.

నేడు పల్స్ పోలియో

54.07 లక్షల మంది చిన్నారులకు 98.99 లక్షల డోసులు సిద్ధం

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ఆరోగ్య శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఐదేళ్ల లోపు వయసున్న 54,07,663 మంది పిల్లలకు రెండు చుక్కలు వేయనున్నారు. ఆరోగ్య శాఖ రాష్ట్రవ్యాప్తంగా 38,267 పోలియో చుక్కల కేంద్రాలను సిద్ధం చేసింది. చిన్నారుల కోసం 98,99,300 డోసులను అందుబాటులో ఉంచింది. రెండు రోజుల క్రితం ఈ పోలియో డోసులను అన్ని జిల్లాలకు పంపించింది. పల్స్ పోలియో కార్యక్రమ పర్యవేక్షణ కోసం అన్ని జిల్లాలకు నోడల్ ఆఫీసర్లను కూడా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా 76,534 బృందాలను అందుబాటులో ఉంచారు. ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ కాకినాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఆ రోజు పలు కారణాల వల్ల పిల్లలకు చుక్కలు వేయించలేకపోతే.. ఈనెల 22, 23వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం 1,854 మొబైల్ బృందాలను కూడా ఆరోగ్య శాఖ అందుబాటులో ఉంచింది. ప్రతి బృందంలో ఒక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు సభ్యులు ఉంటారు. వీరు ఈ నెల 21 నుంచి 23 వరకు ముందుగా గుర్తించిన పలు ప్రాంతాలు పర్యటించి అక్కడ చిన్నారులకు రెండు చుక్కలు వేయనున్నారు.



శ్రీశైలం డ్యాం ఎదుట ఉన్న ప్లంజ్‌పూల్ గుంత

శ్రీశైలం మరమ్మతులకు

రూ.203.95 కోట్లు!

- నిధుల మంజూరుకు ప్రభుత్వం ఆమోదం
- ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్ల ఏర్పాటుకు 160-180 కోట్లు అవసరమని అంచనా
- ప్రతిపాదనల తయారీలో ఇంజనీర్లు
- సీడబ్ల్యూసీ, సీడీవో సీఈ ఆమోదం పొందిన తర్వాత టెండర్లు పిలిచే యోచన

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

శ్రీశైలం డ్యాం మరమ్మతుల కోసం రూ.203.95 కోట్లు మంజూరుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్లంజ్ పూల్ గుంత డ్యాం వైపు విస్తరించకుండా నూతన ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్ల ఏర్పాటు కోసం ఇంజనీర్లు ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. 2009 వరదల సమయంలో జలాశయం ముందు భాగంలో ఏర్పడిన భారీ గుంత డ్యాం పునాదుల కంటే ఎక్కువ లోతు ఉందని, అది ఆనకట్ట వైపు విస్తరిస్తోందని నిపుణులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రాజెక్టును పరిశీలించిన నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) ఛైర్మన్ అనిల్ జైన్ ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్లు దెబ్బతిన్నట్లు గుర్తించారు. డ్యాం భద్రతకు చర్యలు చేపట్టకపోవడంపై రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ తర్వాత పుణేకు చెందిన సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్లు, తాజా పరిస్థితిపై విశాఖకు చెందిన సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో అధ్యయనం చేయించారు. 62 స్టీల్ సిలిండర్లు పూర్తిగా శిథిలమయ్యాయని, తక్షణమే కొత్త వాటిని ఏర్పాటు చేయకపోతే ప్లంజ్‌పూల్ గుంత డ్యాం వైపు విస్తరించే ప్రమాదం ఉందని ఆ సంస్థ సూచించింది. ఈ విషయాలను 'శ్రీశైలం ప్రాజెక్టుకు డేంజర్ బెల్స్!' శీర్షికన ఆంధ్రజ్యోతి వెలుగులోకి తేవడంతో కూటమి ప్రభుత్వం స్పందించింది.

కొత్త సిలిండర్లకు ప్రతిపాదనలు

శ్రీశైలం డ్యాం రక్షణలో భాగంగా ఆనకట్ట నుంచి 13-15 మీటర్ల పొడవు, 3-4 మీటర్ల మందంతో సీసీ కాంక్రీట్‌తో ఆప్రాన్ నిర్మించారు. వరదలకు ఆప్రాన్ కూడా కాంక్రీట్ పెచ్చులు ఊడిపోతుండటంతో శాశ్వత రక్షణ కోసం ఒక్కోటీ 2 మీటర్ల వ్యాసం, 18-20 మీటర్ల లోతులో 62 సిలిండర్లు ఏర్పాటు చేశారు. గొయ్యి ఆనకట్ట వైపు విస్తరించకుండా ఇవి రక్షణగా నిలిచాయి. వీటిని ఏర్పాటు చేసి 40ఏళ్లు అవుతోంది. 2009లో భారీ వరదక సిలిండర్లు దెబ్బతిన్నాయి. అప్పటినుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. సీలైన్ సంస్థ సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం డ్యాం భద్రతకు ఉపక్రమించింది. ఉమ్మడి కర్నూలు ప్రాజెక్ట్స్ సీసీ కబీర్ బాషా ఆదేశాల మేరకు ప్రాజెక్టు ఈఈ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సమగ్ర అధ్యయనం చేశారు. 62 కొత్త స్టీల్ సిలిండర్ల ఏర్పాటుకు రూ.160-180 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ మేరకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), సెంట్రల్ డిజైనింగ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీరు (సీఈ సీడీవో)కు ప్రతిపాదనలు పంపుతారు. ఆమోదం వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని టెండర్లు పిలుస్తామని ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

అప్రోచ్ రోడ్డు టెండర్‌కు సీవోటీ ఆమోదం

2009 వరదలకు శ్రీశైలం డ్యాం మరమ్మతులు, నిర్వహణలో కీలకమైన అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. డ్యాం రెండువైపులా కొండ రాళ్లు ఊడిపోతున్నాయి. 2014-15 మధ్యలో టీడీపీ ప్రభుత్వం మరమ్మతులు చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేసింది. డ్యాం ఇరువైపుల కొండ రాళ్లు ఊడిపోకుండా రూ.5.90 కోట్లతో షాట్‌క్రీటింగ్ పనులు చేపట్టారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం రూ.25.50 కోట్లతో టెండర్లు పిలిచారు. విజయవాడకు చెందిన బీ అండ్ బీ సంస్థ టెండర్ దక్కించుకుంది. కమిషనర్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ) ఆమోదం తీసుకున్నారు. జూన్ ఆఖరులోగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు ఇంజనీర్లు ప్రణాళిక సిద్ధం చేశారు.



అప్పన్న సేవలో జస్టిస్ విశ్వనాథన్



కప్ప స్తంభం వద్ద జస్టిస్ కె.వి.విశ్వనాథన్

సింహాచలం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.వి. విశ్వనాథన్ శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు ఆయనకు శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. అనంతరం కప్ప స్తంభ ఆలింగనం, బేడా మండప ప్రదక్షిణ, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజ తరువాత ఆలయ పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో న్యాయమూర్తికి ఆశీర్వచనాలిచ్చారు.

జగన్ డ్రామాలు జనం నమ్మరు: మంత్రి సవిత

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పీపీపీ అంటే అర్థం తెలిసీ... ప్రైవేటు అంటూ జగన్ విషం చిమ్ముతున్నాడని రాష్ట్ర మంత్రి సవిత విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'వైసీపీ ఎంపీలు ఢిల్లీలో పీపీపీ విధానానికి మద్దతుగా సంతకాలు చేస్తారు. రాష్ట్రంలో మాత్రం ఆ పార్టీ నాయకుడు దానిని వ్యతిరేకిస్తూ కోటి సంతకాలు అంటూ డ్రామాలు ఆడుతారు. ఆయన డ్రామాలను నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరు' అని మంత్రి సవిత అన్నారు.

వైసీపీకి రాష్ట్రంపై ద్వేషం: పంచుమర్తి

'రాష్ట్రంపై ద్వేషం... యువతపై విద్వేషంతో రాష్ట్రానికి వస్తున్న ఐటీ కంపెనీలను వైసీపీ నాయకులు అడ్డుకుంటున్నారు' అని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 'ఐటీ మంత్రి లోకేశ్ ఉత్తరాంధ్రలో 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ఎంఎన్‌సీ కంపెనీలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తుంటే వైసీపీ నాయకులు వాటిని అడ్డుకుంటూ కోర్టులకు ఎక్కుతున్నారు. రాష్ట్రాభివృద్ధిని, యువత భవితను అడ్డుకునేందుకు వైసీపీ కోర్టుల్లో కేసులు వేసి తన నీచబుద్ధిని చాటుకుంటుంది' అని పంచుమర్తి విమర్శించారు.

లారీలకు వీఎల్‌టీడీ తప్పనిసరి: వైవీ ఈశ్వరరావు

విజయవాడ సిటీ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని లారీలకు వాహన స్థానం గుర్తింపు పరికరం(వీఎల్‌టీడీ) తప్పనిసరిగా అమర్చాలని ఏపీ లారీ ఓనర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు సూచించారు. వీఎల్‌టీడీని తప్పనిసరి చేస్తూ ఈ నెల 19న కేంద్ర ప్రభుత్వ రోడ్డు రవాణా, హై వే మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసిందని శనివారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమర్చిన పరికరాన్ని నిత్యం యాక్టివ్‌గా ఉంచుకోవాల్సిన బాధ్యత లారీ యజమానులపై ఉందని స్పష్టం చేశారు. లేదంటే ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉందని వివరించారు.

లోకాయుక్త జోక్యంతో బోగస్ ఉద్యోగుల తొలగింపు

- 'ఆంధ్రజ్యోతి' కథనాల ఆధారంగా చర్యలు

కర్నూలు లీగల్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు సమర్పించి ఉద్యోగాలు పొందిన ఐదుగురిని ఉద్యోగాల నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్‌కు చెందిన గట్టుపల్లి మల్లెం కొండారెడ్డి, కర్నూలు చెందిన వి.మురళీధర్ రెడ్డి దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. కొంత మంది తమ భూములు తెలుగు గంగ ప్రాజెక్టులో కోల్పోయామని, నకిలీ ధ్రువపత్రాలను సమర్పించి ఉద్యోగాలు పొందినట్టు 'ఆంధ్రజ్యోతి' పత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. వీటి ఆధారంగా ఫిర్యాదుదారులు రాష్ట్ర లోకాయుక్తను ఆశ్రయించారు. ఈ మేరకు కర్నూలులోని రాష్ట్ర లోకాయుక్త తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్‌కు, సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. చీఫ్ ఇంజనీర్ విచారణ చేపట్టి నకిలీ ధ్రువపత్రాలు సమర్పించిన ఐదుగురు ఉద్యోగులు వివిధ పదవుల్లో కొనసాగుతున్నట్టు గుర్తించారు. ఎన్.సూరిబాబు (జూనియర్ అసిస్టెంట్), డి.అనిల్ కుమార్ రెడ్డి (టైపిస్టు), కె.రామమోహన్ రెడ్డి (టైపిస్టు), బి.సుబ్బయ్య (ఆఫీస్ సబార్డినేట్), పి.సురేశ్ కుమార్ (టెక్నికల్ అసిస్టెంట్) నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్టు విచారణలో తేలింది. ఈ మేరకు వారిని ఉద్యోగాల నుంచి తొలగించడమే కాకుండా క్రిమినల్ కేసులు దాఖలు చేయాలని తిరుపతి జిల్లా ఎస్పీకి సిఫారసు చేసినట్టు తెలుగు గంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ తన రిపోర్టును ఈ నెల 16న ఉప లోకాయుక్తకు నివేదించారు. నకిలీ ధ్రువపత్రాలను సమర్పించి ఉద్యోగాలు పొందిన వారిని తొలగించడం సరైన చర్యే అని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని ఉప లోకాయుక్త పి.రజని ఆదేశాలు జారీ చేశారు.

'ఉపాధి'పై దేశవ్యాప్త ఉద్యమం: బీవీ రాఘవులు

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలనే డిమాండ్‌తో దేశవ్యాప్త ఆందోళన చేపడతామని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన జీ-రామ్‌జీ బిల్లుతో ప్రజలకు ఎలాంటి ఉపయోగమూ లేదని స్పష్టం చేశారు. దీనిపై ఏపీలో అధికార టీడీపీతోపాటు వైసీపీ కూడా గట్టిగా మాట్లాడటం లేదని విమర్శించారు. శనివారం విజయవాడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమను హార్టీ కల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతానంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు...సీమ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుపై కూడా దృష్టి సారించాలని కోరారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్వహణ మరింత ప్రమాదకరమని రాఘవులు హెచ్చరించారు.

వందేళ్ల సంబరాలను ఘనంగా నిర్వహించండి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీపీఐ శత వార్షిక ముగింపు ఉత్సవాలు రాష్ట్రంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఈనెల 26 వరకు వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ప్రతి పార్టీ శాఖ కార్యాలయంలో వంద జెండాలు ఎగరేసి, వంద మొక్కలు నాటి పార్టీ వందేళ్ల పండుగ సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని ఆయన ఒక ప్రకటన ద్వారా పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు.

అనుబంధ ఆలయాలపై టీటీడీ దృష్టి

విడిగా బడ్జెట్, ప్రత్యేకంగా కార్పస్ ఫండ్

తిరుపతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటూ దేశంలోని అనుబంధ ఆలయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని టీటీడీ నిర్ణయించింది. ఆలయ నిర్వహణ కోసం ప్రతి గుడికీ ప్రత్యేకంగా కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయ నున్నారు. ఇందుకోసం ప్రతి ఆలయానికీ విడిగా వార్షిక బడ్జెట్‌ను రూపొందిం చనున్నారు. తదుపరి జరగబోయే పాలకమం డలి సమావేశంలో ఈ అంశంపై నిర్ణయం తీసుకోనున్నారు. టీటీడీకి ప్రస్తుతం దేశవ్యాప్తం గా 60 అనుబంధ ఆలయాలు న్నాయి. ఒక్కో ఆలయ నిర్వహణ కోసం ఏటా రూ.60 నుంచి రూ.70 లక్షల వరకు టీటీడీ ఖర్చు చేస్తోంది. భక్తుల సంఖ్య, ఆదాయంతో నిమిత్తం లేకుండా అన్ని అనుబంధ ఆలయాలకూ ఒకే విధంగా ఖర్చు చేయడం వల్ల కొన్ని చోట్ల కొరత ఏర్పడుతుంటే, కొన్ని ఆలయాల్లో అవసరానికి మించి వ్యయం చేస్తున్నట్టు గుర్తించారు. అలా కాకుండా ఆలయం స్థాయి, భక్తుల రాక, ఆదాయం, అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయా లన్న ప్రతిపాదన టీటీడీ దృష్టికి వచ్చింది. ఇందుకోసమే ప్రతి ఆలయానికీ విడిగా వార్షిక బడ్జెట్ రూపొందించాలని నిర్ణయిం చారు. 2026-27 బడ్జెట్ నుంచి ఈ విధానం అమల్లోకి తీసుకురావాలని ప్రయత్నిస్తు_న్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన కసరత్తు మొదలైంది. ప్రతి ఆలయం నుంచి అవసరమైన సమాచారాన్ని టీటీడీ సేకరిస్తోంది. ఆలయానికి రోజువారీ వస్తున్న భక్తుల సంఖ్య ఎంత? ప్రత్యేక దినాల్లో ఎంతమంది భక్తులు వస్తున్నారు వార్షిక బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాల్లో భక్తుల సంఖ్య ఎంత? ఆలయానికి కార్పస్ ఫండ్ ఉందా? హుండీ ఆదాయం ఎంత వస్తోంది? ఏయే ఉత్సవాలు జరుగుతున్నాయి? వాటి కయ్యే వ్యయం ఎంత? ఏటా ఆలయ నిర్వహణకు ఎంత ఖర్చు అవుతోంది.. అంటూ ప్రశ్నావళిని రూపొందించి ఆలయాలకు పంపించారు.

రూ.20 కోట్లతో ప్రతి ఆలయానికీ కార్పస్‌ఫండ్

ప్రతి ఆలయానికీ ఏడాదికి రూ.కోటి వ్యయం చేసేలా ఆదాయం ఉండాలని టీటీడీ భావిస్తోంది. కార్పస్ ఫండ్‌గా ప్రతి ఆలయానికి రూ.15 నుంచి రూ.20 కోట్లు సమకూర్చగలిగితే వడ్డీతోనే ఆలయ నిర్వహణ సజావుగా జరుగుతుందని అంచనా వేస్తున్నారు. కార్పస్ ఫండ్‌కు అవసరమైన మొత్తాన్ని స్థానికంగానే సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. ఈ బాధ్యతను అనుబంధ ఆలయాల సలహా కమిటీలకు, అధికారులకు అప్పగిస్తారు. అనుబంధ ఆలయాలకు ఇప్పటికే ఉన్న జనరల్ అకౌంట్‌తో పాటు అదనంగా అన్నదాన అకౌంట్ కూడా తెరవాలని ఇటీవల సీఎం చంద్రబాబు సూచించిన నేపథ్యంలో ఆ ఏర్పాట్లు కూడా టీటీడీ చేపట్టనుంది. అనుబంధ ఆలయాలకు భక్తులిచ్చే విరాళాలు ఇప్పటివరకూ నేరుగా టీటీడీ ఖాతాలో జమవుతున్నాయి. ఇకపై ఏ ఆలయ ఆదాయం, విరాళాలు అదే ఆలయ అభివృద్ధికి ఖర్చు చేయాలని భావిస్తున్నారు.

ఈశాన్య భారతంలో శ్రీవారి తొలి ఆలయం

- గువాహటిలో 25 ఎకరాలు కేటాయించిన అసోం ప్రభుత్వం

అసోం రాజధాని గువాహటిలో టీటీడీ నిర్మించదలచిన శ్రీవారి ఆలయానికి 25 ఎకరాలు కేటాయించేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. కామరూప్ మెట్రోపాలిటన్ జిల్లాలో 10.8 ఎకరాల భూమిని కేటాయించేందుకు గతంలోనే అంగీకారం తెలిపింది. అయితే సిల్చార్‌లో లేదా డిబ్రూగఢ్‌లో ఆలయం నిర్మించాలంటూ అసోం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి కేకే ద్వివేది ఈ నెల 7న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడికి లేఖ రాశారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి టీటీడీ ఛైర్మన్ తీసుకెళ్లారు. రాజధానిలోనే టీటీడీకి 25 ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ చంద్రబాబు 18న అసోం సీఎంకు లేఖ రాయగా సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. ఈ క్రమంలో ఈశాన్య భారతంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి తొలి ఆలయ నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు అసోం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటామని టీటీడీ ఛైర్మన్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి మంత్రి లోకేశ్ హామీ

79వ రోజు ప్రజా దర్బార్‌లో వినతుల స్వీకరణ



మంగళగిరిలో సెమీ క్రిస్మస్ వేడుకలలో కేక్ కట్ చేస్తున్న మంత్రి లోకేశ్

మంగళగిరి సిటీ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శనివారం 79వ రోజు ప్రజా దర్బార్ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. వారి సమస్యలను సావధానంగా విన్న లోకేశ్ పలు సమస్యల పరిష్కారం కోసం సిబ్బందికి అప్పటికప్పుడే ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీలో మెడికల్ అన్‌ఫిట్ అయిన 170 మంది ఉద్యోగుల పిల్లలకు తగిన ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగులు అనారోగ్య కారణాలతో మెడికల్ అన్‌ఫిట్ అయితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని 2015లో ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసిందని, వైసీపీ హయాంలో ఆ సర్క్యులర్‌ను అమలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. టీడీపీ సానుభూతిపరులమనే కక్షతో వైసీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కాపు రామ చంద్రరావు ప్రోద్బలంతో తమపై నమోదు చేసిన అక్రమ కేసులను రద్దు చేయాలని అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం ఆవులదట్ల గ్రామానికి చెందిన గొల్లా బ్రహ్మానందం విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా పెదరావిపాడులో తమ రెండున్నర ఎకరాల భూమిని వైసీపీకి చెందిన బి.నాగిరెడ్డి, బి.శివరామిరెడ్డి ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని ముండ్లమూరు మండలం నాయుడుపాలేనికి చెందిన ఎం.శారదాంబ, ఎం.సునీత కోరారు.



అలిపిరిలో 'ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్'

- రూ.4 వేల కోట్లతో రూపుదిద్దుకోనున్న వసతి కేంద్రం

తిరుమల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు తిరుపతిలోనే వసతి ఏర్పాట్లు కల్పించేలా అలిపిరిలో 'ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్'కు టీటీడీ శ్రీకారం చుట్టింది. రూ.3 వేల కోట్ల నుంచి రూ.4 వేల కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. శ్రీవారి దర్శనార్థం ప్రస్తుతం రోజూ 60 వేల నుంచి 80 వేల మంది భక్తులు వస్తున్నారు. వారాంతాల్లో, రద్దీ రోజుల్లో ఆ సంఖ్య లక్ష నుంచి 1.50 లక్షలకు చేరుకుంటోంది. తిరుమలలో ప్రస్తుతం 40 వేల నుంచి 50 వేల మందికి సరిపడేలా 7,500 గదులు అందుబాటులో ఉన్నాయి. దీంతో రద్దీ సమయాల్లో తిరుమలపై ఒత్తిడి పెరుగుతోంది. తిరుపతిలో శ్రీనివాసం, మాధవం, విష్ణు నివాసం వంటి భారీ వసతి సముదాయాలున్నా వీటిలో 10 నుంచి 12 వేల మందికి మాత్రమే వసతి లభిస్తోంది. అచ్యుతం, శ్రీపథం వంటి భవనాలు ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నాయి.

25 వేల మందికి వసతి

అలిపిరి సమీపంలోని శిల్ప కళాశాల ప్రాంగణం నుంచి ఓల్డ్ చెక్ పాయింట్ (గరుడ సర్కిల్) వరకు ఈ 'ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్'ను ఏర్పాటు చేస్తారు. ఇందులో గదులు, హాళ్లతో కూడిన లాకర్లు, వందల సంఖ్యలో స్నానపు గదులు, మరుగుదొడ్లు, ఉచిత అన్నప్రసాద వితరణ కేంద్రాలు, ప్రైవేట్ రెస్టారెంట్లు, దుకాణాల సముదాయం, పార్కింగ్, ఆధ్యాత్మిక చింతన కలిగించేలా థియేటర్లు, పార్కు, ఆడిటోరియం ఉంటాయి. ఈ టౌన్‌షిప్‌లో 25 వేల నుంచి 30 వేల మందికి వసతులు కల్పించాలని భావిస్తోంది.

'ఉల్లంఘను'లపై ఏపీ ఎంఎఫ్ఆర్ యాక్ట్

- సమన్వయ కమిటీ సమావేశం నిర్ణయం

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పరిధిలోని సముద్ర జలాల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన మెకనైజ్డ్ బోట్లతో నిబంధనలకు విరుద్ధంగా చేపలవేట సాగించే వారిపై ఆంధ్రప్రదేశ్ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ (ఎంఎఫ్ఆర్) యాక్టు ద్వారా చర్యలు తీసుకోవాలని సమన్వయ కమిటీ నిర్ణయించింది. పుదుచ్చేరి రాష్ట్రానికి చెందిన 4 మెకనైజ్డ్ బోట్లు ఏపీలోని సముద్ర జలాల్లో నిబంధనలకు విరుద్ధంగా వేట సాగిస్తుండగా మత్స్యకారులు నిర్బంధించి నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె హార్బర్‌లో ఉంచిన విషయం తెలిసిందే. ఈ బోట్ల అప్పగింత విషయమై మత్స్య శాఖ ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు పురమందిరంలో మత్స్యకారులు, మత్స్యకార నేతలు, అధికారులతోపాటు పుదుచ్చేరికి చెందిన అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి హైస్పీడ్ మెకనైజ్డ్ బోట్లతో సరిహద్దులు దాటి వేట సాగించడం సర్వసాధారణమైపోయిందని దీన్ని అడ్డుకో వాలని పలువురు మత్స్యకారులు సమా వేశంలో గళమెత్తారు. తమ బోట్లు, వలలు నాశనమైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతకాలంపాటు తమిళనాడు, పుదుచ్చేరి ప్రాంతాల నుంచి ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి రాకుండా ఉంటే ఆ తరువాత బోట్ల అప్పగింతపై నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ తెలియజేశారని ఈసందర్భంగా మత్స్యశాఖ జేడీ కే.శాంతి తెలియజేశారు. దీనిపై పుదుచ్చేరికి చెందిన మత్స్య శాఖ డీడీ నటరాజ్, డైరెక్టర్ ఇస్మాయిల్ కూడా సానుకూలంగా స్పందించారు.

'స్త్రీశక్తి' సమస్యలు పరిష్కరించకపోతే డ్యూటీలు కష్టం

- ఆర్టీసీ ఈయూ అధ్యక్షుడు దామోదరరావు

విజయవాడ(బస్సుస్టేషన్), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం అమలులో డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే విధులు నిర్వహించడం కష్టమని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు స్పష్టం చేశారు. విజయవాడలోని ఆర్‌టీసీ ఈయూ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విద్యాధరపురం డిపో యూనియన్ నిర్మాణ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ఉమ్మడి జిల్లాలకు చెందిన 15 డివిజన్లలో నిలిచిపోయిన పదోన్నతుల సమస్యను వెంటనే పరిష్కరించాల ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతం చేయడంలో ఆర్టీసీ సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తున్నారన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈయూ రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.వి.ప్రసాద్ మాట్లాడుతూ స్త్రీ శక్తి అమలులో ఉద్యోగులపై భారం తగ్గించాలంటే కనీసం మూడు వేల బస్సులను పెంచడంతో పాటు, అన్ని కేటగిరీల్లో ఖాళీగా ఉన్న పది వేల పోస్టులను భర్తీ చేయాలని చెప్పారు.

మల్టీప్లెక్స్ థియేటర్ల రాకతో మామూలు థియేటర్లు మరుగునపడుతున్నాయి. కొన్ని పట్టణాలలో, టౌన్లలో సినిమా హాళ్ళు ఫంక్షన్ హాళ్ళుగా మారుతున్నాయి. ఇళ్లల్లో కూర్చొని, ఓటీటీ ద్వారా వచ్చే సినిమాలు టీవీలలో చూస్తే పోలా!... అనుకుంటున్న ప్రేక్షకుడిని మళ్ళీ సినిమా హాళ్ళకి తీసుకొని వచ్చి, సినిమాలు చూసే పరిస్థితి కల్పించగలరా?

థియేటర్ సినిమాలు కనుమరుగవుతాయా?

నా చిన్నప్పుడు 'లవకుశ' సినిమా చూసేందుకు బండ్లు కట్టుకొని ప్రజలు తండోపతండాలుగా గ్రామాల నుంచి పట్టణాలకు వచ్చేవారు. అలాంటి సినిమాలు చూసిన తరువాత తమ జీవితం ధన్యమైందని అనుకొనేవారని ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు! సామాన్యుడికి ఆనాడు సినిమా చూసేందుకు 'పావలా' నేల టికెట్ సరిపోయేది! నేడు బ్లాకులో మల్టీప్లెక్స్‌లో సినిమా చూసేందుకు, అక్కడ పాప్‌కార్న్ లాంటి ఖరీదైన తినుబండారాలు కొనుక్కునేందుకూ, ఇంటిల్లిపాదికీ వేలకు వేలు ఖర్చు అవుతున్నాయి!

ఆనాటి సినిమాల్లో నవరసాలతో పాటు జనానికి అర్థమయ్యే రీతిలో ఆచరణకు వీలైన చిన్నపాటి సందేశం కూడా ఉండేది! డబ్బులు చేసుకోవటానికే ఆనాటి నిర్మాతలు సినిమాలు తీసేవారు, కానీ పూర్తిగా సినిమాల ద్వారానే వందకు వంద శాతం లాభాలు పొందాలనే పేరాశతో వ్యవహరించక పోయేవారు! ప్రేక్షకులకు వినోదంతో పాటు కలకాలం జ్ఞాపకం ఉంచుకొనే నడవడికనూ, ఏది మంచీ ఏది చెడూ అనే విచక్షణా జ్ఞానాన్ని అప్పటి సినిమాలు అందించేవి! కుటుంబగాథలు, జానపద నాయకుల వీరోచిత సాహసాలూ, క్రూరత్వం ప్రదర్శించిన విలన్లు చివరకు హీరోల చేతుల్లో చావక తప్పదనే నీతితో కూడుకున్న న్యాయం ఉండేది. పౌరాణిక గాథలు– అందులో నటించిన కృష్ణుడు, రాముడు కాలెండర్లను పూజగదుల్లో పెట్టుకొనే రీతిలో సినిమాలు నిర్మాణమయ్యేవి! ఒకటో రెండో 'క్లాస్' సినిమాలను నిర్మాతలు అభిలాషతో తీసినా, కొద్దిపాటి నష్టంతో బయటపడేవి. అలాంటి వాటికి ప్రభుత్వ సాయంతో పాటు, అవార్డులు కూడా దక్కేవి!

ఇప్పటి సినిమా నిర్మాణాలూ, ప్రేక్షకుల ఇక్కట్లూ, ఫ్యాన్స్ అనవసరంగా చేసే హడావిడి వల్ల కలిగే రాద్ధాంతాలూ, శాంతిభద్రతల సమస్యల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు! పేరు తెచ్చుకున్న ఇప్పటి సినిమాలో కూడా ప్రేక్షకుడు రెండున్నర గంటల సినిమాను వీక్షించటానికి నానా హైరానా పడుతున్న తరుణంలో... సినిమా క్రమేపీ సామాన్యుడికి దూరమవుతున్నదా? అని ఆలోచించక తప్పని పరిస్థితి ఏర్పడుతున్నది. ఇందుకు కారణం ఎవరు?



మల్టీప్లెక్స్ థియేటర్ల రాకతో మామూలు థియేటర్లు మరుగునపడుతున్నాయి. కొన్ని పట్టణాలలో, టౌన్లలో సినిమా హాళ్ళు ఫంక్షన్ హాళ్ళుగా మారుతున్నాయి. ఇళ్లల్లో కూర్చొని, ఓటీటీ ద్వారా వచ్చే సినిమాలు టీవీలలో చూస్తే పోలా!... అనుకుంటున్న ప్రేక్షకుడిని మళ్ళీ సినిమా హాళ్ళకి తీసుకొని వచ్చి, సినిమాలు చూసే పరిస్థితి కల్పించగలరా? మన దేశంలో సినిమా పెద్దలు ఏరోజుకారోజు లెక్కలు చూసుకొని సరిపెట్టుకుంటున్నారు. పాన్ ఇండియా సినిమాలు నిర్మిస్తే అంతకంటే కావల్సింది ఏముంది అన్న మోహంలో పడిపోయారు. సాధారణ సినిమాలు జనరంజకంగా తీయొచ్చు అన్న సంగతి గాలికి వదిలేశారు. హీరోలు, దర్శకులు ఒకటి రెండు సినిమాలతో కోటీశ్వరులు కావచ్చని, సినిమా అంటే డబ్బు వచ్చే సోర్స్ అనే భ్రాంతిలో పడిపోయారు. సగటు ప్రేక్షకుడిని మర్చిపోయారు.

టీవీల రాకతో, చానెళ్ళ ఆకర్షణలతో, దృశ్యానుభూతితో పుస్తకాలు చదవటం కాలక్రమేణా కనుమరుగయింది. గొప్పల కోసం ఇంగ్లీషు పుస్తకాలు చదువుతున్నట్లుగా చెప్పుకుంటున్నారు కానీ, తెలుగు మరీ పలచనైపోయి, కేవలం స్కూళ్ళల్లో పాఠ్యపుస్తకాలకే పరిమితమైంది. మారుతున్న సమాజం తీరును ఎవరూ తప్పుపట్టలేరు. కాలానుగుణంగా మార్పులతో ప్రజానీకం ముందుకు నడవక తప్పదు. అయితే పూర్తిగా విలువలు మృగ్యమయ్యే రీతిలో ప్రస్తుత సమాజం వ్యవహరిస్తే భవిష్యత్తులో నష్టపోయేది వారి వారసులే. భాష అనేది భావాన్ని వ్యక్తపరిచే సాధనం. కానీ మనిషిలో నుంచి సహజ తీరులో భావ సంపదను అమర్చుకుంటూ వచ్చే భాష బదులుగా, సంబంధంలేని భాషను పనిగట్టుకొని నేర్చుకోవడమే గొప్ప అనుకొని ప్రవర్తిస్తే నష్టపోయేది మనమే! ఈ ఇంగిత జ్ఞానం వదులుకోకూడదు! 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని శ్రీకృష్ణదేవరాయలు ఊరకే చెప్పలేదు! 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని మరొకరు ఊరకనే పొగడలేదు! అన్ని భాషలను ఆదరిస్తున్న తీరులోనే స్వంత భాషను మెరుగ్గా ఆదరిస్తే– మన గుర్తింపును (ఐడెంటిటీని) మనం కోల్పోకుండా ఉంటాం. మన సంస్కారాన్ని, విలువలను, భావితరాల కోసం నిలబెట్టుకున్న జాతిగా మనగలుగుతాం.

భాష మాదిరే మన సినిమాను కూడా కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వినోదం కోసం చూసే సినిమా ఆర్థిక విషాదం కల్పించకూడదు. అందని ద్రాక్షపండులా తెలుగు సినిమాను ఈ తరం నిర్మాతలూ, దర్శకులూ, నటులూ మార్చటం... సినీ రంగానికి ద్రోహం చేయడమే. కాలక్షేపం కోసం అర్రులు చాచే సామాన్య జనానికి ఉన్న ఒకే ఒక ప్రయోజనాన్ని, అందుబాటులో ఉన్న వినోద సాధనాన్ని గుంజుకొనే వారు ఎంతగొప్పవారైనా, కళామతల్లి ముద్దుబిడ్డలుగా పొగడ్తలను మూటగట్టుకుంటున్న వారైనా సరే– గర్హనీయులే.

పాశ్చాత్య దేశాల్లో కూడా కొంతకాలం పాటు పుస్తకాలు అటకెక్కాయి! టీవీల నీడల్లో అనాదరణకు లోనయ్యాయి. కానీ ప్రస్తుతం కోల్పోయిన ఆదరణను అవి తిరిగి పొందుతున్నాయి. సినిమా విషయంలో హాలీవుడ్‌ను కూడా ప్రశ్నించే 'నెట్‌ఫ్లిక్స్ – వార్నర్ డీల్' కుదిరే స్తున్నది. అసలు సిసలైన సినిమాలకు రూపకల్పన చేసే హాలీవుడ్ పరిశ్రమ కుదేలవుతున్నదా? అన్నదే ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఈ డీల్ కుదిరితే ప్రేక్షకులు కోరుకునే సినిమా కాలగర్భంలో కలిసిపోతుంది. స్వతంత్ర పోకడలతో నిర్మాణాత్మకంగా తీసే సినిమాలకు నిర్మాణాలు కోల్పోతుంది. సినిమాలు చూడటానికి క్యూ కట్టే సగటు ప్రేక్షకుడు నిరాశ తప్పదు. పారామౌంట్ లాంటి సంస్థ ఈ డీల్‌ను తీవ్రంగా ఖండిస్తోంది. సినిమాలు మామూలుగా థియేటర్లలో అందుబాటులో ఉండని పరిస్థితి అక్కడా ఏర్పడనున్నదా? అమెరికన్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ డీల్ సినిమా ప్రేక్షకులకు ప్రమాదకారిగా మారొచ్చని అభిప్రాయపడ్డారు. న్యాయస్థానాలు కల్పించుకొనే అవకాశంతో పాటు, ఈ సమస్యను ఏ విధంగా సామరస్యపూర్వకంగా పరిష్కరించాలన్న ఆలోచనల్లో అక్కడి విజ్ఞులు ఉన్నారు. ఇక్కడ కూడా సినిమా ప్రేక్షకుల మంచి చెడ్డలు చూస్తున్న మేధావులు, సామాజిక కార్యకర్తలు, పాలకులూ కలగజేసుకొని సినిమాను సామాన్యుడికి అందుబాటులోకి తెస్తారని ఆశిద్దాం.

• రావులపాటి సీతారాంరావు

పార్టీ మారిన 'హై కమాండ్'!



▪ రాజ్‌దీప్ సర్దేశాయి

హై కమాండ్! రాజకీయ వ్యవహారాలలో తరచూ వినిపించే వాక్యరణి అది. హై కమాండ్ అనే ఆలోచన బహుళ పార్టీ ప్రజాస్వామ్యానికి భావనాత్మకంగా అసంగతమైనది. పార్లమెంటరీ వ్యవస్థకు ప్రాతిపదికలు అయిన ప్రజా ప్రాతినిధ్యం, జవాబుదారీతనం, పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం మొదలైన సూత్రాలకు హై కమాండ్ ప్రామాణికంగా విరుద్ధమైనది. ఎన్నికైన నిరంకుశ పాలకుడి ప్రభావ ప్రాబల్యాలకు అదొక నిండు తార్కాణం. సంప్రదాయకంగా ఈ పదం కాంగ్రెస్ పార్టీ, నెహ్రూ– గాంధీ కుటుంబంతో ముడివడి ఉంది. ముఖ్యంగా ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా రాజకీయ వర్గాలలోను, సామాన్య ప్రజానీకంలోను కాంగ్రెస్ హై కమాండ్‌గా పేరొందారు. పార్టీ వ్యవహారాలలో తిరుగులేని రీతిలో నిర్ణయాత్మక అధికారాలను చెలాయించడం ఇందిరతోనే ప్రారంభమవడం వల్లే కాంగ్రెస్ హై కమాండ్‌కు ఆమె పర్యాయపదంగా వెలుగొందారు. ఈ రాజకీయ చరిత్ర ఇప్పుడొక ఆశ్చర్యకరమైన మలుపు తిరిగింది. సమకాలీన హై కమాండ్ కాంగ్రెస్ నుంచి బీజేపీకి; 10, జన్‌పథ్ నుంచి 7 లోక్ కల్యాణ్ మార్గ్, 6 ఎ కృష్ణ మీనన్ మార్గ్‌కు మారింది. ఇవి, పదకొండేళ్ల క్రితం వరకు గుజరాత్‌లోను, ఇప్పుడు యావద్భారతంలోను రాజకీయ జోడీ నంబర్ వన్‌గా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధికార నివాసాలని మరి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఈ తాజా పరిణామాన్ని పరిగణనలోకి తీసుకోండి. మొన్నగాక అటు మొన్న భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా 45 ఏళ్ల నితిన్ నబిన్ ఎంపికయ్యారు. అంతకు ముందు ఆయనెవరో మీకు తెలుసా? బిహార్‌లో నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగాను, ప్రస్తుతం ఆ రాష్ట్ర మంత్రిగాను ఉన్న ఈ యువనేత గురించి శ్రద్ధ చూపినవారు ఆ రాష్ట్రం వెలుపల ఎవరూ లేరు. అయితే ఇప్పుడాయన మన జాతీయ పాలక పక్షంలో ఉదయిస్తున్న తారగా, ప్రభవిస్తున్న నాయకుడుగా దేశ ప్రజల దృష్టిలో ఉన్నారు. జగత్ ప్రకాష్ నడ్డా అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడుగా ఎవరు ఎన్నిక లేదా ఎంపిక అవుతారు (కౌన్ బనేగా బీజేపీ అధ్యక్ష) అనే విషయమై అంతూ పొంతూ లేకుండా ఊహాగానాలు జరుగుతున్నాయి. రాజకీయ వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. ఇంతలో, అకస్మాత్తుగా జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు (వర్కింగ్ ప్రెసిడెంట్)గా నితిన్ నబిన్ పేరు ప్రకటించారు(నాన్– వర్కింగ్ ప్రెసిడెంట్ తరహా పదవి ఏదైనా ఉన్నదా ఏమిటి?). కాబోయే కొత్త అధ్యక్షుడు ఎవరో తెలియగానే ఆయనకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు న్యూఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయానికి వెల్లువెత్తారు. ఇలావచ్చిన వారిలో కొంతమంది నితిన్ నబిన్ ఎవరో తాము గుర్తు పట్టలేకపోయామని చెప్పారు.

బీజేపీ అధ్యక్షుడుగా నితిన్ నబిన్ 'ఎన్నిక' పార్టీలో ఎటువంటి అసమ్మతికీ దారి తీయలేదు. ఎవరూ తమ సొంత అభిప్రాయాన్ని బహిరంగంగా వ్యక్తం చేయలేదు, భిన్నాభిప్రాయానికి తావు లేదు. నితిన్ నబినే అధ్యక్షుడు. ఒప్పుకుని తీరవల్సిందే. 'మాది కచ్చితంగా క్రమశిక్షణతో వ్యవహరించే పార్టీ' అని ఒక నాయకుడు సగర్వంగా చెప్పాడు. క్రమశిక్షణను పాటించే పార్టీ కావచ్చు కానీ, ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించే పార్టీయేనా? సంఘర్షణగా మాత్రం కానేకాదు, సందేహం లేదు. బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా నితిన్ నబిన్ 'ఎంపిక' ఆ పార్టీలో విస్తృత సంప్రదింపులు, కీలకమైన చర్చల ద్వారా జరగలేదు. ఎదురు లేని పార్టీ 'హై కమాండ్' అయిన నరేంద్ర మోదీ– అమిత్ షా ద్వయమే ఆయన్ను ఎంపిక చేసింది. అది వారిరువురి సొంత నిర్ణయం. అందులో మరెవ్వరి ప్రమేయమూ లేదు. జోడీ నెంబర్ వన్ నిర్ణయాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఎటువంటి ఆక్షేపణ లేకుండా అంగీకరించింది. సంఘ్ పరివార్‌తో పూర్తిగా ముడివడి ఉన్న కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన నేత కదా నితిన్ నబిన్.

బీజేపీ హై కమాండ్ ఏకపక్ష నిర్ణయం కాంగ్రెస్ పార్టీ నాయకత్వ ఊగిసలాట వైఖరికి ఎంత విరుద్ధంగా ఉన్నదో చూడండి. కర్ణాటకలో సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా కొనసాగించడమా లేక ఆయన స్థానంలో డికె. శివకుమార్‌ను నియమించడమా అనే విషయమై కాంగ్రెస్ నాయకత్వం ఒక పట్టాన నిర్ణయం తీసుకోలేకపోతోంది. 2022లో రాజస్థాన్‌లో సైతం ఏమి జరిగిందో గుర్తు చేసుకోండి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న అశోక్ గెహ్లోత్‌ను కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవిని చేపట్టాలని కోరారు. అయితే ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగేందుకు ఆయన ససేమిరా అన్నారు. పార్టీ నాయకత్వం ఆయన నిర్ణయాన్ని మార్చలేకపోయింది. విధిలేక, ఆయన్ను ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు అంగీకరించింది. రాజకీయ వర్గాలలోను, రాజకీయేతర వర్గాలలోను పేరు ప్రఖ్యాతులు ఉన్న పార్టీ ఎంపీ శశి థరూర్ అనేక కీలక అంశాలపై పార్టీ అధిష్ఠానంతో విభేదిస్తున్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ 'హై కమాండ్' ఆయనతో బహిరంగంగా ఘర్షణపడేందుకు సిద్ధంగా లేదు. పార్టీ క్రమశిక్షణను పాటించడమా అది? కాదు. ప్రజాస్వామ్య వైఖరితో వ్యవహరించడమా? ఒక విధంగా అదే అని చెప్పవచ్చు. ఏది ఏమైనా ఒక విషయాన్ని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు: నేడు బీజేపీలో ఎటువంటి అసంతృప్తినైనా వ్యక్తం చేయడానికంటే, కాంగ్రెస్‌లో గాంధీల సర్వాధిపత్యాన్ని ప్రశ్నించేందుకే ఎక్కువ ఆస్కారమున్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే బీజేపీ శ్రేణులు తమ 'హైకమాండ్'కు భయపడుతుండగా, కాంగ్రెస్ వర్గాలు గతంలో వలే తమ 'హై కమాండ్' మాటను శిరసావహించడం లేదు.

దీన్నిబట్టి కాంగ్రెస్ రాత్రికి రాత్రే ఒక 'ప్రజాస్వామిక' పార్టీగా మారిపోయిందనీ లేదా బీజేపీ అనూహ్యంగా, గతించిన కాలంలోని కాంగ్రెస్ వ్యవహార శైలిని అలవర్చుకున్నదని భావించనవసరం లేదు. నిజమేమిటంటే అంతర్గత ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యమివ్వని శక్తిమంతమైన నాయకుడి కేంద్రిత పార్టీ సంస్కృతి ఫలితమే 'హై కమాండ్'. భయభీతులు, ముఖస్తుతులను అపేక్షించే భూస్వామ్య సంస్కృతి ప్రబలంగా ఉన్న మన రాజకీయ పార్టీలలో శక్తిమంతుడైన నాయకుడి మాటే తుది మాటగా చలామణి అవుతోంది.

కాంగ్రెస్ పార్టీ పది సంవత్సరాలకు పైగా కేంద్రంలో అధికారంలో లేదు. పైగా పలు రాష్ట్రాలలో అధికారాన్ని కోల్పోయింది. ఈ కారణంగా హై కమాండ్ ప్రభావ ప్రాబల్యాలు క్షీణించాయి. ఎంతగా అంటే గతంలో వలే ఎవరూ ఇప్పుడు 'హై కమాండ్'కు భయపడడం లేదు. కాంగ్రెస్‌కు భిన్నంగా బీజేపీ ఇదే కాలంలో శీఘ్రగతిన అపూర్వ విజయాలను సాధిస్తూ దేశవ్యాప్తంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నది. ఇందుకు ప్రధాన కారకులైన జోడీ నెంబర్ వన్ (నరేంద్ర మోదీ, అమిత్ షా) మాటను ఎంత భయభీతులతో పాటించడం జరుగుతుందో ఆ నాయక ద్వయాన్ని అంతగా అభిమానించడమూ జరుగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరుతో ఒక ఎన్నిక తరువాత మరొక ఎన్నికను అప్రతిహతంగా గెలుస్తూ ఉన్నంతవరకు పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం గురించి ఎవరు పట్టించుకుంటారు? బీజేపీలో నిర్ణయాలు తీసుకునే అత్యున్నత వేదిక అయిన పార్లమెంటరీ బోర్డ్ చివరిసారి ఎప్పుడు ఒక జాతీయ సమస్యపై అర్థవంతమైన చర్చ జరిపింది? చెప్పవచ్చిందేమిటంటే ముఖ్యమంత్రుల ఎంపిక మొదలు, పార్టీ వ్యూహాన్ని రూపొందించడం వరకూ అన్నీ జోడీ నెంబర్‌వన్ నిర్ణయాలకు అనుగుణంగా మాత్రమే జరుగుతున్నాయి.



> **అంతర్గత ప్రజాస్వామ్యానికి ప్రాధాన్యమివ్వని శక్తిమంతమైన నాయకుడి కేంద్రిత పార్టీ సంస్కృతి ఫలితమే 'హై కమాండ్'. కాంగ్రెస్ హైకమాండ్ నమూనాకు బీజేపీ హై కమాండ్ నకలు కాదు. కాంగ్రెస్ హై కమాండ్ చాలా నిర్దయగా నిర్ణయాలు తీసుకునేది. మోదీ–షా ద్వయం అటువంటి నిర్దయను తమ పార్టీలో తరం మార్పు సాధించడానికి ఉపయోగిస్తున్నారు.**

2023లో రాజస్థాన్ ముఖ్యమంత్రిగా భజన్‌లాల్ శర్మ ఎంపికే జోడీ నెంబర్ వన్ సర్వాధిపత్యానికి ఒక తిరుగులేని నిదర్శనం. గతంలో రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఉన్న వసుంధరా రాజే 2023లో కూడా ఆ పదవికి పోటీ పడ్డారు. ఎమ్మెల్యేల అభిప్రాయాల ప్రాతిపదికన ఎంపిక చేయడం జరిగి ఉన్నట్టయితే వసుంధరా రాజే తప్పకుండా ముఖ్యమంత్రి అయ్యేవారు. కానీ అలా జరగలేదు. ఆమెకు బదులుగా, మొదటిసారి శాసనసభకు ఎన్నికయిన భజన్‌లాల్ శర్మను ముఖ్యమంత్రిగా ఎంపిక చేశారు. ఈ నిర్ణయం న్యూఢిల్లీలో జరిగింది. జోడీ నెంబర్ వన్ నిర్ణయాన్ని జైపూర్‌లోని పార్టీ బాధ్యులకు తెలియజేశారు. ఆ మాట పార్టీ శాసనసభా పక్షానికి అక్షరాలా ఒక ఆదేశం. ఈ నిర్ణయం పట్ల వసుంధరా రాజే ఆశ్చర్యపోయారు. అదే విధంగా భజన్‌లాల్ శర్మ సైతం నిర్ఘాంతపోయారు.

నరేంద్ర మోదీ– అమిత్ షా 'హై కమాండ్' ఒక విధంగా ఇందిరాగాంధీ రాజకీయ వ్యూహాలు, ఎత్తుగడలు, పద్ధతుల నుంచి గ్రహిస్తున్నదని చెప్పవచ్చు. ఢిల్లీలో ముఖ్యమంత్రులు ఎవరో నిర్ణయించి, సదరు పెద్ద మనిషిని తమ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని రాష్ట్రాల శాసనసభా పక్షాలను ఆదేశించే సంప్రదాయానికి అంకురార్పణ చేసింది ఇందిరాగాంధీయే కాదూ? ఆ ఆనాడు ఆమె మాటను ఏ రాష్ట్ర నాయకులూ జవదాటలేదు. ఇప్పుడు జోడీ నెంబర్ వన్ మాటకు కూడా అటువంటి మన్ననే దక్కుతోంది.

బీజేపీ హై కమాండ్ నమూనా కాంగ్రెస్ హై కమాండ్ నమూనాకు నకలు అని భావించడం పొరపాటు. కాంగ్రెస్ హై కమాండ్ చాలా నిర్దయగా నిర్ణయాలు తీసుకునేది. అవి దృఢమైనవి, అసాధారణమైనవి. మోదీ–షా ద్వయం అటువంటి నిర్దయను, దృఢనిశ్చయాన్ని తమ పార్టీలో అంతర్గతంగా తరం మార్పు సాధించడానికి ఉపయోగిస్తున్నారు. ఇది కాంగ్రెస్, బీజేపీ హై కమాండ్‌ల వ్యవహార శైలుల మధ్య ఉన్న ముఖ్యమైన తేడా. బీజేపీ ముఖ్యమంత్రులు దాదాపుగా అందరూ తమ యాభైలలో ఉన్నవారే. కాంగ్రెస్ పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నం. సప్తపదుల, అష్టపదుల వయసులో ఉన్నవారే పార్టీ పదవులలో ఉంటున్నారు. చట్ట సభలకు ఎన్నికవుతున్నారు.

బీజేపీ 'హై కమాండ్' వ్యూహాత్మక అధికార క్రీడలో ఒక ఆసక్తికరమైన ప్రశ్న ఉన్నది: 'మోదీ తరువాత, ఎవరు?' 61 ఏళ్ల వయసులో ఉన్న అమిత్ షా పార్టీలో ముఖ్యమైన పదవులు అన్నిటినీ జాతీయ స్థాయిలోను, రాష్ట్రాలలోను తన సన్నిహితులకే కట్టబెడుతున్నారు. తద్వారా సంభావ్య వారసత్వ పోటీలో తనకు సానుకూల పరిస్థితుల నేర్పర్చుకుంటూ తన రాజకీయ భవిష్యత్తును నిర్మించుకుంటున్నారు. ఈ కారణంగానే ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడి ఎంపిక అయినా, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడి ఎంపిక అయినా అమిత్ షా ప్రమేయం అత్యంత ప్రభావశీలంగా ఉంటుంది. పార్టీలో ఏ నియామకాలపైన అయినా ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. సరిగ్గా ఈ కారణం వల్లే బీజేపీ హై కమాండ్ తదుపరి నిర్ణయం ఎలా ఉండగలదని జోస్యం చెప్పడం చాలా కష్టం. సమస్యలు, సంకటాలతో కూడుకున్న విషయమది. బీజేపీ 'హై కమాండ్' భావి నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఏ ఒక్కరూ, చివరకు ఆరెస్సెస్ సైతం నిశ్చితంగా చెప్పలేదు. అది గుజరాత్ నుంచి ప్రభవించిన జోడీ నెంబర్ వన్‌కు మాత్రమే తెలుస్తుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

సొంత లాభం కొంత మానుకోలేరా?!

సంపన్నశ్రేణి రిజర్వేషన్ల లబ్ధిదారులు సమాజంలో ఒక మెట్టు ఎక్కిన తరువాత సంతృప్తి చెంది, తమ వెనుక ఉన్నవారి స్థితిని గమనించి, స్వచ్ఛందంగా 'రిజర్వేషన్లు మాకు అవసరం లేద'ని తిరస్కరించవలసింది పోయి, 'తరతరాలకూ వాటి అమలు నీడనే బతుకులు సాగిస్తాం' అనడంకన్నా దౌర్భాగ్యం ఇంకొకటి ఉండదు.

ఎస్సీల్లో ఉన్న రెండు ప్రధాన సామాజిక వర్గాలవారు రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్లకు తామే హక్కుదారులమంటూ నలభై ఏళ్ల పోరాటం చేసి, ఒకరి అభ్యున్నతిని వేరొకరు అడ్డుకుని సభ్య సమాజంలో అవహేళన పాలైన సందర్భాలు అనేకం. వారితో పాటుగా వెనుకబడిన అనేక కులాల వారి స్థితిగతులు నేటికీ ఎంతో దయనీయ స్థితిలో ఉన్నాయి. వీరి వ్యథ ప్రభుత్వాలకు పట్టడం లేదు. పైగా 'మాకంటే వెనుకబడిన కులాలకు రాజ్యాంగ ఫలాలు అందడం లేదు, దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణం' అంటూ వీరే అనేక బహిరంగ సభల్లో నినదించడం హాస్యాస్పదం. కృపాకర్ మాదిగ తన వ్యాసంలో ('క్రీమీలేయర్‌కు రిజర్వేషన్లా?'–నవంబర్ 23) చెప్పినట్లు... రిజర్వేషన్ల పుణ్యమా అని తమ చుట్టూ ప్రహరీగోడ కట్టుకుని భద్ర జీవితాలకు అలవాటుపడటమే కాదు, ఇంజనీరింగ్, డాక్టర్ చదువులు ఎస్సీ కోటాలో పూర్తయిన వారు క్రైస్తవులుగా విదేశాలకు వెళ్లి, మతం, సామాజిక కార్యక్రమాల పేరిట అక్కడి నుంచి నిధులు కొల్లగొట్టే ఎఫ్‌సీఆర్‌ఏలు ఎందరికున్నాయో ఆరాతీయాలి. రెండు వైపులా వీరు ఫలాలను సుష్ఠుగా ఆరగిస్తూ, తరతరాలుగా క్రైస్తవ్యాన్ని నమ్ముకుని ఉన్న బీసీ(సి)ల కడుపు కొడుతున్నారు. ఇది ప్రజలను, ప్రభుత్వాలను మోసగించడం కాదా? రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాలకు వ్యతిరేకం కాదా? ఇది ఆ మహనీయుణ్ణి అడ్డం పెట్టి ఆడుతున్న తంతు. వీరి కుమ్ములాట నేపథ్యంలో మిగిలిన వెనుకబడిన కులాలవాళ్లు తమ బాగోగుల విషయం అడగడం మర్చిపోయేలా చేశారు. వాళ్లసలు ఎక్కడ.. రోడ్ల పక్కన పిల్లాజెల్లతో కూటికి, గూడుకు నోచక, ఏ చెట్ల కింద తలదాచుకుంటున్నారో ఆ దేవుడికే ఎరుక. ఈ విషయంలో ఇంతవరకు జరిగిన దారుణమంతా కేవలం రిజర్వేషన్లు సక్రమంగా అమలుకు నోచుకోని కారణంగా కొనసాగుతోందని సహృదయతతో గుర్తించాలి. సొంతలాభం కొంత మానుకోవడానికి సిద్ధపడాలి. తక్షణమే ఈ ఆట కట్టించి, సమాజంలోని అసమానతలను రూపుమాపవలసిన బాధ్యత న్యాయస్థానాలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది.

○ కోట శామ్యూల్ రవీంద్రనాథ్

> **"బాణాలతో, విల్లంబులతో పోరాటం మొదలుపెట్టిన వియత్నాం ప్రజలు, వారిని కమ్యూనిస్టు విప్లవకారులు సంఘటితం చేశాక, ఈ భూమండలంలోనే అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని ఓడించగలిగారు." ప్రజా పునాది బలంగా ఉంటే ఎంతటి టెక్నాలజీనైనా దీటుగా ఎదుర్కోవచ్చునని వియత్నాం విప్లవం రుజువు చేస్తున్నది.**


కమ్యూనిస్టు విప్లవాల్ని టెక్నాలజీతో అణచగలరా?

గత 60 ఏళ్ళుగా భారతదేశంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మావోయిస్టులు నడిపిన ఉద్యమాలన్నీ, కనుమరుగయ్యే దశకు చేరుకున్నాయనే వ్యాఖ్యానాలు వినవస్తున్నాయి. ఆ ఉద్యమాలు బలహీనపడడానికి ఎన్ని కారణాలున్నా, ప్రధానమైన కారణం– ప్రభుత్వాల చేతుల్లో ఉన్న 'అత్యంత ఆధునిక టెక్నాలజీ' అనే వాదన ఇప్పుడు విరివిగా వినిపిస్తోంది. నేను ఈ వ్యాసంలో ఇక్కడి మావోయిస్టుల గురించి కాకుండా 'కమ్యూనిస్టు ఉద్యమాలను టెక్నాలజీతో పాలకులు నిజంగా అణచగలరా?' అనే విషయం గురించి మాత్రమే మాట్లాడదలుచుకున్నాను. దీనికి ఉదాహరణగా, దక్షిణ వియత్నాంలో కమ్యూనిస్టు విప్లవకారులు జరిపిన పోరాటాన్ని తీసుకుంటున్నాను. ఆ దేశ ప్రభుత్వానికి మద్దతుగా అమెరికా సైన్యం 10 వేల మైళ్ళ నుంచి వచ్చి, స్థానిక సైనికులతో కలిసి విప్లవకారుల మీద, అప్పటికి ఉన్న అత్యాధునిక టెక్నాలజీతో దాడులు చేసింది. దాదాపు పదేళ్ల పాటు సాగిన ఆ యుద్ధంలో చివరికి వియత్నాం విప్లవకారులు విజయం సాధించారు. దీనికి సంబంధించిన వివరాలు 'వియత్నాం' మీద రాసిన పుస్తకాలలో, వ్యాసాలలో దొరుకుతాయి. అలా కనపడే పుస్తకాల్లో ఒకటి– నిక్‌టర్స్ అనే అమెరికా జర్నలిస్టు పరిశోధించి రాసిన పుస్తకం 'కదిలే ప్రతిదాన్నీ చంపెయ్యి: 1965–73ల మధ్య అమెరికా యుద్ధ నేరాలూ, వియత్నాంలో దాని అకృత్యాలూ.'

'టెక్నోవార్'గా (టెక్నాలజీని ఉపయోగించిన యుద్ధంగా) పేరున్న ఆ యుద్ధం ఎలా జరిగిందో చూడండి– దట్టమైన అడవుల్లో, భూమి మీద ఉన్న విప్లవ సైన్యం కదలికల్ని గగనతలం నుంచి ఫొటోలు తీసి, కింద ఉన్న తన సైన్యానికి సమాచారం అందించే 'లైటెనింగ్ బగ్' అనే యూఏవీ (Unmanned Aerial Vehicles) డ్రోన్లను అమెరికా సైన్యం వాడింది. దీనికి వ్యతిరేకంగా వియత్నాం విప్లవకారులు రకరకాల పద్ధతులను అనుసరించారు. నేలమీద విప్లవ సైనికుల కదలికలూ, ఆయుధ రవాణా పైన తిరిగే డ్రోన్లకు కనపడకుండా, చెట్లకొమ్మలకు బరువైన రాళ్ళు కట్టి వంచడం ఒక పద్ధతి. కుండీల వంటి వాటిల్లో మొక్కల్ని పెట్టి చెట్లకి వేళ్ళాడగట్టడం ఇంకో పద్ధతి. దానివల్ల పై యూఏవీలకు నేల మీద వెళ్తున్నవాళ్ళు కనపడరు. అలాగే, వీలైనంత వరకూ పాద ముద్రలూ వగైరా కనపడకుండా నడవడం, పొగ పైకి పోకుండా వంటలు చేయడం, చప్పుళ్ళు రాకుండా మాట్లాడుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకునేవాళ్ళు. పైన తిరిగే డ్రోన్లకు నేల కనిపించని వాతావరణ పరిస్థితుల్ని వాడుకునేవారు. కింద ఎగిరే డ్రోన్లను రకరకాల విమాన విధ్వంసక ఫిరంగులతో కూల్చేవారు.

పాదచారులూ, సైక్లిస్టులు ఎక్కువగా ఉండే వియత్నాం మీదకు అమెరికా యుద్ధ ట్యాంకులను, మంటలు విసిరే ట్యాంకులను పంపింది. రహదారుల్లో సాయుధ శకటాలూ, నదుల మీద ప్రయాణానికి మరపడవలూ, భూ భాగంలోకి విమానాలను తీసుకెళ్ళే యుద్ధ నౌకలూ వగైరాల్నీ; నిప్పులు చిమ్మే రాకెట్ లాంచర్లనూ ఆ దేశం మీదకు అగ్రరాజ్యం ప్రయోగించింది. వీటన్నిటికీ వ్యతిరేకంగా స్థానిక ప్రజలే తిరగబడే విధంగా ప్రజలను సంఘటితం చేసింది కమ్యూనిస్టు పార్టీ. నాడు దేశవ్యాప్తంగా రైతు సంఘాలూ, కార్మిక సంఘాలూ, విద్యార్థి సంఘాలూ ఏర్పడి పనిచేస్తూ ఉండినాయి.

అక్కడితో అయిపోలేదు. దాదాపు పది పదిహేను ఎకరాలలో ఉన్న చెట్లను కూడా భస్మీపటలం చెయ్యగలిగే 'డెయిసీ కట్టర్' బాంబులను వియత్నాంపైకి అమెరికా ప్రయోగించింది. ఏకే 47 తుపాకుల కంటే వేగం తక్కువైనా, ఎక్కువ నష్టం కలగజేసే ఎం.16 రైఫిళ్ళనూ అగ్రరాజ్య సైన్యం ఉపయోగించింది. కొన్ని వందల రౌండ్ల తుపాకీగుళ్ళు ఉండే ఎం.60 మెషీన్‌గన్స్‌ను అమెరికా సైన్యం వాడింది. వియత్నాం విప్లవ గెరిల్లాల దగ్గర పాత రైఫిళ్ళూ, స్థానికంగా తయారు చేసుకున్న గ్రెనేడ్లూ, చిన్న స్థాయి ఫిరంగులూ మాత్రమే ఉండేవి. అయినప్పటికీ, ఉత్తర వియత్నాం లోని కమ్యూనిస్టు ప్రభుత్వం దక్షిణాది విప్లవకారులకు ఇచ్చిన ఆయుధ సహకారం కూడా ఎంతో ఉపయోగపడింది.



అనేక మారణాయుధాలతో పాటు, 3 లక్షల 88 టన్నుల 'నాపాం' బాంబుల్ని అమెరికా సైన్యం, వియత్నాం మీద వేసింది. రెండు కోట్ల గ్యాలన్ల విష రసాయనాలను పొలాల మీదా, జలాశయాల లోనూ, ఊళ్ళ పైనా విమానాలతో చల్లించారు. ఆ బాంబులూ, విష రసాయనాలూ దాదాపు 40 లక్షలమంది మరణాలకూ, ప్రాణాంతక రోగాలకూ కారణమయ్యాయి. తర్వాత కాలంలో క్యాన్సర్లూ, మృత శిశువుల జననాలూ, పుట్టిన పిల్లలకు మెదళ్ళలో అనేకానేక లోపాలూ, ఎముకల బలహీనతలూ, వెన్నుపూసల్లో జబ్బులూ– ఇలా ఎన్నో దౌర్బల్యాలు!

వియత్నాంలోని 'మైలై' అనే గ్రామంలో జరిగిన ఒక సంఘటన ఆ దేశ ప్రజలమీద అమెరికా సైన్యం చేసిన అతి కిరాతక దాడికి నిదర్శనం. పొద్దున్నే వంట చేసుకుంటున్నప్పుడు, సైనికుల పటాలం వచ్చి ఆ గ్రామం మీద పడి, ఆడవాళ్ళనూ, పిల్లలనూ, వృద్ధులనూ ఇలా దాదాపు 500 మంది నిరాయుధుల్ని చంపేసింది. కోళ్ళనూ, పందులనూ, ఆవుల్నీ, గేదెల్నీ... కదిలే ప్రతీ దాన్నీ సైన్యం చంపింది (అందుకే, 'నిక్' తన పుస్తకానికి 'కదిలే ప్రతీ దాన్నీ చంపు' అనే పేరు పెట్టాడు). హత్యలూ, చిత్రహింసలూ, అత్యాచారాలూ, జనాల నివాసాలను ఖాళీ చేయించడాలూ, ఇళ్ళు తగలబెట్టడాలూ, ఎడాపెడా అరెస్టులూ, జైళ్ళల్లో పెట్టడాలూ నిత్యమూ కొనసాగేవి, అమెరికా సైన్యం ఉన్నంత కాలమూ! ప్రజల తరపున పోరాడుతున్న వియత్నాం జాతీయ విముక్తి సైన్యానికీ, ప్రజలకూ మధ్య సఖ్యత ఉండేది. జనాల్ని ఆ విముక్తి సైన్యం నుంచి వేరు చేయాలని, అమెరికా చేసిన ఎత్తుగడలు ఎన్నో! అవేవీ ఫలించలేదు. విప్లవ సైనికులకు తిండీ, ఆశ్రయమూ కల్పిస్తున్నారనే నెపంతో, 'వ్యూహాత్మక గూడేలు' ('స్ట్రాటజిక్ హామ్లెట్స్') పేరుతో నిర్బంధ శిబిరాల్లాంటివి ఏర్పరిచి, జనాల్ని అక్కడ బంధించింది అగ్రరాజ్యం. అమెరికా బంట్లుగా ఉన్న దక్షిణ వియత్నాం పాలకులు, తమ సైన్యాన్ని అమెరికా సైన్యంతో కలిపి, ప్రజలమీద దాడులకు పంపేవాళ్ళు. కానీ, విప్లవం పురోగమించే కొద్దీ– 1974లో దక్షిణ వియత్నాం సైనికులు, దాదాపు 2 లక్షల మంది సైన్యాన్ని వదిలి, ప్రజలపక్షం వైపే చేరారు.

ఇన్ని మాటలు ఎందుకు, ఆ నాటికి ప్రపంచంలో ఉన్న అభివృద్ధి చెందిన టెక్నాలజీ అంతటినీ వియత్నాం మీద అమెరికా ప్రయోగించిందని అనేక యూనివర్సిటీల పరిశోధనలు తెలిపాయి. ఇన్ని అకృత్యాలు జరిగినా, 1970లో ఒక వియత్నాం నాయకుడు అన్నట్టు... 'దూరం నుంచి విసిరే 'బి–52' రకం బాంబులూ, కంప్యూటర్లూ ఏవీ న్యాయమైన పోరాటంతోనూ, ప్రజల తెలివితోనూ పోటీ పడలేవు.'

అమెరికా అత్యాధునిక మిలిటరీ టెక్నాలజీని వాడినా, ఎంతటి క్రూరత్వాన్ని ప్రదర్శించినా, వేల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టినా, లక్షలాది మంది జీవితాలు నాశనం చేసినా– ఐసెన్ హోవర్, కెనడీ, జాన్సన్, నిక్సన్, ఫోర్డ్ ఇలా నలుగురు అధ్యక్షులు ఒకరి తర్వాత ఒకరు ఎన్ని రకాల కుటిల ప్రయత్నాలు చేసినా, వియత్నాం వంటి అతి చిన్న దేశాన్ని ఏమీ చెయ్యలేకపోయారు.

దీనికంతటికీ ప్రధాన కారణం– వియత్నాం ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యం. ఒక అమెరికా చరిత్రకారుడు అన్నట్లు... "బాణాలతో, విల్లంబులతో పోరాటం మొదలుపెట్టిన వియత్నాం ప్రజలు, వారిని కమ్యూనిస్టు విప్లవకారులు సంఘటితం చేశాక, ఈ భూ మండలంలోనే అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని ఓడించగలిగారు." ప్రజా పునాది బలంగా ఉంటే ఎంతటి టెక్నాలజీనైనా దీటుగా ఎదుర్కోవచ్చునని వియత్నాం విప్లవం రుజువు చేస్తున్నది. అయితే, ఆ ప్రజలకు నాయకత్వం వహించగలిగే 'కమ్యూనిస్టు' పార్టీ చాలా ముఖ్యం! ఆ పార్టీకి వర్గపోరాట సిద్ధాంతమైన మార్క్సిజం తెలిసివుండాలి. ఈ విషయాన్ని గ్రహించిన ఒక వియత్నాం కమ్యూనిస్టు నాయకుడు, ఆ రోజుల్లోనే– 'కార్ల్‌మార్క్స్ చూపిన మార్గంలో ముందుకు' అని ఒక వ్యాసం రాశాడు. 'వందేళ్ళ పాటు వలసవాదాన్ని వదుల్చుకోలేక పోవడానికి కారణం శాస్త్రీయ దృక్పథం (మార్క్సిజం) అలవర్చుకోక పోవడమే' అని ఆ వ్యాసంలో పేర్కొన్నాడు. వియత్నాం అనుభవం చెప్పేదేమిటంటే... విప్లవాలు సఫలం కావాలన్నా, విఫలం కావాలన్నా కావలిసింది టెక్నాలజీ కాదు, ప్రజాబలమే.

▪ బి.ఆర్. బాపూజీ



- వచ్చే వారంలో రెవెన్యూ శాఖ నోటిఫికేషన్
- ఇంకా ఆమోదం తెలపని 43 మంది యజమానులు

శంకర్‌విలాస్ ఆర్‌వోబీకి.. భూసేకరణ

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అడ్డంకిగా మారిన భవనాలను తొలగించేందుకు తప్పనిసరి భూసేకరణ అస్త్రాన్ని ప్రయోగించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భూమిని ఇవ్వాలని గత ఏడాదిన్నరగా భవన యజమానుల ఆమోదం కోసం చేస్తోన్న ప్రయత్నాలు ఫలించకపోవడంతో అధికారులు ఈ నిర్ణయానికి వచ్చారని సమాచారం. భవనాలను తొలగించకపోవడంతో విద్యుత్ స్తంభాలను మార్చేందుకు కుదరడం లేదు. అలానే పిల్లర్ల నిర్మాణానికి ఆటంకాలు కలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భవన యజమానుల ఆమోదం కోసం వేచి చూడటం అనవసరమని భావించిన యంత్రాంగం వచ్చే వారంలోనే తప్పనిసరి భూసేకరణ నోటిఫికేషన్‌ని జారీ చేయనున్నది. దాని ప్రకారం 60 రోజుల వ్యవధిలోనే కట్టడాలను తొలగించి భూమికి చట్టప్రకారం నష్టపరిహారం చెల్లించేసి రోడ్లు, భవనాల శాఖకు ఆయా స్థలాలను స్వాధీనం చేయనున్నారు. ఇప్పటికే చాలా మంది సమ్మతిని తెలిపారు. కోర్టుకు వెళ్లిన వారిలో 16 మంది వెనక్కు వచ్చి కార్పొరేషన్‌కు తమ అంగీకారాన్ని తెలిపారు. అయితే 43 మంది మాత్రం ముందుకు రాకపోవడంతో పనుల్లో వేగం మందగించింది.

పెమ్మసాని ప్రత్యేక దృష్టి

బ్రిడ్జిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సంబంధిత ప్రభుత్వ శాఖలు, కాంట్రాక్టర్‌కు షెడ్యూల్‌ని నిర్దేశించి ఆ ప్రకారం పనులు జరిగేలా చేస్తోన్నారు. 2026 డిసెంబరు నెలాఖరు కల్లా పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ నుంచి అంగీకారం కూడా తీసుకున్నారు. అలానే 2027 మార్చి నాటికి బ్రిడ్జి ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తామని ముందుకొచ్చేలా చేశారు. ఇవి జరగాలంటే భూసేకరణ, రైల్వే పరంగా ఉన్న అడ్డంకులు తొలగిపోవాలి. భూసేకరణకు వెళ్లాలని తాజాగా జేసీ అశుతోష్ శ్రీవాస్తవను పెమ్మసాని ఆదేశించారు. రైల్వేయార్డుపై ఉన్న వంతెన తొలగించేందుకు 500, 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన క్రేన్లను ఉపయోగించాలని సూచించారు. అలానే స్టాండ్‌బైగా మరో క్రేన్ సిద్ధం చేసుకోవాలన్నారు. తద్వారా రైల్వే బ్లాక్‌లను 36 నుంచి 25 వరకు తగ్గించే దిశగా ముందుకెళ్లాలని ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణంతో రైల్వే కోల్పోయే స్థలానికి ప్రత్యామ్నాయంగా వేరే చోట అంతే విలువ కలిగిన భూమిని నగరపాలకసంస్థ సమకూర్చింది. దీనికి సంబంధించి రైల్వే బోర్డు నుంచి ఆమోదం కొద్ది రోజుల్లోనే వచ్చేలా చూడాలని కనస్ట్రక్షన్ అధికారులను ఆదేశించారు.

జేసీ ఏ విధంగా స్పందిస్తుందో...

శంకర్‌విలాస్ ఆర్‌వోబీ విషయంలో తప్పనిసరి భూసేకరణకు జిల్లా యంత్రాంగం నిర్ణయించిన దృష్ట్యా బెటర్ శంకర్‌విలాస్ ఫ్లైవోవర్ పేరుతో ఏర్పాటైన జేఏసీ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి. ఇందుకు కారణం ఇటీవలే జేఏసీ కోర్టుని ఆశ్రయించడంతో హైకోర్టు కమిషనర్‌ని నియమించి విచారణ కూడా జరిపించింది.



పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే దంపతులు



కల్యాణం.. కమనీయం

- గోవింద నామస్మరణతో తరించిన భక్తులు
- శ్రీవారి రాకతో చిన్న తిరుపతిగా పిడుగురాళ్ల
- యరపతినేని దంపతుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం
- భక్త జన సందోహంతో కిక్కిరిసిన జానపాడు రోడ్డు

(పిడుగురాళ్ల, గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం

స్వామి వారి కల్యాణ క్రతువులో వేద పండితుడు

పిడికిట తలంబ్రాల పెండ్లి కూతురు.. కొంత పెదమ రలి నవ్వీనె పెండ్లి కూతురు.. అంటూ అన్నమయ్య సంకీర్తన లీలగా వినపడుతున్న వేళ లైమ్ సిటీలో శ్రీవేంకటేశ్వరుడి కల్యాణ మహోత్సవం శనివారం సాయంత్రం కన్నుల పండువగా సాగింది. తిరు మలపై కొలువై ఉన్న వేంక టేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవం వేద మంత్రోశ్ఛరణలు.. మం గళ వాయిద్యాల మధ్య.. భక్తుల గోవింద నామ స్మరణతో పిడుగురాళ్లలో ఆద్యంతం అంగరంగ వైభవం గా జరిగింది. ఓం నమో వెంకటే శాయ.. గోవిం దా.. గోవిందా అన్న నామస్మరణతో పట్టణం మారుమోగింది.

గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో శ్రీవారి పరిణయ మహోత్సవం అట్టహాసంగా జరిగింది. గోవిందుని పెళ్లి వేడుకను చూసేందుకు అశేష జనవాహిని తరలిరాగా పిడుగురాళ్ల పులకించిపోయింది. గడచిన వైసీపీ పాలనలో ప్రజల మధ్య ఏర్పడిన (మిగతా 8వ పేజీలో)

ఒక్కొక్కటిగా.. అంగీకారు ఇస్తున్నారు!

చోర్‌గ్యాంగ్ కేసులో మరో మూడు కార్లు..

- ఇప్పటి వరకు 15 కార్లు స్వాధీనం..
- మొత్తం 50 వరకు విక్రయించినట్లు నిందితుల అంగీకారం?
- కొనుగోలు చేసిన నలుగురు పోలీసు అధికారులు
- కేసు విచారణ వేగవంతం.. రేపటి వరకు పోలీసు కస్టడీ



రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

కార్ల విలువ రూ.4 కోట్లు..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)


చోర్ గ్యాంగ్ నేరాలపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ముఠా విక్రయించిన మరో మూడు కార్లను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇప్పటికి మొత్తం 15 కార్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో స్వాధీనం చేసుకున్న కార్లను నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీసు కస్టడీలో ఉన్న గ్యాంగ్, అదుపులో ఉన్న ఇద్దరిని పోలీసులు విచారిస్తున్నారు. కొన్ని కార్లకు నంబర్లు కూడా లేవు. కొన్నింటికి రిజిస్ట్రేషన్‌లు కూడా జరగలేదు. తెలంగాణ రిజిస్ట్రేషన్ కార్లు కూడా ఇందులో ఉన్నాయి. వాటి చాసిస్, రిజిస్ట్రేషన్ నంబర్లను సేకరించి రవాణశాఖ పరిశీలనకు పంపారు. ఇందులో నకిలీ నంబర్లు ఉన్నట్లు గుర్తించారు. నలుగురు పోలీసు అధికారులకు ఈ ముఠా కార్లు ఇచ్చినట్లు విచారణలో వెల్లడయిందని సమాచారం.

అత్యంత ఖరీదైన కార్లను గ్యాంగ్‌లీడర్, ఏఎస్ఐ శ్రీనివాసరావు కొడుకు వెంకట అనుజ్ఞ నాయుడు, పుల్లంశెట్టి మహేష్, షేక్ నబీ బాషా, నాలి వెంకటరావు మరో ఇద్దరు గ్యాంగ్‌లోని సభ్యులు విక్రయించారు. ఇన్నోవా, కియా, ఫార్చునర్ వంటి ఖరీదైన కార్లు కూడా వీటిలో ఉన్నాయి. వాటికి మీడియా, లాయర్ స్టిక్కర్లు కూడా అంటించి ఉన్నాయి. ఫార్చునర్‌తో పాటు మరో రెండు కార్లకు రిజిస్ట్రేషన్లు జరగలేదు. తాత్కాలిక నంబర్లు కొన్నింటికి ఉన్నాయి. రూరల్ పోలీసులు ప్రతి కారు వివరాలను నమోదు చేశారు. ఇందులో.. రూ.25 లక్షల నుంచి రూ.60 లక్షల విలువైన కార్లు కూడా ఉన్నాయి. వీటి విలువ రూ.4 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో మరో కేసు

చోర్ గ్యాంగ్‌పై నరసరావుపేట ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో మరో కేసు నమోదైంది. గ్యాంగ్‌తో పాటు మరో నలుగురిపై కూడా కార్లకు సంబంధించి కేసు నమోదు చేశారు. ఒక ఫైనాన్స్ సంస్థ నుంచి ప్రసాద్, చంద్రశేఖర్, రఫీ, భాను అనే వ్యక్తులు (మిగతా 8వ పేజీలో)

పరపతి పోతే రాదు.. అది కొనుక్కోలేము.. దానిని కాపాడుకోవాలి. అని మన పెద్దలు చెప్తూ ఉంటారు. పరపతి.. క్రెడిట్ స్కోర్.. అంటే ఆర్థిక క్రమశిక్షణగా కూడా భావించాలి. మానవ జీవనంలో ఆర్థిక క్రమశిక్షణ కీలకంగా మారింది. దీనినే సిబిల్ స్కోర్‌గా రుణ సంస్థలు, బ్యాంకులు పిలుస్తున్నాయి. గతంలో రుణాల మంజూరులో దీనిని పరిశీలించేవారు. అయితే ఇప్పుడు పెళ్లి, ఉద్యోగ విషయాల్లో కూడా ఇది ప్రామాణికంగా మారింది. ఈ మధ్య వివాహం చేసుకోబోయే వ్యక్తి క్రెడిట్ స్కోర్ తక్కువుగా ఉందని ఓ యువతి పెళ్లికి నిరాకరించింది. సిబిల్ స్కోర్ తక్కువుగా ఉందని ఓ ప్రభు త్వ బ్యాంకు ఉద్యోగ నియామకాన్నే రద్దు చేసింది. ఈ రెండు ఘటనలు చూస్తూంటే సిబిల్ స్కోర్ ఎంత కీలకమో అర్థం చేసుకోవాలి. నేటి సాం కేతిక యుగంలో సిబిల్ స్కోరే ప్రామాణికంగా మారిపోయింది. రానున్న కాలంలో ఇదే అర్హతగా మారునుందా అంటే పై సంఘట నలు చూస్తే అవునంటున్నాయి. స్కోర్ తక్కువుగా ఉంటే ఆందోళన.. బాగా ఉంటే సంతోషం.



పరపతే.. ప్రామాణికం

- డిజిటల్ యుగంలో సిబిల్ స్కోరే కీలకం
- వ్యక్తి ఆర్థిక క్రమశిక్షణ అంచనాకు ఇదే ఆధారం
- చదువులో మార్కులు కంటే ఈ స్కోరే ముఖ్యం
- వ్యక్తుల గుణ గణాలను నిర్ణయిస్తున్న గణాంకాలు
- ఉద్యోగుల బయోడేటా, పెళ్లి చూపుల్లోనూ ప్రధానం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఇద్దరు స్నేహితులు కలిస్తే కుటుంబాల యోగక్షేమాలు.. వచ్చే జీతం, పొదుపు, పిల్లల చదువు.. భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చించుకునేవారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో యోగక్షేమాల కంటే క్రెడిట్ స్కోర్ పైనే మాట్లాడుకుంటున్నారు. చిరు వ్యాపారి నుంచి ఉన్నతాధికారి వరకు.. టీ స్టాల్స్, ఫంక్షన్లు అన్ని చోట్లా ఈ స్కోర్‌పైనే చర్చలు. ఉద్యోగాలతో పాటు పెళ్లిచూపులకు పంపే బయోడేటాలో సిబిల్ తెలిపే ప్రత్యేక ఆప్షన్ పెడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవాలి. పెళ్లి చూపులు, ఉద్యోగ బయోడేటాలో సిబిల్ స్కోర్‌ను విధిగా అడుగుతున్నారు. స్కోర్ తక్కువుగా ఉంటే పక్కన బెట్టేస్తున్నారు. ఈఎంఐ (మిగతా 8వ పేజీలో)

s.u.n.d.a.y s.p.e.c.i.a.l

రైల్వే ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేయిస్తామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని శంకరన్ మినీ హాల్‌లో శనివారం జరిగిన సమావేశంలో రైల్వే ప్రాజెక్టులపై ఆయన సమీక్షించారు. నిర్లిప్తత వహించకుండా అధికారులు చొరవ చూపిస్తేనే ప్రాజెక్టులు పూర్తి అవుతాయని స్పష్టం చేశారు. వచ్చే



సమీక్షలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

రెండేళ్లలో గుంటూరు నగర పరిధిలోని అన్ని లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ఆర్‌వోబీల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నందివెలుగు ఆర్‌వోబీ పెండింగ్ పనులు జూలై 2026 నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తామన్నారు. ఇన్నర్‌రింగురోడ్డు (గడ్డిపాడు) వద్ద ఆర్‌వోబీ పనులు మార్చిలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామన్నారు. పలకలూరు రోడ్డులోని ఎల్‌సీ గేటు వద్ద కూడా ఆర్‌వోబీని త్వరగా ప్రారంభిస్తామన్నారు. నెహ్రూనగర్, మంగళగిరిలోని నిడమర్రు ఆర్‌వోబీల పనులు మూడు నెలల్లో ప్రారం భిస్తామన్నారు. శ్యామలానగర్ ఆర్‌వోబీపై జాయింట్ ఇన్‌స్పెక్షన్ తర్వాత టెండర్ ప్రక్రియ ప్రారంభమౌతుందన్నారు. సంజీవయ్య నగర్ ఆర్‌వోబీ ప్రతిపాదనని ప్రస్తుతానికి నిలుపుదల చేస్తున్నా మన్నారు.

తెనాలిలో వందేభారత్‌కు స్టాపేజ్

సికింద్రాబాద్ - తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కి తెనాలిలో స్టాపేజ్ కోసం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రతిపాదించారని పెమ్మసాని చెప్పారు. దీనిని రైల్వేకు నివేదించగా సానుకూల స్పందన వచ్చిందని, త్వరలోనే నిర్ణయం వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద సుందరంగా తీర్చిదిద్దిన మంగళగిరి రైల్వేస్టేషన్ ని త్వరలో ప్రజలకు అంకితం చేస్తామన్నారు. గుంటూరు రైల్వే స్టేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గడ్డిపాడు ఆర్ వోబీని గుంటూరు - విజయవాడ రహదారి దాటిన తర్వాత ల్యాం డింగ్ చేసేలా చూడమని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కోరారు. న్యూ గుంటూరు రైల్వేస్టేషన్ సమీపంలో సీతానగర్ వద్ద కూడా ఆర్‌వో బీని నిర్మించాలని ప్రతిపాదించారు. మళ్లీ అధికారంలోకి వస్తే అధి కారులు, కాంట్రాక్టర్లను జైలులో పెడతానని హెచ్చరిస్తున్న జగన్‌పై కేసు పెట్టాలని ఎమ్మెల్సీ ఆలపాటి డిమాండ్ చేశారు. సమావేశంలో జేసీ శ్రీవాస్తవ, కమిషనర్ శ్రీనివాసులు, రైల్వే చీఫ్ అడ్మిన్ ఆఫీసర్ సందీప్ జైన్, రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

రెండు చుక్కలతో పోలియో దూరం

ర్యాలీ ప్రారంభోత్సవంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు వేసే రెండు చుక్కలతో పోలియో మహమ్మారిని పూర్తిగా అరికట్టవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్ వద్ద శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఏర్పాటు చేసిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులను పోలియోబూత్‌కు తీసుకొచ్చి పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలు 2,14,981 మంది ఉన్నారని, వారి కోసం 2,57,980 డోసులు, 12,899 వాయల్‌లు సిద్ధం చేశామన్నారు. పోలియో చుక్కలు వేసిన తర్వాత మూడు రోజులు ఇంటింటి పర్యవేక్షణ చేసి చుక్కలు వేయని పిల్లలను గుర్తించి, వేయడం జరుగుతుందన్నారు. గుంటూరులో నాలుగో రోజు కూడా ఈ కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శ్రావణబాబు, పాల్గొన్నారు.



పల్స్ పోలియో ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

విద్యార్థుల ప్రదర్శన



యువత నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- కేఎల్‌యూలో ముగిసిన యువజనోత్సవాలు

8

ప్రైవేటు కొరియర్లకు దీటుగా పోస్టాఫీసులు

8

- కేంద్ర మంత్రి పెమ్మసాని
- వీఐటీలో జెన్ జెడ్ పోస్టాఫీసు ప్రారంభం

వాణిజ్యంలా వ్యవసాయం

- అప్పుడే రైతులకు మేలు
- ఎన్‌జీ రంగా వర్సిటీ విస్తరణ సంచాలకులు డా. శివన్నారాయణ

గవర్నర్ సతీమణికి స్వాగతం



పొన్నూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు సతీమణి జయశ్రీ కంభంపాటి శనివారం పట్టణంలో మనస్ఫూర్తిగా లభించింది. ఆమె తన స్వగ్రామం నిడుబ్రోలుకు విచ్చేశారు. డాక్టర్ జయశ్రీని తహసీల్దార్ మహమ్మద్ అబ్దుల్ హఫీజ్, అర్బన్ సీఐ వీరనాయక్ మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

ఏఎన్‌యూలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర



వ్యర్థాలు సేకరిస్తున్న రిజిస్ట్రార్

ఏఎన్‌యూ, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వర్సిటీ రిజిస్ట్రారు సింహాచలం, వాలంటీర్లతో కలిసి.. ఇంజనీరింగ్ కళాశాల, వర్సిటీ ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, పిచ్చి మొక్కలను తొలగించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడోవ శనివారం వాలంటీర్లందరూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ప్రిన్సిపాల్ సీహెచ్. లింగరాజు, ఓఎస్డీ ఆర్‌వీఎస్ఎన్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ వి.దివ్యతేజోమూర్తి, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ సీహెచ్. రవికుమార్, డాక్టర్ కె.సునీత పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు

బాపట్ల, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యలంక సముద్ర తీరంలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ 69వ రాష్ట్రస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలు శనివారంతో ముగిశాయి. అండర్-17 బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి జట్టు విజయం సాధించింది. కృష్ణా జట్టు రన్నర్‌గా, విజయనగరం, నెల్లూరు జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో కడప విజేతగా నిలిచింది. తూర్పు గోదావరి ద్వితీయ స్థానం, గుంటూరు, విజయనగరం తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అండర్-14 బాలుర విభాగంలో విజయనగరం విజయకేతనం ఎగురవేసింది. చిత్తూరు ద్వితీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో గుంటూరు జట్టు విన్నర్ కాగా, పశ్చిమ గోదావరి ద్వితీయ స్థానం సాధించింది. అండర్-19 బాలుర విభాగంలో నెల్లూరు విజేత కాగా, తూర్పు గోదావరి ద్వితీయ స్థానం సాధించింది. బాలికల విభాగంలో కృష్ణా విజేత కాగా, కడప ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకులు రజనీ నాయక్, శిరీష, ప్రధానోపాధ్యాయురాలు యు వి.సుధారాణి తదితరులు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



గెలుపొందిన జట్లతో నిర్వాహకులు

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

● కేజేఎస్ఎస్ అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి



మాట్లాడుతున్న హరేంద్రనాథ్ చౌదరి, సమితి పాలక వర్గ సభ్యులు

గుంటూరు (తూర్పు), డిసెంబరు 20(ఆంధ్ర జ్యోతి): కుల, మతాలకు అతీతంగా కమ్మజన సేవా సమితి (కేజేఎస్ఎస్) ఆధ్వర్యంలో ఉపకార వేతనాలు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి తెలిపారు. గుంటూరులోని.. కుందుల రోడ్డులో ఉన్న బాలికల వసతి గృహంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివి 2025 పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన బాలికలు ఈ ఉపకార వేతనాలకు అర్హులని తెలిపారు. గ్రామీణ బాలికా విద్యను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. పది పరీక్షల్లో 85 శాతం, అంతకంటే ఎక్కువ మార్కులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 80 శాతం, దివ్యాంగులు, తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయిన వారు 50 శాతం మార్కులు సాధించి ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు ఉండాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు ఆదివారం నుంచి వసతి గృహంలో గాని లేదా.. కమ్మజనసేవ సమితి వెబ్‌సైట్ ద్వారా ఉచితంగా పొందవచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 30వ తేదీలోపు సమితి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 83309 34815, 99087 02222 నంబర్లకు సంప్రదించాలన్నారు. ఎంపిక చేసిన విద్యార్థినులకు రూ.7వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో గౌరవ సలహాదారు వంకాలయపాటి బలరామకృష్ణయ్య, కార్యదర్శి కన్నెగంటి బుచ్చయ్య చౌదరి, కోశాధికారి కావూరి రవిచంద్ర, సంయుక్త కార్యదర్శి ఘంటా పున్నారావు, సభ్యులు కరణం పట్టాభి సీతారామయ్య పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.7.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	142, 151, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

ఓవరాల్ ఛాంపియన్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల

● ముగిసిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ జాస్తి ఉషారాణి, అధ్యాపకులు

గుంటూరు(విద్య), డిసెంబరు20 (ఆంధ్ర జ్యోతి): స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ప్రాంతీయ స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ శనివారం ముగిసింది. క్రీడా పోటీల్లో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జాస్తి ఉషారాణి వెల్లడించారు. విద్యార్థినులకు వాలీబాల్, షాట్ పుట్, లాంగ్ జంప్, డిస్క్ త్రో, చదరంగం, టేబుల్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్ డబుల్స్, రన్నింగ్ తదితర పోటీలు నిర్వహించారు. ప్రాంతీయ స్థాయిలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

● డీసీసీబీ ఛైర్మన్ మక్కెన



నూతన ఉద్యోగులతో ఛైర్మన్ మక్కెన తదితరులు

గుంటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కొత్తగా విధుల్లో చేరిన ఉద్యోగాలు అంకితభావంతో పనిచేయాలని జీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. ఇటీవల ఐబీపీఎస్ రాత పరీక్ష ద్వారా ఎంపికైన అసిస్టెంట్ మేనేజర్లు, స్టాఫ్ అసిస్టెంట్‌లకు గుంటూరు బ్రాడీపేటలోని ఎన్టీఆర్ సహకార భవన్‌లో ఛైర్మన్ మక్కెన నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన సిబ్బంది పారదర్శకంగా సేవలందించాలని కోరారు. ఎంతో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఫణికుమార్, పలువురు అధికారులున్నారు.

మాతృ భాషలో డిజిటల్ కంటెంట్‌ను.. విస్తృతంగా వినియోగించాలి

● ఏఎన్‌యూ ప్రిన్సిపాల్ ఎం.సురేష్‌కుమార్



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రతినిధులు

గుంటూరు(విద్య),డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): మాతృ భాషల్లో డిజిటల్ కంటెంట్ విస్తృతంగా అందుబాటులోకి రావాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్‌కుమార్ అన్నారు. వడ్ల మూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు, ఇతర భారతీయ, విదేశీ భాషల విభాగం ఆధ్వర్యంలో.. భారతీయ భాషా సమితి, విద్యా మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న భారతీయ భాషా పరివార్ - భారతీయ భాషల అధ్యయనంలో పారడైమ్ షిఫ్ట్ అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న సదస్సు శని వారం ముగిసింది. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం.సురేష్‌కుమార్ మాట్లాడుతూ కృత్రిమ మేధ ఆధారిత అనువాద మోడళ్లు భాషా అవరోధాలను తొలగించి భాషల మధ్య అనుసంధానాన్ని బలపరుస్తున్నాయన్నారు. ఒక భాష లో సమాచారం మరో భాషలో వేగంగా, కచ్చితంగా అందించడంలో కృత్రిమ మేధ అనువాద సాంకేతికత కీలక భూ మిక పోషిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆంగ్ల ప్రొఫెసర్ సీఎల్ఎల్ జయప్రద మాట్లాడు తూ జాతీయ విద్యావిధానం భారతీయ భాషల ద్వారా విద్యా పరిశోధనకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. సీబీఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.సురేష్ బాబు మాట్లాడుతూ వేద గణిత సూత్రాలను ఆధునిక భాష మోడళ్లతో అనుసంధానించడం ద్వారా గణిత బోధన మరింత సులభంగా మారుతుందన్నారు. వీసీ ఆచార్య పి.నాగభూషణ్ పాల్గొన్నారు.

గుంటూరు టౌన్-1 డివిజన్ ఈఈగా పీహెచ్ ఖాన్

గుంటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ సీపీడీసీఎల్ గుంటూరు టౌన్-1 డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పి.హుస్సేన్‌ఖాన్ నియమితులయ్యారు. దీంతో ఆయన పోస్టింగ్‌లో మూడు వారాల సందిగ్ధానికి తెరపడింది. గుంటూరు సర్కిల్‌లో కీలకమైన గుంటూరు టౌన్-1 ఈఈ పోస్టింగ్‌లో పీహెచ్ ఖాన్‌తో పాటు ప్రస్తుతం సీఆర్‌డీఏలో టెక్నికల్ ఈఈగా వ్యవహరిస్తున్న జె.హరిబాబు పోటీపడ్డారు. చివరకు ఖాన్‌ను ఆపరేషన్ నియమిస్తూ సీఎండీ పి పుల్లారెడ్డి శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీచేశారు. విద్యుత్ శాఖలో ఏఈగా నియమితులైన ఖాన్ గుంటూరు సర్కిల్‌లో ఏడీఈగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఇటీవల పదోన్నతుల్లో భాగంగా ఆయనను బాపట్ల సర్కిల్‌లో ఈఈగా బదిలీ చేశారు. తాజాగా గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈగా నియమితులయ్యారు. ఉత్తర్వులు వచ్చిన వెంటనే పీహెచ్ ఖాన్ నల్లచెరువులోని డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. అక్కడ ఈఈగా వ్యవహరిస్తున్న శ్రీనివాసబాబు రిలీవ్ అయ్యారు. ఎస్ఈగా పదోన్నతిపై విజయవాడ కార్పొరేట్ కార్యాలయంలో ఆపరేషన్ జీఎంగా సోమవారం శ్రీనివాసబాబు బాధ్యతలు స్వీకరించనున్నారు.

వైకుంఠపురంలో.. ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు ప్రారంభం



స్వామి వారిని ఊరేగిస్తున్న భక్తులు

తెనాలి అర్బన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వైకుంఠపురంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 30న నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పది రోజుల పాటు స్వామి అమ్మవార్లను పట్టణంలో ఘనంగా ఊరేగించనున్నారు. తొలిరోజు స్వామిని మత్స్యావతారంలో అలంకరించి పూజలు గావించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. జనవరి 11న ఆలయంలో కుడార్లై ఉత్సవం, 13న శ్రీగోదా కల్యాణం, 15న స్వామి అమ్మవార్ల తెప్పోత్సవం వైభవంగా జరుగుతాయని, భక్తులు జయప్రదం చేయాలని ఈవో అనుపమ కోరారు. స్వామి వారి సన్నిధిలో నూతనంగా తులాభార సేవ ప్రారంభించామని తెలిపారు. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం సందర్భంగా స్వామి వారికి నివేదించే 25 కిలోల లడ్డూ బహిరంగ వేలం నిర్వహిస్తామని చెప్పారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టణంలో మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు.

ఆటోడ్రైవర్ దారుణ హత్య



హత్యకు గురైన వెంకట్రావు

తాడేపల్లిటౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బండరాయితో తలపై మోదడంతో ఓ ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాడేపల్లి పోలీసుల కథనం ప్రకారం.. బ్రహ్మానందపురానికి చెందిన ఇళ్ల చెరువు వెంకట్రావు (33) ఆటో నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18వ తేదీ రాత్రి పట్టణంలోని కత్తులపేట, అంజిరెడ్డి కాలనీ పొలాల మధ్య రోడ్డులో బ్రహ్మానందపురం ఇంటికి వెళుతుండగా ఈ ఘటన జరిగింది. అదే రోడ్డుపై సాయి అనే వ్యక్తి స్నేహితులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటుండగా.. అక్కడికి వచ్చిన ఆటోడ్రైవర్ వెంకట్రావు సడెన్ బ్రేక్ వేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో గొడవ పెద్దదై.. సాయి తన స్నేహితులతో కలిసి వెంకట్రావును బండరాయితో కొట్టి చంపాడు. రోడ్డు పక్కనే ఉన్న అరటి పొలాల్లో శవాన్ని పడేశారు. స్థానిక రైతు శుక్రవారం పొలంలో మృతదేహం ఉందని సమాచారం అందించడంతో తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నారు. ఈ ఘటనలో నిందితులుగా ఉన్న మలినేని సాయి, వేమూరి మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా, వెంకట్రావు అంజిరెడ్డి కాలనీకి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం నేపథ్యంలో తమ మధ్య గొడవలు జరిగాయని.. మృతుడి భార్య దుర్గ చెబుతోంది. తన భర్త మృతి చెందినట్లు వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ తనకు ఫోన్ చేసి చెప్పిందని వెల్లడించింది. ఆమె తాలూకా వారే కక్షగట్టి.. ఈ హత్య చేశారని ఆరోపించింది. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న దేగల ప్రభాకర్

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్ర ప్రైమ్' ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ చైర్మన్ దేగల ప్రభాకర్ హాజరు అయ్యారు. కేక్‌ను కట్ చేసి హాస్పిటల్ సిబ్బందికి సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. చైర్మన్ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఘనంగా చేసుకునే పండగ క్రిస్మస్ అని అన్నారు. క్రీస్తు ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న పెమ్మసాని

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకుమాను, గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఓల్డ్ క్లబ్ రోడ్డు ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సెమీ క్రిస్మస్ వేడుక అంటే ప్రేమకు ప్రతిరూపం అని, ప్రేమకు ప్రతీక, శాంతికి సందేశమని చెప్పారు. సమాజంలో నేడు ఎన్నో అసమానతలు ఉన్నాయని, అయినా సరే అందరూ సమానంగా ఎలా ఉండాలి? అనే దానికి క్రైస్తవంలో సమాధానం దొరుకుతుందన్నారు.



కోవెలమూడి నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, మేయర్ నాని, ఎమ్మెల్యే నసీర్ తదితరులు

కోవెలమూడి నారాయణరావుకు ఘన నివాళి

● హాజరైన కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రముఖులు

గుంటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా శ్రీ సత్యసాయిబాబా సేవా సంస్థల అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త, మేయర్ కోవెలమూడి రవీంద్ర(నాని) తండ్రి కోవెలమూడి నారాయణరావు ప్రథమ వర్ధంతి (సంవత్సరీకం) కార్యక్రమం ఘనంగా జరిగింది. గుంటూరు నగరంలోని ఎస్‌హెచ్ 16 వద్ద గల శ్రీ సత్యసాయి బాబా సేవా సంస్థ ట్రస్ట్ ప్రాంగణంలో నగర మేయర్, తెలుగుదేశం పార్టీ జోన్-5 ఇన్‌చార్జ్ కోవెలమూడి రవీంద్ర(నాని) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నారాయణరావు చిత్రపటానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నివాళులర్పించారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, తెనాలి శ్రావణ్ కుమార్, మొహమ్మద్ నసీర్, ఎం.ఎస్ రాజు, బాష్యం విద్యాసంస్థల అధినేత బాష్యం రామకృష్ణ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్, ఏపీ కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి, ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఉడా కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావు, జనసేన నాయకులు బోనబోయిన శ్రీనివాసుయాదవ్, గాదె వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ సజీల, బీజేపీ నాయకులు శనక్కాయల ఉమాశంకర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రముఖ వ్యాపార వేత్తలు చుక్కపల్లి రమేష్, చుక్కపల్లి సురేష్, గల్లా రామచంద్రరావు, తులసి రామచంద్ర ప్రభు, భరత్‌రెడ్డి, మాదాల చైతన్య, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర, జిల్లా, నగర ముఖ్యనాయకులు, డివిజన్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు, శ్రీ సత్యసాయి ట్రస్టు సేవాసంస్థల కమిటీ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు నిడదవోలులో ప్రతిభకు పట్టాభిషేకం

● రూ.14 లక్షల 50 వేల స్కాలర్‌షిప్పుల పంపిణీ



తులసి యోగీష్‌చంద్ర

గుంటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ ప్రివిలేజ్ గుంటూరు, ఏపీ ఆంధ్రప్రదేశ్ కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, తూర్పుగోదావరి జిల్లా శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిభాపురస్కారాలను 410 మంది విద్యార్థులకు రూ.14 లక్షల 50 వేలు ఉపకార వేతనాలు ఆదివారం పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసీ యోగీష్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో 196 మంది విద్యార్థులకు రూ.6 లక్షల 50 వేలు తులసి సీడ్స్ వారు కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్ ద్వారా పేద విద్యార్థులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. నిడదవోలులో ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తులసి గ్రూప్ సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తారని తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ సాధ్యం

● నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత ద్వారానే దోమల నివారణ సాధ్యమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. స్థానిక శ్యామలనగర్‌లోని మదర్‌థెరిస్సా విగ్రహం వద్ద దోమలపై దండయాత్ర పేరుతో అభ్యుదయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్లాష్‌మాబ్ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో, కాల్వల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కమిషనర్ సూచించారు. దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.రోహిణీదేవి, రోటరీ క్లబ్ ఆఫ్ అమరావతి అధ్యక్షులు అనురాధ, శివకుమార్, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర కోసం ప్రమాణం చేయిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాస్

గాడ్గేబాబాకు భారతరత్న ప్రకటించాలి

గుంటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సామాజిక సమస్యలపై యుద్ధం చేసిన సంత్ గాడ్గేబాబాకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఏపీ రజక జన సేవా సంఘం ఆధ్వర్యంలో అరండల్‌పేటలో శనివారం సంత్ గాడ్గే బాబా 69వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గాడ్గేబాబా పేద విద్యార్థుల కోసం హాస్టల్స్, అన్నదాన సత్రాలు, పశువులకు శాలలు నిర్మించిన గొప్ప సమాజ సేవకుడు అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ప్రభుదాసు, శివయ్య, వెంకటేశ్వరరావు, రాజేష్‌రావు, కృష్ణానాయక్, పెనుమాక రమాదేవి, మానేపల్లి దుర్గారావు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ పనుల్లో భాగం గా బ్రాడీపేట, కొబాల్డ్‌పేట ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎస్.రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రీన్ స్కిల్స్‌పై యువత దృష్టి పెట్టాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్ తదితరులు

గుంటూరుకార్పొరేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువత గ్రీన్ స్కిల్స్‌పై దృష్టి సారించాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పర్యావరణంలో అవకాశాలు అనే థీమ్‌తో శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో వివిధ సంస్థలు, విద్యా సంస్థలు ప్రదర్శనలు ఏర్పాటు చేశాయి. ఈ స్టాల్స్‌ను ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ పులి శ్రీనివాసుతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి నెల ఒక థీమ్‌తో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల "పర్యావరణంలో అవకాశాలు" అనే థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రదర్శనలో విద్యార్థులు మంచి ఆలోచనలతో వచ్చారని అభినందించారు. భవిష్యత్తులో ఏ కోర్సులకు ఎక్కువ డిమాండ్ ఉంటుందో విద్యార్థులు వాటిపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త విధానాన్ని తీసుకువచ్చారని వివరించారు. మహిళలు లాక్ పతి దిదిలుగా ఎదుగుతున్నారని చెప్పారు. జిల్లాలో అత్యధిక సంఖ్యలో లాక్ పతి దిదిలు రావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, పర్యావరణం జీవితంలో అతి ముఖ్యమైనదన్నారు. ఇండోర్ వంటి నగరాల్లో వ్యర్థ పదార్థాల నుంచి బయో ఇంధనం తయారు చేస్తున్నారని తెలిపారు. నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ, పర్యావరణంలో అవకాశాలపై ప్రభుత్వం, బ్యాంకులు, సాంకేతిక సంస్థలు ఇచ్చే సహకారం అందిపుచ్చుకొని విజయవంతం కావాలన్నారు. నగరంలో ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. చెత్త నుంచి సంపద తయారీపై పెద్ద ఎత్తున దృష్టి సారించాలని సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, స్థానిక కార్పొరేటర్ సమత, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఉద్యానశాఖ ఉప సంచాలకులు రవీంద్రబాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎండీ నజీనా బేగం, జిల్లా ఉపాధి కల్పన అధికారి, ఇన్‌చార్జ్ జిల్లా విభిన్న ప్రతిభావంతులశాఖ సహాయ సంచాలకులు డి.దుర్గాబాయి, నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుందరరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడిగా వ్యర్థాలను విభజించాలి : కమిషనర్

గుంటూరుకార్పొరేషన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో నూతన ఏడాది నుంచి ప్రతి ఇంట్లో తడిపొడి చెత్తను విభజించి జీఎంసీకి అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా నగరపాలక సంస్థ, సాహస్, వాష్ స్వచ్ఛంద సంస్థలు శని వారం ఇన్నర్ రింగ్ రోడ్‌లోని డీఆర్‌ఎం కన్వెన్షన్ హాల్లో ప్రజారోగ్య కార్మి కులు, మెప్మా రీసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ శిబిరం ఏర్పాటు చేసింది. కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, తడి, పొడి వ్యర్థాల విభ జనకు ఇప్పటికే వార్డ్ సచివాలయాల వారీగా ప్రజలకు అవగాహన కల్గించడానికి మెప్మా ఆర్పీలను కేటాయించినట్లు చెప్పారు. చెత్తను విభజన చేసిన వారికి తగిన పారితోషికం కూడా అందిస్తామన్నారు.

రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి

నగరంలో ప్రధాన రోడ్ల వెంట, డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణల తొలగింపు నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. శనివారం రైలుపేట, రత్నగిరి నగర్, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్డు ఆక్రమణలను, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

● డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట 104 సిబ్బంది నిరసన

గుంటూరు(తూర్పు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులపై భవ్య హెల్త్ కేర్ సర్వీస్ సంస్థ చేస్తున్న వేధింపులు ఆపాలని 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. సంస్థ చేస్తున్న అన్యాయాలకు నిరసనగా శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట 104 సిబ్బంది ధర్నా చేపట్టారు. లక్ష్మణరావు మాట్లాడుతూ, ఉద్యోగులకు తగ్గించిన వేతనాలు, రద్దుచేసిన క్యాజువల్ లీవులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చాట్ల రాంబాబు సస్పెండ్‌ను వెంటనే ఎత్తి వేయాలన్నారు. నిరసనల్లో గోరంట్ల సురేష్, శ్రీ హర్ష, ఐ.నాగులు, ఏడుకొం డలు, సత్యరాజ్, బాలకృష్ణ, సాయిరామ్, హరి, విజయ్ పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధికి సమష్టి కృషి చేయాలి

ఏఎన్‌యూ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికాభివృద్ధికి పౌరులందరూ సమష్టి కృషి చేయాలని ఏఎన్‌యూ సైన్సు కళాశాల ప్రిన్సిపాల్ వీరయ్య అన్నారు. వర్సిటీ సైకాలజీ విభాగం రెండు రోజుల సదస్సులో శనివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఆందోళనకు సరైన పరిష్కారం కనుగొనాలన్నారు. సైకాలజీ విభాగ అధ్యాపకుడు జి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ప్రతి వందమందికి ఒక మానసిక విశ్లేషకుడు ఉండాలని సుప్రీం కోర్టు సూచించిందన్నారు. అనంతరం విద్యార్థులతో చర్చ గోష్టి నిర్వహించారు. డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ విమల, ఆచార్య ప్రసాద్‌బాబు, రాజేశ్వరరావు, ఆడం పాల్, అనుపమ, లక్ష్మి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో సాంకేతికత కీలకం

ఏఎన్‌యూ, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫారెస్ట్రీ విభాగాన్ని శనివారం కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నాగరాజు సందర్శించారు. ఆయన మాట్లాడుతూ అటవీ వనరులు స్థిరమైనవన్నారు. పర్యావరణ పరిరక్షణలో శాస్త్ర సాంకేతికత పాత్ర కీలకమన్నారు. ఫారెస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.మల్లికార్జున, ఉమామహేశ్వరరావు, ప్రొఫెసర్లు ఎ.అమృతవల్లి, ఎస్.ఎం.ఖాసిం, డాక్టర్ జె.మాధవ, డాక్టర్ సి.ఎస్.రాజు, కె.బాబు, కె.నాగరాజు, డాక్టర్ ఆర్.విజయ్, మనోజ్, తణ్వీక పరిశోధన విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి, పాల్గొన్న బీజేపీ నాయకులు

దేశ గౌరవాన్ని నిలిపిన నేత వాజ్‌పేయి

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి

గుంటూరు (తూర్పు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి పునాది వేసిన దార్శనీకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని యోగి భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాజ్‌పేయిను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆ జిల్లా ప్రధాన కేంద్రాలలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ చేస్తున్నట్లు చెప్పారు. డిసెంబరు 25న అమరావతి, అటల్ వనంలో జరిగే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, అమరావతిలో జరిగే సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో యడ్లపాటి స్వరూపరాణి, దర్శనపు శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, బజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనివాస్, దేసు సత్యనారాయణ పాల్గొన్నారు.

మహాత్ముని అవమానిస్తున్న కేంద్ర ప్రభుత్వం

గుంటూరు (తూర్పు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్పు, సవరణల బిల్లును మోదీ ప్రభుత్వం ఆమోదించడం ద్వారా మహాత్మా గాంధీని అవమానించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి విమర్శించారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల ఉపాధిని దెబ్బతీసే కుట్రలకు వ్యతిరేకంగా ఈ నెల 22న దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, నళినికాంత్ మాట్లాడుతూ, 20 ఏళ్లుగా చట్టబద్ధ హక్కుగా కొనసాగుతున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం అన్యాయమన్నారు. కేంద్ర నిధులు 90 నుంచి 60 శాతానికి తగ్గించడం వల్ల ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. 22న లాలాపేట హిమని సెంటర్ వద్ద జరిగే నిరసనలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో మేడా హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పోలీసులకు పతకాలు

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించిన 44వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ - 2025లో గుంటూరు జిల్లా పోలీసులు సత్తా చాటారు. జిల్లా పోలీస్ విభాగానికి చెందిన ముగ్గురు ఏఎస్‌ఐలు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డు కలిపి మొత్తం ఆరుగురు పోలీస్ సిబ్బంది పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 14 గోల్డ్, 3 సిల్వర్, 1 బ్రాంజ్ వెరసి మొత్తం 18పథకాలు సాధించారు. 35 ప్లస్, 45 ప్లస్, 50ప్లస్, 55 ప్లస్, 60 ప్లస్ వయస్సు విభాగాలలో నిర్వహించిన పరుగు, రేస్ వాక్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హ్యామర్ త్రో, హైజంప్, హర్డిల్స్ వంటి వివిధ క్రీడా పోటీల్లో పాల్గొని గుంటూరు జిల్లా పోలీస్ విభాగానికి రాష్ట్ర స్థాయిలో పేరు తెచ్చారు. పతకాలు సాధించిన పోలీస్ సిబ్బంది శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ 50, 60 ఏళ్ల వయస్సు లోనూ ఛాంపియన్‌షిప్‌లలో పాల్గొని పతకాలు సాధించడం అత్యంత ప్రశంసనీయం, గర్వకారణమన్నారు.



పతకాలు సాధించిన పోలీస్ సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం : వెస్ట్ డీఎస్పీ

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు తాత్కాలిక ఉత్సాహం ఇచ్చినా, జీవితాన్ని పూర్తిగా నాశనం చేస్తాయని వెస్ట్ డీఎస్పీ అరవింద్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఆధ్వర్యంలో అరండల్‌పేట సీఐ ఆరోగ్యరాజు అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో "సంకల్పం - మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం" అనే కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే మానసిక, శారీరక దుష్ప్రభావాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. వెస్ట్ డీఎస్పీ అరవింద్ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాలు వినియోగించడం, విక్రయించడం, సరఫరా చేసే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తూ, కఠిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. సీఐ ఆరోగ్యరాజు మాట్లాడుతూ అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నివారణ కొరకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎస్‌ఐలు నరసింహారావు, కళాశాల ప్రిన్సిపల్ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని లాలాపేట పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం పాత గుంటూరులోని గాంధీ బొమ్మ సెంటర్లో నివాసం ఉంటున్న ప్రకాశం జిల్లా మార్కాపురం మండల పరిధిలోని బొందపాడు గ్రామానికి చెందిన ఏరువ కాశిరెడ్డిని అరెస్టు చేసి ఆయన నుంచి 13 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. లాలాపేట పోలీస్‌స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ వివరాలు వెల్లడించారు. ఈనెల 8న రాత్రి పాత గుంటూరులోని పాదర్తివారివీధిలో పగడాల వెంకటరెడ్డి తన ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో లాలాపేట సిఐ ఏవీ శివప్రసాద్, ఎస్‌ఐ వెంకటరావు, సిబ్బంది కలసి గాంధీ పార్క్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఏరువ కాసిరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారించగా 13 ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్లు చెప్పాడు. తన వద్ద మెకానిక్స్ షేక్ జానీ సైదా, గుంటూరు నారాయణరెడ్డి ఒక్కో ద్విచక్ర వాహనాన్ని 10 వేల చొప్పున కొనుగోలు చేసినట్టు కాశిరెడ్డి చెప్పాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన సీఐ శివప్రసాద్, ఎస్సై వెంకటరావు, సిబ్బంది పీసీలు కిరణ్ కుమార్, సాంబశివరావు, శంకర్‌లను డీఎస్పీ అభినందించారు.



డైమండ్ ఆభరణాలను ప్రదర్శిస్తున్న డాక్టర్ నిహారిక, పెద్ది రమణారావు తదితరులు

మలబార్ వారి మైన్ డైమండ్ షో ప్రారంభం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో మైన్ డైమండ్ షోను శుక్రవారం విజేత ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ నిహారిక, వ్యాపారవేత్త పెద్ది రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఈ నెల 25వ తేదీ వరకు జరుగుతుందన్నారు. డైమండ్ విలువపై 30 శాతం వరకు, బంగారు, అన్‌కట్, రత్నాభరణాల తరుగు ఛార్జీలపై 30 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్టు తెలిపారు. ఆభరణాల ప్రదర్శనను నగర, పరిసర ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టోర్ హెడ్ నదీర్, జితిన్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన భక్త రామదాసు సంగీత సాహిత్య రూపకం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై శనివారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు గద్దె రామతులశమ్మ, జనచైతన్య హౌసింగ్ లిమిటెడ్ అధినేత మాదల రత్నగిరి బాబు సౌజన్యంతో ఏపీ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రదర్శించిన భక్త రామదాసు సంగీత సాహిత్య రూపకం పలువురిని విశేషంగా అలరించింది. తొలుత తిరుప్పావై 4వ పాశురంపై డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి ప్రవచనం చేశారు. అనంతరం విజయవాడ వీరమాచనేని పెద్దయ్య, నారాయణ, లిటిల్ బ్రెయిన్ పాఠశాలల విద్యార్థులు తమ పాత్రల ద్వారా భక్త రామదాసు సంగీత రూపకాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మాదల రత్నగిరిబాబు, విజయసారథి, డాక్టర్ తూనుగుంట్ల రాధాబాయి, మైలవరపు లలితకుమారి, విజయలక్ష్మి, పాలకమండలి అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధిరంగంలో చేయూతనిస్తాం!

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి) : అంజుమన్ మహిళలకు ఉపాధి రంగాల్లో చేయూతనిచ్చి ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు చేపడుతున్నామని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. అంజుమన్ హైస్కూల్ ఆవరణలో అంజుమన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, డైనింగ్ హాల్ నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఎంపీ లాడ్స్ నిధులు రూ.30 లక్షలతోపాటు అంజుమన్ ఎ ఇస్లామియా నిధులతో ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో అంజుమన్ ఇస్లామియా సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని ఉపాధి అవకాశాలు తీసుకురాబోతున్నామని, అవి ముస్లింల అభ్యున్నతికి చేదోడుగా నిలుస్తాయని వెల్లడించారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మహిళలను ఆర్థికశక్తిగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తాము అదే స్ఫూర్తితో అంజుమన్ ఎ ఇస్లామియా సంస్థను బలోపేతం చేస్తూ సేవా కార్యక్రమాలను విస్తృత పరుస్తున్నామని చెప్పారు. అనంతరం అంజుమన్ హైస్కూల్లో దాత ఫైజుల్లా సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు పాల్గొన్నారు.



స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శంకుస్థాపన చేసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్, మైనార్టీ నేతలు

గంజాయి గ్యాంగ్‌తో సంతకాలు సిగ్గుచేటు

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానంపై వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన రెడ్డి కోటి సంతకాలపేరుతో రౌడీలను, గంజాయి గ్యాంగ్‌ను వెంటేసుకొని రహదారులపై వీరంగం సృష్టించటం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీపీపీలకు వ్యతిరేకంగా వైసీపీ హైకోర్టుకు వెళ్లగా అక్కడ అక్షింతలు వేసిందని అన్నారు. కోర్టు పక్షిగా పేరున్న జగన్‌రెడ్డి పీపీపీలపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో ఎందుకు సవాల్ చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రతీ జిల్లాకు ఒక వైద్య కళాశాలను ఇవ్వాలని నిర్ణయం తీసుకోవటంతో ఏపీకి 17 కళాశాలలు వచ్చాయని, వాటిని జగన్ రెడ్డి పోరాడి సాధించినట్లు చెప్పుకోవటం హాస్యాస్పదమని అన్నారు. దీనిలో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరించే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ కళాశాలలకు సంబంధించి జీవో 107, 108 ఇచ్చి దానిలో 50 శాతం డొనేషన్ సీట్లు, 50 శాతం మెరిట్ సీట్లు, 15 శాతం ఎన్నారై కోటాగా నిర్ణయించి ప్రైవేటీకరణకు బాటలు వేసింది జగన్ రెడ్డి కదా అని నిలదీశారు. వైద్యాన్ని, వైద్య విద్యను ప్రజలకు చేరువ చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఆయన హయాంలో రాష్ట్రంలో మొత్తం 19 వైద్య కళాశాలలు ఏర్పాటు చేశామని, దీనిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని కనపర్తి స్పష్టం చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

● జాయింట్ కంట్రోలర్ ఎంఎన్‌ఎస్ మాధురి



మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ మాధురి

గుంటూరు (తూర్పు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుడు కొనే ప్రతి వస్తువుపైన కొన్ని హక్కులు ఉంటాయని, ఆ విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని జాయింట్ కంట్రోలర్ ఎంఎన్ ఎస్ మాధురి అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాల్లో భాగంగా శనివారం ఆర్టీసీ బస్టాండ్, పలు వాణిజ్య సముదాయాల్లో లీగల్ మెట్రాలజీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ, వస్తువులో నాణ్యత, సరైన ధర, తూకం, స్వచ్ఛత పొందే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. వినియోగదారుల చట్టంపై పూర్తి అవగాహన ఉండాలని, అప్పుడే మోసాల బారిన పడకుండా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కంట్రోలర్ హరిప్రసాదు, అసిస్టెంట్ కంట్రోలర్ అల్లూరయ్య, తనిఖీ అధికారి సునీల్‌రాజా, వ్యాపారస్థులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం

గుంటూరు (తూర్పు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ ఆరోపించారు. స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని ఒక్కటి కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు నేటికి విడుదల కాలేదని, వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు.

ఉత్తమ భవిష్యత్తుకు దిక్సూచి కెరీర్ ఫెస్ట్

గుంటూరు(విద్య),డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు భవిష్యత్తులో మెరుగైన కెరీర్‌ను ఎంచుకునేందుకు వీలుగా కెరీర్ ఫెస్ట్ ఉపయోగపడుతుందని డిఇవో డాక్టర్ ఎస్‌కె సలీమ్‌బాష అన్నారు. శనివారం సెయింట్ జోసెఫ్ బిఇడి కళాశాలలో జిల్లాలోని 18 మండలాల పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన కెరీర్‌ఫెస్ట్‌లో డీఈవో సలీమ్ బాషా మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ కెరీర్‌ను ఎంచుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఐ పద్మావతి, యూనిసెఫ్ కన్సల్టెంట్ జి. ప్రియాంక, జీసీడీవో వి. సుజాత, ఏఎంఓ ఖుద్దూస్ పాల్గొన్నారు.

ముస్తాబు కార్యక్రమం పక్కాగా అమలు చేయాలి : డీఈవో

గుంటూరు(విద్య), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత కోసం అమలు చేసే ముస్తాబు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, డీఈవో డాక్టర్ షేక్ సలీమ్‌బాషా సూచించారు. చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం వ్యక్తిగత పరిశుభ్రత, మంచి అలవాట్లు తదితర అంశాలపై విద్యార్థులతో డీఈవో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో ఎంఎం అబ్దుల్ ఖుద్దూస్, పాఠశాల హెచ్‌ఎం వి.పద్మజ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరుసిటీ, నెహ్రూనగర్ 1/1 కాపురస్తుడు చీతిరాల వెంకట్రావు గారి కుమారుడు శ్రీనివాసరావు గారి సూచనలపై యావ న్మందికీ తెలియజేయునది ఏమనగా, షెడ్యూలులో చూపిన ఆస్తిని భవనం బ్రహ్మానందరెడ్డి, S/o.రమణారెడ్డిగారు తనకు తన తల్లిగారైన భవనం రమణా రెడ్డిగారి భార్య సీతారావమ్మగారు తనకు సంక్రమించేటట్లుగా ది.06-03-2007వ తేదిన ఒక వీలునామా వ్రాసి ది.21-05-2007వ తేదిన మరణించిన దరిమిలా తనకు షెడ్యూలు ఆస్తిపై సర్వ సంపూర్ణ హక్కులు కలవని షెడ్యూలు ఆస్తిని ది.16-09-2022వ తేదిన తన భార్య అయిన సూరే కిరణ్మయి గారి పేరుతో దఖలుపరచి ద.నెం.12283/2022గా రిజిష్టర్ చేయించి స్వాధీన పరచినారని అట్టి ఆస్తిని నా క్లయింటు కొనుగోలు చేయుటకు ఖరారుపడి యున్నారు. షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన హక్కులు, తనఖాలు, కోర్టు ఉత్తర్వులు గాని, మరే విధమైన అభ్యంతరాలు వున్నయెడల 15 రోజులలో వ్రాతపూర్వకంగా నాకు తెలియజేయగలరు. గడువు లోగా ఎట్టి అభ్యంతరాలు రానిచో నిష్పేచిత ఆస్తిగా భావించి నాక్లయింటు సక్రమమైన విక్రయ దస్తావేజును పొంద గలరని తదుపరి వచ్చు ఎట్టి క్లయిములు నాక్లయింటును బంధింపజాలవు.

షెడ్యూలు:గుంటూరు డి॥ & సబ్.డి॥, జి.యం.సి. ఏరియాలోని నెహ్రూ నగర్ 2వ లైనులోని గుంటూరు గ్రామం తాలూకు డి.నెం.206/ఎ, టౌన్ సర్వే నెం.12, కొత్త డోర్.నెం. 8-9-113, చ.గ.257. 7/9లు ఖాళీ నివేశన స్థలము.

చాగంటి రఘురామి రెడ్డి, అడ్వకేట్,
7/4 అరండల్‌పేట, గుంటూరు. సెల్ : 9848365050

కల్యాణం.. కమనీయం



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు



(5వ పేజీ తరువాయి)

వైషమ్యాలను రూపుమాపి అందరూ ఒక్కటే అన్న ఆధ్యాత్మిక భావనను కల్పించేందుకు యరపతినేని శ్రీనివాసరావు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన ఆలోచనకు తగ్గట్లుగానే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు పార్టీలకు అతీతంగా స్వామి వారి కల్యాణోత్సవానికి తరలివచ్చారు. దీంతో వివాహ వేదిక ఏర్పాటు చేసిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఉన్న జానపాడు రోడ్డు అశేష భక్త జనవాహినితో కిక్కిరిసింది. శ్రీవారు రాకతో పిడుగురాళ్ల చిన్న తిరుపతిగా మారింది. ఏడు కొండల మీద స్వామి వారి ఆలయం ఎంత రమణీయంగా ఉంటుందో అదే తరహాలో ఇక్కడ ఏర్పాటు చేసిన గుడి నమూనా, వివాహ వేదిక విద్యుత్ కాంతులతో రమణీయంగా మారింది. 60 ఏళ్ల పైబడిన వారు కల్యాణాన్ని సమీపం నుంచి వీక్షించేలా ఎల్ 1 గ్యాలరీలో కూర్చో బెట్టారు. ఆ తర్వాత ఎల్ 2, ఎల్ 3 గ్యాలరీల్లో మిగిలిన వారు సంప్రదాయ దుస్తుల్లో ఆశీనులయ్యే అవకాశం కల్పించారు. గురజాల నియోజకవర్గానికి దగ్గర గా ఉన్న మాచర్ల, సత్తెనపల్లి, నర్సరావుపేట, పెదకూరపాడు ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

అలరించిన సంగీత విభావరి..

శ్రీవారి కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అల రించాయి. బ్రహ్మమొక్కటె పర - బ్రహ్మమొ క్కటె పరబ్రహ్మమొక్కటె పర బ్రహ్మమొక్కటె.. అదిగో.. అల్లదిగో శ్రీహరి వాసము.. నిగమ.. నిగమాంత వర్ణిత.. మనోహర రూప నాగరాజ ధరుడ శ్రీనారాయణ.. అంటూ సాగిన సంగీత విభావరి వీనుల విందు చేసింది.

కలెక్టర్ దంపతుల ప్రత్యేక ఆకర్షణ..

సాధారణంగా ఎమ్మెల్యే యరపతినేని ఏదైనా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు అంటే వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఈ సారి మాత్రం ఆ సంప్రదాయానికి సెలవు ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలే వీఐపీలు అంటూ జిల్లాలో ముఖ్య అధికారులను మాత్రమే కార్యక్రమానికి ఆహ్వానించారు. దీంతో కలెక్టర్ కృతికాశుక్లా, ఆమె భర్త నెల్లూరు కలెక్టర్ హిమాన్షుక్లా దంపతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ కృష్ణారావు, టీటీడీ బోర్డు సభ్యులు ఎన్ నర్సిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, డీఆర్ఓ మురళి దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే యరపతినేని సతీమణి నాగమణి, కుమారులు మహేష్‌బాబు, రమేష్‌బాబు, నిఖిల్ కుటుంబ సభ్యులు కార్యక్రమానికి హాజరై స్వామి వారి వివాహాన్ని జరిపించారు.

విందు.. పసందు..

స్వామి కల్యాణానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి కోసం పసందైన విందు ఏర్పాటు చేశారు. వచ్చిన వారు అందరూ వీఐపీలుగానే భావించిన యరపతినేని అందరికీ చక్కెర పొంగలి, టమాటా బాత్, దద్దోజనం, సాంబార్ రైస్ వడ్డించారు.

జన్మ ధన్యం : యరపతినేని

ప్రజలందరూ వేంకటేశ్వరస్వామి కృపకు పాత్రులు చేసేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, తన జన్మ ధన్యమైందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. టీటీడీ అధికారులను ఒప్పించి కల్యాణ మహోత్సవం పల్నాడు చెంతలో ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ ప్రజలందరూ స్వామి కరుణా కటాక్షంతో సిరి, సంపదలతో నిత్యం తుల తూగాలని యరపతినేని ఆకాంక్షించారు.

ఇంటింటికీ అక్షింతలు.. లడ్డు ప్రసాదం

నియోజకవర్గ చరిత్రలో మొదటి సారి ప్రతీ ఇంటికి అక్షింతలు, తిరుపతి లడ్డు ప్రసాదం, స్వామి ఫొటో పంపిణీ చేసేలా ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి ఈ కార్యక్రమం ఆరంభం కానుంది.

ప్రైవేటు కొరియర్లకు దీటుగా

పోస్టాఫీసులు

● మార్కెటింగ్‌కు ప్రత్యేక అధికారిగా నిపుణుడు ● కేంద్రమంత్రి పెమ్మసాని ● వీఐటీలో జెన్ జెడ్ పోస్టాఫీసు ప్రారంభం



వీఐటీలో జెన్ జెడ్ పోస్టాఫీసును ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్ అన్సారియా

తుళ్లూరు (ఐనవోలు) డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైల్వే తరువాత అత్యధికంగా పోస్టల్ శాఖలో 4.50 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఈ ఉద్యోగులందరినీ సమర్థవంతంగా ఉపయోగించుకుంటే దేశంలోనే పటిష్ఠమైన శాఖగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, పోస్టల్ ఉన్నతాధికారులతో కలసి ఆయన రాజధాని అమరావతిలోని వీఐటీ- ఏపీ యూనివర్శిటీలో జెన్ జెడ్ పోస్టల్ ఆఫీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టల్ వ్యవస్థ వల్ల సమకూరే పలు ప్రయోజనాలను మంత్రి వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ప్రైవేటు కొరియర్లకు దీటుగా పోస్టాఫీసు సర్వీసులను తయారు చేస్తున్నామని ఆయన చెప్పారు. పోస్టాఫీసులు కేవలం ఉత్తరాల బట్వాడాకే పరిమితం కాకుండా ఈ కామర్స్ ప్లాట్ ఫాంగా మార్చామన్నారు. ప్రతి ఉద్యోగి తమ విధులను సజావుగా నిర్వహించేలా చూస్తున్నామని, మార్కెటింగ్ కోసం ఓ నిపుణుడిని ప్రత్యేక అధికారిగా నియమించామని చెప్పారు. మానవ వనరులను సక్రమంగా వాడుకోవడంపై దృష్టి సారించామన్నారు. జెన్ జెడ్ పోస్టాఫీసు ఏర్పాటు లక్ష్యం యువతను ప్రభుత్వ వ్యవస్థలో భాగస్వాములను చేయటమేనని మంత్రి పెమ్మసాని అన్నారు. దేశవ్యాప్తంగా 50, రాష్ట్రంలో మూడు జెన్ జెడ్ పోస్టాఫీసులను ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ శాఖలో పెట్టే ఖర్చులతో 89 శాతం జీతాలకు సరిపోతున్నాయన్నా, సామాజిక బాధ్యతగా చేసే కార్యక్రమాల వల్ల వినియోగదారుల నుంచి ఎక్కువ చార్జీలు వసూలు చేయడం లేదన్నారు. అందుకే ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను ఆలోచిస్తున్నామన్నారు. జెన్ జెడ్ పోస్టాఫీసుల బ్రోచర్‌ను మంత్రి పెమ్మసాని కలెక్టర్, పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు, వీఐటీ ప్రతినిధులు ఆవిష్కరించారు.

పరపతే.. ప్రామాణికం

(5వ పేజీ తరువాయి)

సమయంలో డబ్బులు అందక సరైన సమయంలో చెల్లించకపోతే తక్కువగా స్కోర్ నమోదు అవుతుందోననే ఆందోళనతో పలు వురు అనారోగ్యం బారిన పడుతున్నారు. మ రో చోటైన అప్పు తెచ్చి బ్యాంకుకు సకాలంలో నగదు చెల్లించి స్కోర్‌ను మెరుగు పరుచుకుంటున్నారు. వ్యవసాయ రంగంలో కూడా ఈ స్కోర్ ఆధారంగానే రుణాలు ఇస్తున్నాయి. వ్యక్తిగత, విద్య వంటి రుణాలకు క్రెడిట్ స్కోర్ ఉండాల్సిందే. లేదంటే భవిష్యత్‌లో బ్యాంకు రుణాన్ని దూరమవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. గృహ, వాహన రుణాల వంటి సెక్యూర్డ్ లోన్స్‌ను సివిల్ స్కోర్ తక్కువగా ఉన్నా, క్రెడిట్ హిస్టరీ లేకున్నా రుణ సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఒక ప్రభుత్వం బ్యాంకు మేనేజర్ చెప్పిన వివరాల ప్రకారం జిల్లాలో ఈ ఏడాది 800 స్కోర్ సాధించిన 57.6 శాతం రుణాలు మంజూరు అయ్యా యని, 650 కంటే తక్కువ స్కోర్ ఉన్నవారికి ఒక్కరికి కూడా రుణం మంజూరు కాలేదని చెప్పారు. 501-650, 300-500 సిబిల్ స్కోరు కలిగి ఉన్నవారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి భవిష్యత్తులో రుణాలు పొందకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

స్కోరు	సామర్థ్యం
851-900	ఆర్థిక క్రమశిక్షణ అద్భుతం
751-800	మంచిది(రుణాలు ఇవ్వొచ్చు)
651-750	పర్వాలేదు(చెల్లించగలరు)
501-650	దారుణం(బ్లాక్‌లిస్ట్)
300-500	చాలా దారుణం(బ్లాక్‌లిస్ట్)

సిబిల్ అంటే..

సీఐబీఐఎల్- క్రెడిట్ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో(ఇండియా) లిమిటెడ్. వ్యక్తులు గతంలో తీసుకున్న రుణ వాయిదాలను ఎలా చెల్లించారు. ఏమైనా ఎగ్గొట్టారా.. వంటి అంశాలను సాంకేతికతతో అనుసంధానం చేసి రుణ అర్హత పరపతి సూచించే సంఖ్యనే క్రెడిట్ స్కోర్‌గా పిలుస్తున్నారు. దీని ఆధారంగానే బ్యాంకులు రుణాలు ఇవ్వాలా లేదా అని నిర్ణయిస్తున్నాయి. మన దేశంలో క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ ట్రాన్స్‌యూనియన్ సిబిల్ సంస్థ క్రెడిట్ స్కోరును నిర్ణయిస్తుంది. ప్రస్తుతం ఆ కంపెనీ పేరుతోనే సిబిల్ స్కోర్‌గా ప్రజల్లో ప్రాచుర్యం పొందింది.

స్కోర్ పెంచుతామంటూ మోసాలు

సిబిల్ స్కోర్ పెంచుతామంటూ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు అధికారులు తెలుసంటూ మాయ మాటాలు చెబుతూ నగదు వసూలు చేస్తున్నారు. ఈ మధ్యనే పీజీఆర్ఎస్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ మోసం వెలుగులోకి వచ్చింది. వాస్తవానికి ఆర్‌బీఐ లైసెన్స్ పొందిన సంస్థలు మాత్రమే ఈ స్కోర్‌ను లెక్కిస్తాయి. క్రెడిట్ ఇన్ఫర్మేషన్, కంపెనీలు, ట్రాన్స్ యూనియన్ సిబిల్, ఈక్విఫ్యాక్స్ ఇండియా, ఎక్స్‌పీరియన్ ఇండియా, సీఆర్ఐ ఎఫ్ హైమార్క్ వంటి సంస్థలు ఆర్బీఐ నియంత్రణలో పనిచేస్తూ ఈ గణాంకాలు నమోదు చేస్తాయి. అంతే తప్ప బ్యాంకులకు ఈ స్కోర్‌కు ఎటువంటి సంబంధం ఉండదు.

సిబిల్ స్కోరే ప్రామాణికం



దీర్ఘకాలిక, భారీ రుణాలు పొందేందుకు సిబిల్ స్కోరే ప్రామాణికం. ఈ స్కోర్ ఒక విధంగా వ్యక్తుల ఆర్థిక విశ్వసనీయతకు పాస్‌పోర్టు లాంటిది. స్కోర్ తగ్గకుండా చూసుకోవాలి. మంచి స్కోర్ ఉన్నవారికి కొన్ని బ్యాంక్‌లు వడ్డీ రేట్లు తగ్గిస్తున్నాయి. గుర్తింపు పొందిన సంస్థలలో మంచి స్కోర్ ఉన్న ఉద్యోగులు రూ.40 లక్షలు వరకు రుణం పొందవచ్చు. సకాలంలో రుణాలు, క్రెడిట్ కార్డు బకాయిలను చెల్లించి స్కోర్‌ను కాపాడుకోవాలి.

- ఎస్ మల్లికార్జునరెడ్డి, ఆడిటర్, గుంటూరు

ఒక్కొక్కటిగా.. అంగీకారు ఇస్తున్నారు!

(5వ పేజీ తరువాయి)

ఫైనాన్స్‌లో కార్లు తీసుకున్నారు. ఒకటి రెండు ఈఎంఐలు చెల్లించి పలాయనం చిత్తగించారు. వీరిపై కూడా కేసు నమోదైంది. ఈ కార్లు కూడా చోర్ గ్యాంగ్ వద్దకు చేరాయి. ఈ కార్లకు నంబర్లు మార్చి గ్యాంగ్ విక్రయించినట్లు పోలీసుల విచారణలో బహిర్గతమైనట్లు తెలిసింది. కాగా, రూరల్ పోలీసు స్టేషన్‌లో కూడా ఒక కారుకు సంబంధించి కేసు నమోదైంది. శ్రీనివాసరావు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

50 కార్ల వరకు విక్రయం..

గ్యాంగ్ దాదాపు 50 కార్లలో కొన్ని పోలీసు అధికారులకు గిఫ్ట్‌గా ఇవ్వగా.. మిగతా కార్లను విక్రయించినట్లు నిందితులు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు తెలిసింది. కస్టడీలో ఉన్న ఐదుగురు.. అదుపులో ఉన్న ఇద్దరు ముఠా సభ్యులను వేర్వేరుగా పోలీసులు విచారించగా.. సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు 50 కార్లు లెక్కతేలినట్లు సమాచారం. ముఠా ఇచ్చిన సమాచారాన్ని పోలీసులు క్రోడీకరిస్తున్నారు. అగంతకులు ఇచ్చిన సమాచారంలో ఒకే కారును.. రెండుసార్లు చెప్పారా అన్న అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ఒక పోలీసు అధికారి ఇన్నోవా కారు తిరిగి ఇచ్చినట్లు సమాచారం. పోలీసు అధికారులతో పాటు కొందరు రాజకీయ నేతల నుంచి కూడా కార్లు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

తీసుకున్న వారిపై చర్యలుండేనా?

కార్ల కేసు ఆదివారానికి కొలిక్కి వచ్చే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు. ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న కార్లతో పాటు ముఠా సభ్యుల్లో ఇద్దరిని అరెస్టు చేయనున్నారు. సోమవారంతో ఐదు గురు నిందితుల పోలీసు కస్టడీ ముగు స్తుంది. కొందరు పోలీసు అధికారులు గిఫ్ట్‌గా తీసుకున్న కార్ల విషయంలో పోలీసు శాఖ చర్యలు తీసుకుంటుందా.. తమ తోటి వారే కదా అని వదిలేస్తారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. డీఎస్పీ హనుమంతరావు, రూరల్ సీఐ సుబ్బారావు నేతృత్వంలో కేసు విచారణ జరుగుతోంది.



కవితకు సూపర్‌స్టార్ కృష్ణ పురస్కారాన్ని అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి, గజల్ శ్రీనివాస్ తదితరులు

సినీ నటి కవితకు సూపర్‌స్టార్

కృష్ణ పురస్కారం

గుంటూరు(తూర్పు), డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సినీ నటి కవితను సూపర్ స్టార్ కృష్ణ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. శనివారం గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో దొరుకునా ఇటువంటి సేవ కార్యక్రమంలో భాగంగా సినీనటి కవితకు ఈ పురస్కారాన్ని అందజేశారు. సభకు ఏపీ సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ప్రముఖ న్యాయవాది శాతరాసి ఏడుకొండలు సౌజన్యంతో ఆలాపన సంస్థ వ్యవసాపక అధ్యక్షుడు న్యాయవాది కొల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దొరుకునా ఇటువంటి సేవ పేరుతో జరిగిన సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయని, గాయకులు పాల్గొని సూపర్‌స్టార్ కృష్ణ చిత్రాలలో పాటలను పాడి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

వాణిజ్యంలా వ్యవసాయం

● అప్పుడే రైతులకు మేలు

● ఎన్‌జీ రంగా వర్సిటీ విస్తరణ సంచాలకులు డా.శివన్నారాయణ

● జగ్గాపురంలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన



సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు శివన్నారాయణ

యడ్లపాడు, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని జీవనోపాధిగా కాకుండా వాణిజ్య దృక్కోణంలో ఆలోచించి ముందుకు సాగితే లాభసాటిగా మారుతుందని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ శివన్నారాయణ అన్నారు. వ్యవసాయానికి దాని అనుబంధ రంగాల్ని జోడించి ముందుకు సాగాలని ఆయన సూచించారు. యడ్లపాడు మండలం జగ్గాపురం గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాలవిద్యార్థులు ఏర్పాటు చేసిన రైతుసదస్సు, వ్యవసాయ నమూనాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఈ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ, మారుతున్న కాల పరిస్థితులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ, అనుబంధ రంగాలను జోడించి సమగ్ర యాజమాన్య పద్ధతులతో ప్రణాళికాబద్ధంగా పంటలను సాగు చేయాలన్నారు. ప్రతి రైతు కుటుంబం వ్యాపారవేత్తలుగా మారాల్సిన సమయం ఆసన్నమైందని, అలా మారితేనే రైతులు అధిక ఆదాయం పొందేందుకు వీలుంటుందన్నారు. ఖర్చు తగ్గే యాజమాన్య పద్ధతులను ఆచరిస్తూ నూతన వ్యవసాయ పద్ధతులతో ముందుకు సాగడం, యువత పాత్రను పెంచినట్లయితే వ్యవసాయం లాభసాటిగా మారి మరింత మంది దీనివైపు ఆకర్షితులవుతారన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు తాము సాగులో ఎదుర్కొంటున్న సమస్యలు, చీడపీడల గురించి ప్రస్తావించారు. రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్ రాజమణి, డాక్టర్ చాముండేశ్వరి, డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం కళాశాల విద్యార్థినులు రూపొందించిన వ్యవసాయ నమూనాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. లాం పరిశోధనా సహాయ సంచాలకులు డాక్టర్ ఎన్‌వీఎస్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆత్మ పీడీ జి. వెంకటేశ్వరరావు, ఏడీఏ టీవీ శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయం డీపీఎం అమలకుమారి, మండల ఏవో హరిప్రసాద్, హార్టికల్చర్ అధికారి శ్రీలత, డాక్టర్ ఉష, గ్రామపెద్దలు పోపూరి వెంకటేశ్వర్లు, ముద్దన నాగేశ్వరరావు, అభ్యుదయ రైతు పోపూరి శివరామకృష్ణ, రైతుసంఘం నాయకులు ఎన్ కాళిదాసు, ఎంపీటీసీ రత్నకుమారి, రైతులు, పయనీర్, బేయర్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



యువత నైపుణ్యాభివృద్ధికి

ప్రభుత్వం కృషి

● రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

● కేఎల్‌యూలో ముగిసిన యువజన నోత్సవాలు



మాట్లాడుతున్న యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఎస్ భరణి జ్యోతి



విజేతలకు బహుమతులు అందిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

తాడేపల్లి టౌన్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల యువ కార్యక్రమం యువతకు గొప్ప స్ఫూర్తిని అందించిందని ఆయన పేర్కొన్నారు. గుంటూరు జిల్లా కేఎల్ యూనివర్సిటీలో శనివారం యువజన ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్ర యువ సంకల్ప్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబర్చిన యువతకు మంత్రి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ, భారతదేశ భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని, రానున్న కాలంలో ప్రపంచాన్ని శాసించే శక్తి యువతదేనన్నారు. స్వామి వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువతలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి స్ఫూర్తిదాయక కార్యక్రమాలు ఎంతో అవసరమని, ఇవి ఒక్క రోజుకే పరిమితం కాకుండా నిరంతరంగా కొనసాగాలని సూచించారు. యువత తమ చేతుల్లో ఉన్న భవిష్య త్తును సక్రమంగా తీర్చిదిద్దుకుంటూ మంచి పనులు చేస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు. రానున్న రోజుల్లో యువత నైపు ణ్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండదండలు అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో రాజధాని లేక రాష్ట్రం ఎంతో బాధను అనుభవించిందని, అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాజధాని నిర్మాణాన్ని చేపట్టి, రాష్ట్రాభివృద్ధికి బలమైన పునాదులు వేశారన్నారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావ డం అభివృద్ధికి నిదర్శనమని, రాజధానిలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణం జరుగనుందని తెలిపారు. 20 లక్షల ఉద్యో గాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రానికి కంపెనీల రాకతో ఆ లక్ష్యాన్ని తప్పక సాకారం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ కమిషనర్ ఎస్.భరణి జ్యోతి, కేఎల్ యూ నివర్సిటీ డైరెక్టర్ సాయి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన యువత

అతిథి



'సోగ్గాడు' అనగానే సీనియర్ హీరో శోభన్‌బాబే గుర్తుకువస్తారు. తన అందంతో, అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో ఆయన అలా చెరగని ముద్ర వేసుకున్నారు. తన కెరీర్ ప్రభావం కుటుంబం మీద పడకుండా మొదటినుంచీ జాగ్రత్తలు తీసుకున్నారు శోభన్‌బాబు. సినిమా వాతావరణానికి దూరంగా తన పిల్లల్ని పెంచారు. ఈ కారణంవల్ల ఆయనకు పిల్లలు ఎంతమంది, మనవళ్లు ఎంతమంది, వారు ఎక్కడ ఉన్నారనే విషయం చాలామందికి తెలీదు. శోభన్‌బాబుకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు. ఆయన కుమారుడి పేరు కరుణశేషు. ఆయనకు ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. మగ పిల్లలిద్దరూ కవలలు. శోభన్‌బాబు పెద్ద కుమార్తె మృదులకు ఇద్దరు మగపిల్లలు. అందులో పెద్దవాడు సురక్షిత్. రెండో కూతురు ప్రశాంతికి ఒకే ఒక్క తనయుడు. ఇక చివరి కుమార్తె నివేదితకు ఇద్దరు అబ్బాయిలు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే శోభన్‌బాబుకు 'ఎస్' అక్షరం అంటే ఇష్టం. అందుకే తన మనవళ్లు, మనవరాళ్లుకు ఆయనే స్వయంగా 'ఎస్' అక్షరంతో ప్రారంభమయ్యే పేర్లు పెట్టారు. డాక్టర్‌గా చెన్నైలో ప్రాక్టిసు చేస్తున్న **సురక్షిత్** ప్రతి నెలా తప్పనిసరిగా పేషంట్స్ కోసం హైదరాబాద్ వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆయనతో 'నవ్య' ప్రత్యేకంగా ముచ్చటించింది.

నేను డాక్టర్ కావాలన్నది తాతగారి కోరిక

మీ ఫ్యామిలీ సభ్యులంతా తరచూ కలుస్తుంటారా?

మీకు తెలియనిదేముంది. ప్రస్తుతం అంతా కాలంతో పరుగెడుతున్నాం. ఎవరి బిజీ వాళ్లది. ఎవరి టార్గెట్స్ వాళ్లవి. అయినా సరే మేం వీలు చూసుకుని అప్పుడప్పుడూ కలుస్తుంటాం. కలిసిన ప్రతిసారీ తాతగారి గొప్పతనాన్ని, ఆదర్శవంతమైన ఆయన జీవితాన్ని గుర్తు చేసుకుంటుంటాం.

చిన్నప్పటి రోజులు గుర్తు చేసుకుంటే ఎలా అనిపిస్తుంది?

లెజెండ్స్ కనుమరుగైనా వారి జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయని పెద్దలు చెబుతుంటారు. మా తాతగారి విషయమూ అంతే. చిన్నతనంలో ఆయన మాకు ఎన్నో చెప్పేవారు. సేవాభావం ఉండాలని, ఎదుటివాడికి చేతనైనంత సాయం చేయాలని తాతగారు చెప్పిన మాటల్ని మేం ఎప్పుడూ మరిచిపోలేం. డాక్టర్‌గా నా బాధ్యతలు నిర్వహిస్తూ తాతగారి మాటల్ని ఆచరణలో పెట్టడానికి కృషి చేస్తున్నాను. నేను ఒక కార్పొరేట్ హాస్పిటల్‌లో ఆరు నెలలు పని చేశాను. కానీ వారి వ్యాపార ధోరణి, పేషంట్స్‌తో ప్రవర్తించే విధానం నాకు నచ్చక బయటకు వచ్చేశాను. సొంతంగా ప్రాక్టీసు ప్రారంభించాను. తాతగారు చెప్పినట్లు కమర్షియల్‌గా కాకుండా సేవాదృక్పథంతో పని చేస్తున్న డాక్టర్లలో నేను కూడా ఒకడినని గర్వంగా చెప్పగలను.

మీరు డాక్టర్ కావాలనుకున్నప్పుడు తాతగారు ఏమన్నారు?

నేను డాక్టర్ కావాలన్నది ఆయన కోరికే. 'డబ్బు విషయంలో నీకు లోటు ఏమీ లేదు. అందుకే సంపాదన గురించి ఆలోచించకుండా సర్వీస్ చేస్తే బాగుంటుంది' అని ఆయన సలహా ఇచ్చారు. 'సురక్షిత్' అని పేరు పెట్టింది ఆయనే. 'టు ప్రొటెక్ట్ పీపుల్' అని. 'నువ్వు అనుకున్నది చేసెయ్యి. సమాజానికి సేవ చెయ్యి' అని చెప్పేవారు.

ఆయన చెప్పింది మీరెంతవరకు పాటిస్తున్నారు?

దటీజ్ మై హోల్ జర్నీ. స్టార్టింగ్ నుంచి ఇప్పటివరకూ అదే చేస్తున్నాను. నేను రెగ్యులర్‌గా హైదరాబాద్ వస్తాను. బెంగళూరు వెళుతుంటాను. వచ్చిన ప్రతిసారీ 40, 50మంది పేషెంట్స్‌ను కలుస్తుంటాను. కమర్షియల్‌గా ఆలోచించకుండా మెడికల్ హెల్ప్ చేస్తుంటాను.

తన కుటుంబాన్ని సినిమాలకు దూరంగా ఉంచారు. దానికి కారణం ఆయన ఎప్పుడైనా చెప్పారా?

సినిమారంగంలో ఆయన ఎంత కష్టపడ్డారో, ఒక పొజిషన్‌కు చేరుకోవడానికి ఎంత స్ట్రగుల్ అయ్యారో ఆయన మాకు ఎప్పుడూ చెప్పలేదు... కానీ పెరిగి పెద్దయ్యాక మాకు తెలిసింది. బహుశా అటువంటి కష్టం మేం పడకూడదనో ఏమో ఆయన దూరంగా ఉంచారు.

తాతగారి సినిమాల్లో మీకు నచ్చినవి?

నేను చాలా తక్కువ సినిమాలే చూశాను. 'ఏమండీ ఆవిడ వచ్చింది' నాకు బాగా నచ్చింది. 'సినిమాలు చూడండి' అని మమ్మల్ని తాతగారు ఒత్తిడి చేసేవారు కాదు. చదువు మీద దృష్టి పెట్టమని, నాలెడ్జి పెంచుకోమని చెప్పేవారు. మా కుటుంబ సభ్యులు అందరం కలసి చూశాము కనుక ఆ సినిమా నాకు బాగా గుర్తుండిపోయింది.



సినిమాలంటే మీకెవరికీ ఆసక్తి లేదా? లేక తాతగారు చెప్పారని దూరంగా ఉన్నారా?

మాకెవరికీ సినిమాలంటే ఆసక్తి లేదండి. ఎవరి వృత్తిలో వాళ్లం బిజీగా ఉన్నాం. హ్యాపీగా ఉన్నాం. చాలామంది నిర్మాతలు నన్నే కాదు మా కజిన్స్‌ను కూడా సినిమాల్లోకి రమ్మని, నటించమని చాలా ఒత్తిడి చేశారు. నేను టెన్త్ స్టాండర్డ్‌లో ఉన్నప్పుడే నిర్మాతలు, దర్శకులు వచ్చి ప్రివ్యూలకు రమ్మని, షూటింగ్స్‌కు రమ్మని పిలిచేవారు. తాతగారికి ఇష్టంలేని పని చేయడం, మాకు ఆసక్తి లేకపోవడంవల్ల అటువైపు వెళ్లలేదు.

మీ కుటుంబ సభ్యుల మధ్య ఆర్థికపరమైన వివాదాలు ఎప్పుడైనా వచ్చాయా?

లేదు. తన కుటుంబ సభ్యులెవరూ ఆర్థిక ఇబ్బందులు పడకూడదన్నది తాతగారి విజన్. ఆయన ఆ పరంగా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు.

మీరు ఫిట్‌నెస్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటారని విన్నాం?

40 ఏళ్ల వయసు వచ్చేలోపు ఒక ఫొటో షూట్ చేయాలన్నది నా కోరిక. అందుకే సిక్స్ ప్యాక్ చేయాలనుకున్నాం. నేను చేయగలనా లేదా అని చెక్ చేసుకోవడం కోసం అలా ప్రయత్నించా. 18 నెలలు పట్టింది. అందులో ఆరు నెలలు బాగా కష్టపడ్డా. స్కూల్ ఫైనల్ అప్పుడు 110 కిలోలు ఉండేవాడిని. అక్కడి నుంచి క్రమంగా 70 కిలోలు వరకూ తగ్గించుకుంటూ వచ్చా. అయితే ప్రస్తుతం మాత్రం 95 కిలోలు ఉన్నా.

మీ ఫ్యామిలీ గురించి చెప్పండి.

నా వైఫ్ రేడియాలజిస్ట్. నాకు ఇద్దరు ఆడపిల్లలు.

మీ అమ్మమ్మగారి ఆరోగ్యం ఎలా ఉంది?

ప్రస్తుతం బాగానే ఉన్నారు. ఆవిడ మితభాషి. మేమంటే ఆవిడకు ఎంతో ఇష్టం. రకరకాల వంటలు వండుతూ, మాకు తినిపిస్తూ ఆ ప్రేమ చూపిస్తుంటారు.

• వినాయకరావు
ఫొటోలు: హరి ప్రేమ్

హన్సితారెడ్డి.. ఈ పేరు వినగానే ప్రముఖ నిర్మాత దిల్ రాజు తనయగా, నిర్మాతగా మాత్రమే గుర్తొస్తారు. ఇప్పుడామె హైదరాబాద్ బ్యూటీ వరల్డ్‌లోకి అడుగుపెట్టారు. సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ హారికతో కలిసి ప్రీమియం మేకప్ స్టూడియో 'ది గుడ్ సైడ్'ను ప్రారంభించారు. 'సౌందర్యం అంటే ముఖాన్ని మార్చేయడం కాదు.. మీలోని అసలైన అందాన్ని వెలికితీయడం' అని చెప్పే హన్సితారెడ్డితో 'నవ్య' ప్రత్యేక ఇంటర్వ్యూ.

మేకప్ ఇప్పుడు నిత్యావసరం

ఒక స్టాండ్ ఎలోన్ స్టోర్‌ను ప్రారంభించాలనే ఆలోచన మీకెలా వచ్చింది?

నిజానికి దీనికి చాలామంచి స్కోప్ ఉందని నాకు ముందే తెలుసు. కానీ ఇదంతా ఏదో చిన్నగా కాకుండా భారీస్థాయిలో ఉండాలి. ఇంటీరియర్స్ ఒక ప్రత్యేక శైలిలో ఉండాలి. దేశంలోనే అత్యుత్తమ మేకప్ ఆర్టిస్టులు మనతో కలిసి పనిచేయాలి. ఇలాంటి ఆలోచనల నుంచే ఈ స్టూడియో పుట్టింది.

ప్రస్తుత కాలంలో, ముఖ్యంగా మహిళల రోజువారీ జీవితంలో మేకప్ ఎంత ముఖ్యమని మీరు అనుకుంటున్నారు?

మనకందరికీ పుట్టుకతోనే ఒక సహజమైన అందం ఉంటుంది. మేము నమ్మేది కూడా అదే. మా స్టూడియోకి వచ్చే వారికి 'మేము మీలో కొత్త అందాన్ని సృష్టించలేం. మీలో ఉన్న సహజమైన అందాన్ని మరింత ఎలివేట్ చేస్తాం" అని చెబుతుంటాం. ఏదైనా పార్టీకో, ఫంక్షన్‌కో వెళ్లేటప్పుడు మంచి దుస్తులు వేసుకుంటాం. హెయిర్ స్టైల్ చక్కగా చేసుకుంటాం. అలాగే, మేకప్ అనేది ఓ లుక్‌ని సంపూర్ణంగా మార్చే ఒక అద్భుతమైన ఎలిమెంట్. అది మిమ్మల్ని పర్ఫెక్ట్‌గా చూపిస్తుంది.

ఒకప్పుడు మేకప్ అంటే కేవలం పెళ్లిళ్లకో, వేడుకలకో పరిమితం. కానీ ఇప్పుడిది రోజువారీ అవసరంగా ఎలా మారింది?



అవును! గడిచిన 15 సంవత్సరాల్లో పరిస్థితి పూర్తిగా మారింది. ఒకప్పుడు పెళ్లి సమయంలో మాత్రమే మేకప్ వేయించుకునేవారు. 20-22 ఏళ్ల వరకు మేకప్ జోలికి వెళ్లని వారు కూడా పెళ్లి రోజున మాత్రం కచ్చితంగా వేసుకుంటున్నారు. కానీ పాశ్చాత్య దేశాల్లో ఇది ఎప్పటి నుంచో వారి జీవనశైలిలో భాగం. గత పదేళ్లుగా మన దగ్గర కూడా ట్రెండ్ మారుతోంది. ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ ప్రభావం బాగా పెరిగింది. ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా పర్ఫెక్ట్‌గా కనిపించాలని ప్రతి ఒక్కరు కోరుకుంటున్నారు. అందుకే ఇప్పుడు మేకప్ అనేది నిత్యావసరంగా మారిపోయింది.

సాధారణంగా ప్రజలు మేకప్ కోసం ఎంతవరకు ఖర్చు చేయడానికి ఇష్టపడుతున్నారు?

ప్రస్తుతం మార్కెట్లో ఉన్న డిమాండ్‌ను బట్టి రేట్లు ఉన్నాయి. సాధారణంగా ఒక పార్టీ మేకప్ కోసం రూ. 7 వేల నుంచి రూ. 10 వేల వరకు ఖర్చు చేయడానికి వెనుకాడటం లేదు. ఇక బ్రైడల్ మేకప్ (పెళ్లికూతురి అలంకరణ) విషయానికి వస్తే ఆకాశమే హద్దు. రూ. 40 వేలు మొదలుకొని రూ. 4 లక్షలు కూడా తీసుకునే ఆర్టిస్టులు ఉన్నారు. ఇదొక పెద్ద ఇండస్ట్రీగా ఎదుగుతోంది.

మార్కెట్లో దొరికే ఉత్పత్తుల వల్ల చర్మం పాడవుతోందనే ప్రచారం ఉంది కదా, మీరేం చెప్తారు?

ఇలాంటి చర్చలు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. కానీ, సైంటిఫిక్‌గా ఏదైనా ప్రొడక్ట్ హానికరం అని తేలితే ఏ ప్రొఫెషనల్ మేకప్ ఆర్టిస్ట్ దాన్ని వాడరు. మేము నాణ్యత విషయంలో ఎప్పుడూ రాజీపడం.

ఒక మహిళ వ్యక్తిత్వానికి, మేకప్‌కు సంబంధం ఏమిటి?

మేకప్ వల్ల ముఖం మరింత అందంగా కనిపిస్తుందని చెప్పడం కంటే, అది ఒక మహిళలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని నమ్ముతాను.

హైదరాబాద్‌లో చాలా బ్రాండ్స్ ఉన్నాయి కదా? మీ 'ద గుడ్‌సైడ్' వాటికంటే ఎలా భిన్నమైనది?

నా పార్ట్‌నర్ హారిక ఈ రంగంలో పదేళ్లుగా ఉన్నారు. ఆమె స్వయంగా గొప్ప మేకప్ ఆర్టిస్ట్. మా దగ్గర పనిచేసే ప్రతి ఒక్కరికీ ఆమె పర్సనల్‌గా ట్రైనింగ్ ఇస్తారు. క్లయింట్ అవసరాలను బట్టి 'స్టెప్ బై స్టెప్' ప్రొసీజర్ ఉంటుంది. కొన్నిసార్లు క్లయింట్ ఒకటి ఊహించుకుంటే, వారి ముఖానికి అది సెట్ కాకపోవచ్చు. అటువంటి సమయంలో హారిక వారికి ఏది బాగుంటుందో పర్సనల్‌గా గైడ్ చేస్తారు.

మన సమాజంలో 'తెల్లగా ఉండటమే అందం' అనే భావన ఇంకా ఉందంటారా?

అందుకే మా బ్రాండ్‌కు 'ద గుడ్ సైడ్' అని పేరు పెట్టాం. ప్రతి మనిషిలోనూ ఒక 'గుడ్‌సైడ్' ఉంటుందని మా నమ్మకం. అది తెలుపు కావచ్చు. నలుపు కావచ్చు. మీ చర్మం రంగు ఏదైనా మిమ్మల్ని మరింత అందంగా చూపించడమే మా పని. రంగుతో సంబంధం లేకుండా కళ్లు, పెదవుల అలంకరణ ద్వారా అద్భుత లుక్ తీసుకురావచ్చు. ఇప్పుడు జనరేషన్ మారింది. అందరూ అన్ని రకాల స్కిన్ టోన్స్‌ను గౌరవిస్తున్నారు.

సెలబ్రిటీలలో ఎవరి మేకప్ స్టైల్ మీకు నచ్చుతుంది?

ప్రస్తుత తరం హీరోయిన్లలో అనన్యపాండే మేకప్ చాలా బాగుంటుంది. ఇక తెలుగులో రష్మిక మందన్న లుక్స్ నాకు పర్సనల్‌గా ఇష్టం.

మేకప్ అంటే కేవలం పైన పూసే రంగు మాత్రమే కాదని చెబుతున్నారు. మరి స్కిన్‌కేర్ గురించి మీరేమంటారు?

ఒక పెళ్లికూతురు మేకప్‌లో మెరిసిపోవాలంటే దాని వెనుక రెండు నెలల కష్టం ఉంటుంది. మంచి డైట్ తీసుకోవాలి. నీళ్లు బాగా తాగాలి. డెర్మటాలజిస్ట్ సలహాలు పాటించాలి. లోపల ఆరోగ్యం బాగుంటేనే పైన వేసే మేకప్ ఎలివేట్ అవుతుంది. హీరోయిన్లు అంత అందంగా కనిపిస్తున్నారంటే దానికి కారణం వారి లైఫ్ స్టైల్. నీళ్లు లేకపోతే మొక్క ఎలా వాడిపోతుందే స్కిన్ కూడా అంతే! కేవలం మేకప్ వేసేస్తే అందం రాదు. చర్మాన్ని లోపలి నుంచి ఆరోగ్యంగా ఉంచుకోవాలి.

పురుషుల మేకప్ గురించి మీ అభిప్రాయం ఏమిటి? వారు కూడా వస్తున్నారా?

కచ్చితంగా! గత కొన్నేళ్లుగా పురుషుల్లోనూ అవగాహన పెరిగింది. ముఖ్యంగా పెళ్లిళ్లలో వధూవరుల ప్యాకేజీ తీసుకుంటున్నారు. ఎందుకంటే ఫొటోల్లో అమ్మాయిలు మేకప్‌తో చాలా పర్ఫెక్ట్‌గా కనిపిస్తారు. వారి పక్కన అబ్బాయిలు డల్‌గా ఉండకూడదు కదా. అందుకే ఇప్పుడు పెళ్లికొడుకులు కూడా హెయిర్ స్టైలింగ్, టచప్స్ కోసం ఆసక్తి చూపిస్తున్నారు.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

కాపర్ బాటిల్స్‌ని ఇలా...



మంచినీళ్లు తాగడానికి ఉపయోగించే కాపర్ బాటిల్స్ క్రమంగా రంగు మారుతూ ఉంటాయి. వీటిని కొత్తవాటిలా మెరిపించే చిట్కాలు...

- చిన్న గిన్నెలో రెండు చెంచాల ఉప్పు, ఒక చెంచా నిమ్మరసం లేదా వెనిగర్ వేసి పేస్టులా చేయాలి. దీన్ని కాపర్ బాటిల్ మీద పూతలా రాయాలి. ఈ పేస్టులో కొన్ని నీళ్లు కలిపి బాటిల్‌లో పోయాలి. పాత టూత్‌బ్రష్‌తో బాటిల్ పైన, లోపల రుద్ది కడిగితే సరిపోతుంది.
- వెడల్పాటి గిన్నెలో సగానికి పైగా వేడినీళ్లు తీసుకోవాలి. అందులో రెండు నిమ్మ తొక్కలు, కొద్దిగా వెనిగర్ వేసి కలపాలి. పావుగంట తరువాత ఈ నీళ్లలో కాపర్ బాటిల్‌ని ముంచి అరగంటసేపు ఉంచాలి. తరువాత మంచినీళ్లతో కడిగేస్తే బాటిల్ కొత్తగా మెరుస్తుంది
- చిన్న గిన్నెలో కొద్దిగా చింతపండు వేసి నీళ్లు చిలకరించి మెత్తగా నాననివ్వాలి. తరువాత గుజ్జు తీసి కాపర్ బాటిల్‌కి పట్టించాలి. పావుగంట సేపు నాననిచ్చి మెత్తటి స్క్రబ్బర్‌తో తోమి కడగాలి. ఈ గుజ్జులో కొన్ని నీళ్లు కలిపి బాటిల్‌లో పోసి కొద్దిగా ఉప్పు వేసి మూతపెట్టి వేగంగా ఊపితే లోపల చేరిన మురికి కూడా వదిలిపోతుంది. గోరువెచ్చటి నీటితో కాపర్ బాటిల్‌ని కడిగితే లోపల నుంచి ఎటువంటి వాసనలు రావు.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
పోస్ట్‌హౌస్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 22
గుడ్‌బై జూన్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 24
ప్యారడైజ్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 24
ఆంధ్రాకింగ్ తాలూకా	తెలుగు	డిసెంబర్ 25
అమెజాన్ ప్రైమ్		
సూపర్ నేచురల్	వెబ్ సిరీస్	డిసెంబర్ 22
జీ 5		
ఏక్ దీవానేకీ దీవానియత్	హిందీ చిత్రం	డిసెంబర్ 26

స్టయిల్ స్టేట్‌మెంట్



చూడగానే పలకరించినట్లుంటాయి స్టేట్‌మెంట్ ఆభరణాలు. సంప్రదాయ డిజైన్లకు భిన్నంగా ఆధునికతను ప్రతిబింబిస్తూ కళాత్మకత ఉట్టిపడేలా ఉంటాయి. నెక్లెస్, ఉంగరం, జుంకాలు... వీటిలో ఏ ఒక్కటి పెట్టుకున్నా నలుగురిలో ప్రత్యేకంగా నిలబెడతాయి. అందుకే సెలబ్రిటీల నుంచి సామాన్య మహిళల వరకు అందరూ వీటిని ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఈ ఆభరణాలను బంగారం, వెండి, ప్లాటినంతోపాటు ఇతర లోహాలు, సెమీ ప్రెషియస్ రాళ్లు, ముత్యాలు, రత్నాలు, కలప, వివిధ రకాల ఫ్యాబ్రిక్ పీస్‌లు, పక్షుల ఈకలు, పట్టు దారాలతో కూడా తయారు చేస్తున్నారు జ్యువెలరీ డిజైనర్లు.

వి లేదా స్కూప్ లాంటి ఓపెన్ నెక్‌లైన్ ఉన్న మోడరన్ డ్రెస్‌ల మీద స్టేట్‌మెంట్ నెక్లెస్‌లు బాగా నప్పుతాయి. ప్లంగింగ్, ఆఫ్ షోల్డర్ స్టయిల్ డ్రెస్‌ల మీదకూడా ఇవి సూటవుతాయి. డ్రెస్ కలర్‌తో మ్యాచ్ అయ్యేలా నెక్లెస్‌లో రాళ్లు, పూసలు లేదా పెండెంట్ ఉండేలా చూసుకుంటే బాగుంటుంది. పెద్ద పెద్ద కుందనాలు లేదా రత్నాలతో కూడిన మల్టీలేయర్డ్ నెక్లెస్‌లు ట్రెండింగ్‌లో ఉన్నాయి. స్టేట్‌మెంట్ నెక్లెస్ పెట్టుకున్నప్పుడు చెవులకు ఎలాంటి ఇయర్ రింగ్స్ ధరించకూడదు. అప్పుడే ముఖం ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్‌లో జుంకాలు, చాంద్ బాలీలు, షాన్డిలియర్స్, హూప్స్, డ్రాప్స్ ఇలా ఎన్నో లభ్యమవుతున్నాయి. వీటిని పెట్టుకున్నప్పుడు మెడను బోసిగా ఉంచాలి. హెయిర్ స్టయిల్ సింపుల్‌గా ఉండాలి. భారీ సైజులో ఉండే స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్.. సంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్ దుస్తులన్నింటి మీద చక్కగా నప్పుతాయి. మిర్రర్ వర్క్, ఎంబ్రాయిడరీ వర్క్ ఉన్న కుర్తాలు, కుర్తీలు, అనార్కలీ డ్రెస్‌ల మీద పెద్ద డోమ్ ఆకారంలో ఉండే ఆక్సిడైజ్డ్ జుంకాలు అద్భుతంగా సూటవుతాయి.


ఇక కఫ్ బ్యాంగిల్స్‌ది ప్రత్యేక స్థానం. మెటాలిక్, బీడెడ్, కటౌట్, మిక్స్‌డ్ మెటీరియల్ కఫ్ బ్యాంగిల్స్‌కు డిమాండ్ అధికం. ఒక చేతికి రెండు లేదా మూడు కఫ్ బ్యాంగిల్స్ వేసుకుని మరో చేతికి సింపుల్ వాచ్ పెట్టుకుంటే బాగుంటుంది. వేళ్లకు ఉంగరాలు పెట్టుకోకూడదు. మెడలో సన్నని గొలుసు, చెవులకు చిన్న స్టడ్స్, ముఖానికి సింపుల్ మేకప్ ఎంపిక చేసుకుంటే సరిపోతుంది.

విభిన్నమైన ఆకృతుల్లో భారీగా కనిపించే కాక్‌టెయిల్ ఉంగరాలను స్టేట్‌మెంట్ జ్యువెలరీగా ధరిస్తున్నారు మహిళలు. బంగారం, వజ్రాలు, రత్నాలతో గ్రాండ్‌గా రూపొందించిన ఉంగరాలను పార్టీలు, ఫంక్షన్లలో పెట్టుకుంటున్నారు. ఏదైనా ఒక వేలికి మాత్రమే స్టేట్‌మెంట్ ఉంగరం పెట్టుకోవాలి. మిగిలిన వేళ్లకు ఏ రింగ్‌లూ పెట్టకూడదు.






ఇటీవల ముంబైలో జరిగిన స్వదేశీ స్టోర్ ప్రారంభోత్సవ వేడుకల్లో నీతా అంబానీ.. చెవులకు వందేళ్లనాటి పోల్కీ కుందన్ జుంకాలు పెట్టుకుని బోసి మెడతో ఆకర్షణీయంగా కనిపించారు. ఎడమ చేతి వేలికి వజ్రాలు, కెంపులు పొదిగిన పక్షి ఉంగరం, కుడి చేతికి బంగారు బ్రేస్‌లెట్, ఉంగరాలను జోడించే ప్రత్యేకమైన హాత్‌ఫూల్‌ను ధరించారు. ఇవన్నీ నీతాకు ఆమె తల్లి నుంచి వారసత్వంగా లభించాయి. ఈమధ్య ఓ ఈవెంట్‌లో అదితీరావు హైదరీ.. బీడ్స్ జతచేసిన ఆక్సిడైజ్డ్ జుంకాలతో తళుక్కుమన్నారు. అలాగే జాన్వీ, కృతి సనన్, సమంత, కాజల్, శ్రియ, అనన్య పాండే, శిల్పాశెట్టి, కరీనా, దీపిక తదితర నటీమణులు కూడా తరచూ స్టేట్‌మెంట్ ఆభరణాలతో కనువిందు చేస్తుంటారు.



ముత్యాల ముగ్గు



15x8
సందు చుక్కలు



ఎస్ఆర్ జయశ్రీ యాదవ్,
అనంతపురం

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

గిల్‌కు ఝలక్

ఇషాన్‌కు చాన్స్ ● జితేష్‌కు ఉద్వాసన
రింకూ సింగ్‌కు చోటు ● వైస్ కెప్టెన్‌గా అక్షర్


ఇషాన్



టీ20 వరల్డ్‌కప్‌నకు భారత జట్టు

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్ బరిలోకి దిగే భారత క్రికెట్ జట్టును శనివారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో 15 మందితో కూడిన జట్టు ఎంపిక విషయంలో జాతీయ సెలెక్టర్లు సంచలన నిర్ణయాలు తీసుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు భారత్, శ్రీలంకలో ఈ టోర్నీ జరుగనుంది. కాగా, ఇటీవలి దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌కు వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించిన శుభ్‌మన్ గిల్‌కు ఈ జట్టులో చోటు దక్కలేదు. కెప్టెన్‌గా సూర్యకుమార్ కొనసాగనుండగా, నూతన వైస్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్ ఎంపికయ్యాడు. అలాగే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో దుమ్మురేపిన వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌కు రెండేళ్ల తర్వాత సెలెక్టర్ల నుంచి పిలుపు రావడం విశేషం. అతడితో పాటు హిట్టర్ రింకూ సింగ్, పేసర్ హర్షిత్ రాణా, స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్ తొలిసారి వరల్డ్‌కప్ ఆడబోతున్నారు. సఫారీలతో సిరీస్‌కు రింకూను పరిగణనలోకి తీసుకోని సెలెక్టర్లు అతనికి ఏకంగా వరల్డ్ కప్ జట్టులో చోటివ్వడం గమనార్హం. వికెట్ కీపర్‌గా సంజూ శాంసన్ చోటును ఖాయం చేసుకోగా.. జితేశ్ శర్మపై వేటు పడింది. అతడి స్థానంలోనే రెండో కీపర్‌గా ఇషాన్‌ను చేర్చారు. అయితే, అవకాశం వచ్చినప్పుడల్లా సద్వినియోగం చేసుకున్న జితేశ్‌ను ఎందుకు పక్కనబెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతేడాది అమెరికా, వెస్టిండీస్‌లలో జరిగిన టీ20 ప్రపంచకప్‌లో ఆడిన రోహిత్, కోహ్లీ, జడేజా ఇప్పటికే రిటైరవగా.. ఈసారి పంత్, చాహల్, జైస్వాల్, సిరాజ్‌లకు చోటు దక్కలేదు.

టీ20 వరల్డ్‌కప్ జట్టు

సూర్యకుమార్ (కెప్టెన్), అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (కీపర్), తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, బుమ్రా, అర్ష్‌దీప్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, ఇషాన్ కిషన్ (కీపర్), రింకూ సింగ్, హర్షిత్ రాణా.

ఇ'షాన్'దార్ ఆటతో..

రెండేళ్ల క్రితం దక్షిణాఫ్రికా పర్యటన మధ్యలో ఇషాన్ జట్టును వీడాక తిరిగి బ్లూ జెర్సీ ధరించలేకపోయాడు. బీసీసీఐ ఆదేశాలను కూడా బేఖాతరు చేయడంతో సెంట్రల్ కాంట్రాక్ట్‌లో కూడా లేకుండా పోయాడు. ఇక అతడికి జట్టులో చోటు కష్టమేనని అంతా భావించినా.. దేశవాళీ టోర్నీల్లో విధ్వంసక ఆటతీరుతో తానేంటో నిరూపించుకున్నాడు. ఇటీవలి ముస్తాక్ అలీ టోర్నీలో జార్ఖండ్ కెప్టెన్‌గా జట్టుకు ట్రోఫీని అందించడమే కాకుండా 10 ఇన్నింగ్స్‌లో 517 రన్స్‌తో అదుర్స్ అనిపించుకున్నాడు. దీంతో సెలెక్టర్లు ఇషాన్‌కు టీ20 జట్టులో చోటివ్వక తప్పలేదు.

వేటు ఎందుకంటే..

టెస్టు, వన్డే కెప్టెన్‌గా ఉన్న శుభ్‌మన్ గిల్‌ను పొట్టి ఫార్మాట్‌కు కూడా ఎంపిక చేసి వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. రోహిత్, విరాట్ లేని వేళ తన రాకతో జట్టులో నిలకడ సమకూరుతుందని భావించారు. కానీ గిల్ మాత్రం అంచనాలను అందుకోలేకపోయాడు. శాంసన్ స్థానంలో ఓపెనర్‌గా ఆడించినా, శుభారంభాలు అందించడంలో విఫలమయ్యాడు. 15 ఇన్నింగ్స్‌లో కనీసం అర్ధసెంచరీ కూడా లేకపోవడం శోచనీయం. సగటు కూడా 25లోపే ఉండగా, స్ట్రయిక్ రేట్ 140 దాటలేకపోయింది. అటు ఓపెనర్‌గా అభిషేక్ ఎదురుదాడికి దిగుతుండగా, గిల్ మాత్రం తడబడుతూ సాగాడు. సౌతాఫ్రికాతో సిరీస్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో శుభ్‌మన్ చేసింది 32 పరుగులే. కానీ మెగా టోర్నీ జట్టులో తనని కొనసాగిస్తారని అంచనా వేసినా సెలెక్టర్లు కఠిన నిర్ణయమే తీసుకున్నారు. అయితే గిల్‌ను ఎంపిక చేయకపోవడానికి ఫామ్‌లేమి కారణం కాదని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తేల్చాడు. 'గిల్ టాలెంట్‌పై ఎవరికీ సందేహాలు లేవు. మేం ఈసారి వైవిధ్యమైన కాంబినేషన్‌తో వెళ్లాలనుకున్నాం. జట్టు కూర్పునకు అనుగుణంగా ఆటగాళ్లను ఎంపిక చేయాల్సి ఉంటుంది. అలాగే టాపార్డర్‌లో కీపర్ బ్యాటింగ్ చేస్తే బావుంటుందనుకున్నాం. అందుకే అతడికి చోటు దక్కలేదు' అని అగార్కర్ వివరించాడు.

అతనికి అవకాశం ఇవ్వాల్సింది

గవాస్కర్

న్యూఢిల్లీ: ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను టీ20 వరల్డ్‌కప్ జట్టులో ఎంపిక చేయకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందని మాజీ కెప్టెన్ గవాస్కర్ తెలిపాడు. దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో విఫలమైనప్పటికీ ఫామ్ తాత్కాలికమని, క్లాస్ శాశ్వతమంటూ గిల్‌కు గవాస్కర్ మద్దతు పలికాడు. అతను చాలారోజుల తర్వాత టీ20 ఫార్మాట్ ఆడాడు కాబట్టి లయ అందుకోలేకపోయాడని చెప్పాడు. ఇక జట్టులోకి ఇషాన్ కిషన్ ఎంపికతో దేశవాళీ క్రికెట్ సత్తా ఏమిటో తెలిసిందని సన్నీ గుర్తుచేశాడు.

భారత్ X పాకిస్థాన్
అండర్-19 ఆసియా కప్ ఫైనల్ నేడు
ఉ. 10.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో

సెమీస్‌లో సాత్విక్ జోడీ ఓటమి

హాంగ్జౌ: బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ గ్రూప్ దశలో హ్యాట్రిక్ విజయాలతో అదరగొట్టిన భారత బ్యాడ్మింటన్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి నాకౌట్‌లో అదే తరహా ప్రదర్శన చేయలేక పోయింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో మూడో సీడ్ సాత్విక్-చిరాగ్ జంట 21-10, 17-21, 13-21తో చైనాకు చెందిన లియాంగ్ వి కెంగ్-వాంగ్ చాంగ్ చేతిలో పరాజయం పాలైంది.

ముంబై జట్టులో రోహిత్

ముంబై: విజయ్ హజారే టోర్నీలో పాల్గొనే ముంబై జట్టులో రోహిత్ శర్మకు చోటు కల్పించారు. అయితే టోర్నీలో రోహిత్ తొలి రెండు మ్యాచ్‌లే ఆడనున్నాడు. శార్దూల్ కెప్టెన్సీలోని జట్టులో ఈ జట్టులో యశస్వీ జైస్వాల్, రహానెలకు చోటు లభించలేదు.

ఓటమి దిశగా ఇంగ్లండ్
లక్ష్యం 435 ● ప్రస్తుతం 207/6

అడిలైడ్: ఏదో అద్భుతం జరిగి లోయరార్డర్ బ్యాటర్లు కాపాడితే తప్ప..ఆస్ట్రేలియాతో యాషెస్ సిరీస్‌ను చేజార్చుకోవడం ఇంగ్లండ్‌కు లాంఛనమే కానుంది. మూడో టెస్టులో 435 పరుగుల ప్రపంచ రికార్డు లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఇంగ్లండ్ జట్టు నాలుగో రోజైన శనివారం ఆఖరికి 207 పరుగులకే 6 వికెట్లు కోల్పోయింది. 4 వికెట్లే చేతిలో ఉండగా..మరో రోజంతా ఆ జట్టు ఆడాలి. క్రాలే (85), రూట్ (39), బ్రూక్ (30) రాణించారు. కమిన్స్, లియాన్ చెరో 3 వికెట్లు తీశారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 271/4తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్ 349 పరుగులకు ఆలౌటైంది. జోష్ టంగ్ 4, కార్స్ 3 వికెట్లు సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 371, ఇంగ్లండ్ 286 రన్స్ చేశాయి.

కైట్స్ ఖాతాలో తొలి డబ్ల్యూటీఎల్ టైటిల్

బెంగళూరు: ప్రపంచ టెన్నిస్ లీగ్ (డబ్ల్యూటీపీఎల్)లో అస్సీ మావెరిక్స్ కైట్స్ జట్టు తొలిసారి చాంపియన్‌గా నిలిచింది. శనివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో కైట్స్ 21-19తో ఏఓఎస్ ఈగల్స్ జట్టును ఓడించి ట్రోఫీ అందుకుంది. కీలక కపోరులో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్‌ను చిత్తుచేసి దక్షిణేశ్వర్ సురేష్ కైట్స్‌కు విజయాన్ని కట్టబెట్టాడు.



మెస్సీ కోల్‘కథ’ వెనుక పెద్ద స్కామ్!

- సాకర్ స్టార్ టూర్ ఆసరాగా రూ.100 కోట్ల కుంభకోణం?
- మెస్సీతో ఫొటో చార్జి, టిక్కెట్ల విక్రయాల్లో అవకతవకలు
- ఈవెంట్ నిర్వాహకుడు శతద్రు ఇంట్లో సోదాలు
- అతడి ఖాతాలో రూ. 22 కోట్లు సీజ్
- లోతుగా దర్యాప్తు చేస్తున్న సిట్

కోల్‌కతా: అర్జెంటీనా స్టార్ లియోనల్ మెస్సీ వచ్చివెళ్లడంతో మున్ముందు భారత పుట్‌బాల్‌కు కొత్తగా ఏమైనా ఒనగూరనుందా? రానున్న రోజుల్లో దేశమంతా సాకర్ ఫీవర్‌తో ఉర్రూతలూగనుందా? అనేవి పక్కనబెడితే.. అతని పర్యటనను ఆసరాగా చేసుకొని ఈవెంట్ నిర్వాహకులు మాత్రం భారీస్థాయిలో స్కామ్‌కు పాల్పడ్డారని తెలుస్తోంది. గోట్ టూర్ ఆఫ్ ఇండియాలో భాగంగా మెస్సీ మొదట అంటే.. ఈనెల 13న కోల్‌కతా వచ్చిన విషయం విదితమే. అక్కడి సాల్ట్‌లేక్ స్టేడియంలో చెప్పినదానికంటే మెస్సీ తక్కువ సమయం గడపడంతో ఆగ్రహానికి గురైన అభిమానులు.. మైదానంలోకి సీసాలు, కుర్చీలు విసిరేసి విధ్వంసం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఈవెంట్ నిర్వాహకుడైన శతద్రు దత్తాను అదేరోజు పోలీసులు అరెస్టు చేయగా, అతనికి న్యాయస్థానం బెయిల్ కూడా నిరాకరించింది. కాగా, ఈ ఘటనకు సంబంధించి బెంగాల్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. ఇందులో భాగంగా సోదాలు నిర్వహించేందుకు శనివారం తెల్లవారుజామున కోల్‌కతాలోని దత్తా ఇంటికి వెళిన సిట్ అధికారులు.. అక్కడ అత్యంత విలాసవంతమైన ఆయన సామ్రాజ్యాన్ని చూసి నోరెళ్లబెట్టారు. విశాలమైన ప్రదేశంలో మూడంతస్థుల భవనం నిర్మించుకున్న దత్తా.. తన నివాసంపై ఏకంగా ఫుట్‌బాల్ మైదానాన్ని ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఓ భారీ స్విమ్మింగ్‌పూల్, చాలా పెద్ద కార్యాలయం ఆయన ఇంట్లో ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. మెస్సీ టూర్ ద్వారా శతద్రు అతని బృందం.. దాదాపు రూ.100 కోట్ల మేర అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయని పోలీసులు తెలిపారు. మెస్సీతో ఫొటో దిగేందుకు రూ.10 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు వసూలు చేసిన నిర్వాహకులు.. ఈ చెల్లింపులకు సంబంధించి పోలీసులకు అధికారిక లెక్కలు చూపలేకపోయారని సమాచారం. టికెట్ల విక్రయాల్లోనూ భారీస్థాయిలో గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలున్నాయి. సిట్ దర్యాప్తులో భాగంగా దత్తాకు చెందిన బ్యాంకు ఖాతాల్లోని రూ.22 కోట్లను పోలీసులు స్తంభింపజేశారు. లోతుగా దర్యాప్తు జరిపితే, మరిన్ని అక్రమాలు బయటకు వెల్లడయ్యే అవకాశముందని సిట్ అధికారులు పేర్కొన్నారు.


మెస్సీతో శతద్రు

యువ క్రికెటర్లకు పరీక్ష

శ్రీలంక మహిళలతో భారత్ తొలి టీ20 నేడు


రా. 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో
ప్రాక్టీస్‌లో మంధాన, దీప్తి శర్మ

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్): వన్డే వరల్డ్ కప్ గెలిచిన జోష్‌లో ఉన్న భారత మహిళల జట్టు మరో సిరీస్‌కు సిద్ధమైంది. శ్రీలంకతో ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా ఆదివారం వైజాగ్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో తలపడనుంది. వచ్చే జూన్‌లో ఇంగ్లండ్ వేదికగా జరిగే పొట్టి ప్రపంచ కప్‌నకు లంకతో సిరీస్‌ను టీమిండియా సన్నాహకంగా భావిస్తోంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, వైస్ కెప్టెన్ మంధాన, జెమీమా, దీప్తి, రేణుక, షఫాలీ, హర్లీన్ తదితరులతో భారత్ పటిష్ఠంగా ఉంది. అయితే వచ్చే వరల్డ్ కప్ నేపథ్యంలో యువ బ్యాటర్ కమిలిని, యువ స్పిన్నర్లు శ్రీచరణి, వైష్ణవీ శర్మలను ఈ సిరీస్ ద్వారా నిశితంగా పరీక్షించాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మరోవైపు సీనియర్ చమరి ఆటపట్టు సారథ్యంలోని శ్రీలంక కూడా పలువురు యువ క్రికెటర్లను ఈ సిరీస్ ద్వారా పరిశీలిస్తోంది. ఇక టీ20ల్లో ఇప్పటిదాకా ఇరుజట్లు 26సార్లు తలపడితే, 20 విజయాలతో భారత్ ఆధిక్యంలో ఉంది.

పోరాడుతున్న విండీస్
తొలి ఇన్నింగ్స్ 381/6

మౌంట్ మాంగనూ: న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో వెస్టిండీస్ నిలకడగా ఆడుతోంది. కవెమ్ హాడ్జ్ (109 బ్యాటింగ్) అజేయ శతకంతో ఆకట్టుకున్నాడు. దీంతో మూడో రోజైన శనివారం ఆట ముగిసేసరికి విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 381/6 స్కోరుతో నిలిచింది. హాడ్జ్‌తో పాటు ఫిలిప్ (12) క్రీజులో ఉన్నాడు. ప్రస్తుతం ఆ జట్టు కివీస్ కన్నా 194 రన్స్ వెనుకంజలో ఉంది. ఓపెనర్లు బ్రాండన్ (63), క్యాంప్‌బెల్ (45) మధ్య తొలి వికెట్‌కు 111 రన్స్ జత చేరాయి. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 575/8 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది.

విమానంలో పొగతాగిన పాక్ హాకీ మేనేజర్
జట్టుతో పాటు గెంటివేత

న్యూఢిల్లీ: పాకిస్థాన్ హాకీ జట్టు మేనేజర్ అంజుం సయ్యద్ విమానంలో పొగతాగుతూ పట్టుబడ్డాడు. ఈ నేపథ్యంలో అతడితోపాటు జట్టు మొత్తాన్నీ మధ్యలోనే విమానం నుంచి దించేశారు. అర్జెంటీనాలో జరిగిన ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో పాల్గొన్న పాక్ హాకీ జట్టు స్వదేశానికి తిరుగు ప్రయాణమైంది. అయితే, మార్గమధ్యంలో ఇంధనం నింపుకొనేందుకు విమానాన్ని బ్రెజిల్‌లోని రియో డి జనిరో ఎయిర్‌పోర్ట్‌లో ఆపారు. ఈ సమయంలో అంజుం పొగతాగుతూ పట్టుబడ్డాడు. దీంతో అతడితోపాటు జట్టు మొత్తాన్ని విమానం నుంచి దించేశారు. 1992 ఒలింపిక్స్‌లో సెమీఫైనల్ చేరిన పాక్ జట్టులో అంజుం సభ్యుడు.

బిజినెస్ ప్లస్

పిల్లలకూ పొదుపు నేర్పండి..

వారసుల కోసం డబ్బు దాచడంతోపాటు వారికి ఆదా చేయడమూ అలవాటు చేయాలి..



సంపాదనలో ఎంతో కొంత పిల్లల కోసం కూడబెట్టడంతో పాటు వారికీ చిన్నప్పటి నుంచే పొదుపు అలవాటు చేయండి. చేతి ఖర్చుల కోసం తల్లిదండ్రులిచ్చే పాకెట్ మనీ.. పిల్లలకు నగదు నిర్వహణను పరిచయం చేస్తుంది. పాకెట్ మనీ పిల్లలకు కొంత ఆర్థిక స్వేచ్ఛను కల్పించినప్పటికీ, నగదు నిర్వహణలో వారు కొన్ని పొరపాట్లు చేసే అవకాశమూ ఉంది. అయితే, చేతిలో వంద రూపాయలున్నప్పుడు బాల్యంలో చేసే చిన్న తప్పులు.. భవిష్యత్‌లో వేలు, లక్షల్లో సొమ్మును దుబారా చేయకుండా ఉండేలా గుణపాఠం నేర్పుతాయి. వారు పెద్దయ్యాక డబ్బు విషయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు పొదుపును అలవాటు చేసుకునేందుకు దోహదపడతాయి. అయితే, తామిచ్చిన పాకెట్ మనీని పిల్లలు ఎలా ఖర్చు చేస్తున్నారనే విషయంలో తల్లిదండ్రుల పర్యవేక్షణతో పాటు వారికి పొదుపుపై మార్గనిర్దేశం చేయడం ఎంతో కీలకం. పిల్లలకు పొదుపును పరిచయం చేసేందుకు మీ ముందున్న మార్గాలు..

సేవింగ్స్ అకౌంట్

మీ వారసులకు డబ్బు ఆదాను నేర్పేందుకు తొలి మార్గం పొదుపు ఖాతా. మీ కుమారుడు లేదా కుమార్తె పేరిట ఏదైనా బ్యాంక్‌లో సాధారణ సేవింగ్స్ అకౌంట్ తెరవండి. ఖాతా నిర్వహణ మీ పర్యవేక్షణలోనే జరుగుతుంది. అయితే, చాలా బ్యాంక్‌లు పిల్లలకు పదేళ్లు వచ్చాక సొంతగా ఖాతా నిర్వహించేందుకు అనుమతిస్తున్నాయి. మీరిచ్చే పాకెట్ మనీలో కొంత మొత్తాన్ని ఆ ఖాతాలో దాచుకునేలా పిల్లల్ని ప్రోత్సహించండి. ఆ సొమ్ముపై ఎంత వడ్డీ లభిస్తుందనే విషయాన్ని తెలియజేయండి. సాధారణంగా సేవింగ్ అకౌంట్‌పై వార్షిక వడ్డీ బ్యాంక్‌ను బట్టి 2.5% నుంచి 5%శ్రేణిలో ఉంది.

డెబిట్ కార్డు కూడా ఉంటే మేలు..

లావాదేవీలపై పరిమితులు, పరిమిత ప్రయోజనాలతో కూడిన మైనర్ సేవింగ్ అకౌంట్లపై కొన్ని బ్యాంక్‌లు డెబిట్ కార్డులను కూడా ఆఫర్ చేస్తున్నాయి. అలాంటప్పుడు మీరు పాకెట్ మనీని నేరుగా వారి ఖాతాకు బదిలీ చేస్తే సరిపోతుంది. అకౌంట్‌లోని సొమ్మును పిల్లలు ఎలా, ఎక్కడ, ఎందుకోసం ఖర్చు చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకునేందుకు వీలవుతుంది. అంతేకాదు, పిల్లలకు డిజిటల్ చెల్లింపులు జరిపే సౌలభ్యమూ లభిస్తుంది.

ఫిక్స్‌డ్ డిపాజిట్

మీ పిల్లల పేరిట కొంత సొమ్మును ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) చేయవచ్చు. సాధారణంగా ఎఫ్‌డీపై సేవింగ్స్ ఖాతా కంటే ఎక్కువ వడ్డీ లభిస్తుంది. ఎంచుకునే సమయాన్ని బట్టి ఎఫ్‌డీపై బ్యాంక్‌లు 5-8 శాతం వరకు వార్షిక వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. పిల్లల పేరిట జమ చేసిన డిపాజిట్ వారి చదువులు లేదా భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడుతుంది.

డీమ్యాట్ అకౌంట్

స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్ పథకాల్లో పెట్టుబడులు పెట్టడం ఎలా అని పిల్లలకు నేర్పేందుకు వారి పేరిట డీమ్యాట్ ఖాతా తెరవచ్చు. ఏదైనా కంపెనీ షేరు ఎలా కొనుగోలు చేయాలి..? ఈక్విటీ, డెట్, హైబ్రిడ్ మ్యూచువల్ ఫండ్ పథకాల్లో ఎలా పెట్టుబడులు పెట్టవచ్చు...? క్రమానుగత పెట్టుబడి పథకాల్లో (సిప్) ఎలా ఇన్వెస్ట్ చేయాలి..? అనే విషయాలతో పాటు దీర్ఘ, మధ్య, స్వల్పకాలిక పెట్టుబడి వ్యూహాలను నేర్పేందుకు డీమ్యాట్ ఖాతా మంచి మార్గం. అయితే, డీమ్యాట్ అకౌంట్ తెరిచేందుకు మీ పిల్లల పేరిట బ్యాంక్ ఖాతా, పాన్ కార్డు, ఆధార్ కార్డు అవసరం. అయితే, పిల్లలు 18 ఏళ్లు వచ్చేంతవరకు సొంతంగా షేర్ల క్రయ, విక్రయాలు చేపట్టలేరు. వారికి 18 ఏళ్లు నిండాక కొత్త కైవేసీ సమర్పించడం ద్వారా దాన్ని రెగ్యులర్ డీమ్యాట్ ఖాతాగా మార్చుకునేందుకు వీలుంటుంది.

పోస్టాఫీస్ పథకాలు- సుకన్య సమృద్ధి యోజన

పెట్టుబడులపై రిస్క్ వద్దనుకునే వారు, స్థిర ఆదాయాన్ని కోరుకునే వారు పోస్టాఫీస్‌ల్లో ఆఫర్ చేసే చిన్న మొత్తాల పొదుపు పథకాలను ఎంచుకోవచ్చు. మీ పిల్లల పేరిట అకౌంట్‌ను ప్రారంభించి రికరింగ్ డిపాజిట్, టైమ్ డిపాజిట్‌తో పాటు నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్ఎస్)లో పొదుపు చేయడం ఆరంభించవచ్చు. బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్, ఎఫ్‌డీలతో పోలిస్తే ఈ పథకాలు కాస్త అధిక వడ్డీని అందిస్తాయి. ఒకవేళ మీకు పదేళ్లలోపు కూతురు ఉంటే, సుకన్య సమృద్ధి పథకంలోనూ పెట్టుబడులు పెట్టవచ్చు. ఈ పథకం ప్రస్తుతం 8.2% వార్షిక వడ్డీ ఆఫర్ చేస్తున్నది. పిల్లల ఉన్నత చదువులు, భవిష్యత్ అవసరాల కోసం ఆదా చేసేందుకు ఇవి ఉత్తమ మార్గాలు.

ఎన్‌పీఎస్ వాత్సల్య

నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)కు ఇది మైనర్ వెర్షన్. పిల్లల పేరిట దీర్ఘకాలిక వ్యూహంతో పెట్టుబడులు పెట్టేందుకు, వారికి రిటైర్మెంట్ ప్లానింగ్‌ను నేర్పేందుకు ఈ మధ్యనే అందుబాటులోకి వచ్చిన మరో ప్రత్యామ్నాయం. కనీస వార్షిక పెట్టుబడి రూ.1,000. మీ కుమారుడు లేదా కుమార్తెకు 18 ఏళ్లు వచ్చాక ఈ ఎన్‌పీఎస్ వాత్సల్య అకౌంట్ సాధారణ ఎన్‌పీఎస్ టైర్-1 అకౌంట్‌గా మారుతుంది. అయితే, ఇందులో జమ చేసిన సొమ్మును మధ్యలో ఉపసంహరించుకునే వెసులుబాటు ఉండదు. పెట్టుబడి గడువు ముగిశాక కూడా అకౌంట్‌లోని కార్పస్‌లో 80 శాతాన్ని యాన్యుటీలో పెట్టాల్సి ఉంటుంది.

ఎన్‌పీఎస్ రూల్స్ మారాయి..
జాగ్రత్తగా తెలుసుకోండి



జాతీయ పింఛన్ వ్యవస్థ (ఎన్‌పీఎస్) నిబంధనల్లో కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) ఈ సవరణలకు సంబంధించి ఇప్పటికే నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. యాన్యుటీల పరిమితిని 20 శాతానికి కుదించడం, 85 ఏళ్ల వయసు వచ్చే వరకు ఎన్‌పీఎస్‌లో కొనసాగేందుకు అనుమతించడం, కనీసం ఆరేళ్ల పాటు సిస్టమిక్ యూనిట్ రిడంప్షన్‌ను అనుమతించడం ప్రధాన మార్పులు. మొత్తం మీద ఎన్‌పీఎస్‌లో పది ప్రధాన మార్పులు చోటు చేసుకోనున్నాయి. అవేమిటంటే..

85 ఏళ్ల వరకు కొనసాగడం..

ఇప్పటి వరకు ఎన్‌పీఎస్ చందాదారులను 75 ఏళ్ల గరిష్ఠ వయసు వరకే ఈ పథకంలో కొనసాగేందుకు అనుమతించేవారు. ఇప్పుడు ఈ వయోపరిమితిని 85 ఏళ్లకు పెంచారు. ఈ వయసు తర్వాత తమ ఖాతాలో జమ అయిన మొత్తాన్ని ఒకేసారి లేదా దశల వారీగా వెనక్కి తీసుకోవచ్చు. ప్రభుత్వ, ప్రభుత్వేతర (ప్రైవేట్) ఉద్యోగులు ఇద్దరికీ ఇది వర్తిస్తుంది. రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక స్థిరత్వం ఉన్న ఎన్‌పీఎస్ చందాదారులకు ఇది బాగా ఉపయోగపడనుంది.

యాన్యుటీల కొనుగోలు..

ఇంతకు ముందు ప్రభుత్వేతర ఉద్యోగులు రిటైర్మెంట్ తర్వాత లేదా ఇతర ప్రత్యేక సందర్భాల్లో తమ ఖాతాల్లో జమ అయిన మొత్తం రూ.5 లక్షలకు మించి ఉంటే.. అందులో 40 శాతం యాన్యుటీల కొనుగోలుకు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు దాన్ని 20 శాతానికి కుదించారు.

100 శాతం వెనక్కి..

కొత్త నిబంధనల ప్రకారం కొన్ని కేసుల్లో చందాదారులు 100 శాతం మొత్తాన్ని ఒకేసారి వెనక్కి తీసుకోవచ్చు. రిటైర్మెంట్ నాటికి ఎన్‌పీఎస్ ఖాతాలో పోగైన మొత్తం రూ.8 లక్షలు లేదా అంతకంటే తక్కువగా ఉన్న కేసుల్లో మాత్రమే ఇది వర్తిస్తుంది. అయితే ఇక్కడ కూడా ప్రభుత్వ ఉద్యోగులైతే తమ ఖాతాల్లోని మొత్తంలో కనీసం 40 శాతంతో, ప్రైవేట్ ఉద్యోగులైతే తమ ఖాతాల్లోని మొత్తంలో 20 శాతం కనీస మొత్తంతో యాన్యుటీలు కొనుగోలు చేసే ఆప్షన్ కల్పించారు.

కొత్త శ్లాబులు..

ఎన్‌పీఎస్ ఖాతాల్లో రిటైరయ్యే నాటికి రూ.8 లక్షల పైన, రూ.12 లక్షల వరకు జమ అయిన వారి విత్‌డ్రాయల్స్ కోసం కొత్త శ్లాబులు ప్రవేశపెట్టారు. ఈ శ్లాబుల ప్రకారం....

ఆప్షన్ 1: ఒకేసారి రూ.6 లక్షల వరకు వెనక్కి తీసుకుని మిగతా మొత్తాన్ని ఎస్‌యూఆర్‌ల రూపంలో ఆరేళ్లలో వెనక్కి తీసుకోవచ్చు.

ఆప్షన్ 2: ఒకేసారి రూ.6 లక్షల వరకు వెనక్కి తీసుకుని, మిగతా మొత్తంతో యాన్యుటీలు కొనుగోలు చేసుకోవడం.

ఆప్షన్ 3: రిటైర్మెంట్ ఖాతాలోని మొత్తంలో 60 శాతం వరకు ఒకేసారి పన్నుల బారిన పడకుండా వెనక్కి తీసుకుని మిగిలిన మొత్తంతో యాన్యుటీ కొనుగోలు చేయడం.

ప్రభుత్వేతర ఉద్యోగులు మొదటి రెండు ఎగ్జిట్ ఆప్షన్లు ఉపయోగించుకోవచ్చు. మూడో ఆప్షన్ ఎంచుకుంటే మాత్రం వీరు 20 శాతం కార్పస్‌తో యాన్యుటీలు కొని, మిగతా 80 శాతాన్ని ఒకేసారి వెనక్కి తీసుకోవచ్చు.

మరిన్ని విత్‌డ్రాయల్స్..

ఎన్‌పీఎస్ చందాదారులు ఇక రిటైరయ్యేలోపు అంటే 60 ఏళ్ల లోపు లేదా సూపర్‌యాన్యుయేషన్ లోపు నాలుగు విడతల వరకు తమ ఎన్‌పీఎస్ ఖాతా నుంచి సొమ్ము వెనక్కి తీసుకోవచ్చు. అయితే ఇందుకోసం ఒక విత్‌డ్రాయల్‌కు మరో విత్‌డ్రాయల్‌కు మధ్య కనీసం నాలుగేళ్ల వ్యవధి ఉండాలి. ఇంతకు ముందు ఇది మూడేళ్లుగా ఉండేది.

60 ఏళ్ల వయసు తర్వాత విత్‌డ్రాయల్స్

పదవీ విరమణ లేదా 60 ఏళ్ల తర్వాత కూడా కొంతమంది ఎన్‌పీఎస్‌లో చందాదారులుగా కొనసాగుతారు. వీరు కూడా మూడేళ్లకు ఒకసారి తమ చందా మొత్తం నుంచి 25 శాతం వెనక్కి తీసుకోవచ్చు.

సిస్టమిక్ యూనిట్ రిడంప్షన్..

ఎన్‌పీఎస్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కొత్తగా సిస్టమిక్ యూనిట్ రిడంప్షన్ (ఎస్‌యూఆర్) ఆప్షన్ ప్రవేశపెట్టారు. ఇది ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అమలు చేస్తున్న సిస్టమిక్ విత్‌డ్రాయల్ ప్లాన్స్ (ఎస్‌డబ్ల్యూపీ) లాంటిది. అయితే ఈ ఆప్షన్ రిటైరయ్యే నాటికి తమ ఖాతాల్లో రూ.8 లక్షల పైన, రూ.12 లక్షల లోపు ఉన్న ఎన్‌పీఎస్ చందాదారులకు మాత్రమే వర్తిస్తుంది. ఇలాంటి చందాదారులు ఒకేసారి రూ.6 లక్షల వరకు వెనక్కి తీసుకోవచ్చు. మిగతా మొత్తాన్ని ఎస్‌యూఆర్ ఖాతాకి మళ్లించి ఆరేళ్లలో వెనక్కి తీసుకోవాలి.

పౌరసత్వం వదులుకుంటే..

ఎన్‌పీఎస్ చందాదారులు ఎవరైనా భారత పౌరసత్వం వదులుకుంటే ఆ వ్యక్తి తన ఎన్‌పీఎస్ ఖాతాను క్లోజ్ చేసుకోవచ్చు. అప్పటి వరకు ఖాతాలో జమైన మొత్తాన్ని వారికి ఒకేసారి చెల్లిస్తారు.

కనిపించకుండా పోయిన లేదా చనిపోయారని భావించే వ్యక్తుల విషయంలో..

ఇలాంటి వ్యక్తుల నామినీలు లేదా చట్టబద్ధ వారసులకు, అప్పటి వరకు జమ అయిన మొత్తంలో 20 శాతాన్ని ఒకేసారి తాత్కాలిక ఊరటగా చెల్లిస్తారు. మిగతా మొత్తాన్ని చట్టపరంగా నిర్ధారించుకున్న తర్వాత చెల్లిస్తారు.

ఖాతా ఆధారితం

ప్రతి ఎన్‌పీఎస్ ఖాతాకు 'శాశ్వత రిటైర్మెంట్ ఖాతా (పీఆర్‌ఏ)' పేరుతో ఒక నంబరు కేటాయిస్తారు. దీంతో ఖాతాదారుడి వివరాల గుర్తింపు తేలికవుతుంది.

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ గోల్డ్ అండ్ సిల్వర్ ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్)ను ప్రారంభించింది. ఇది బంగారం, వెండి ఈటీఎఫ్ యూనిట్లలో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఎఫ్ఓఎఫ్ పథకం. దేశీయంగా ఉన్న వెండి, బంగారం ధరలు ఈ ఫండ్‌కు బెంచ్‌మార్క్‌గా ఉండనున్నాయి. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.100. ముగింపు తేదీ ఈ నెల 22.

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ.. యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్స్ (యూలిప్స్) కింద కొత్తగా సెక్టార్ లీడర్స్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. 20కి పైగా కీలక రంగాల్లోని కీలక కంపెనీల్లో మదుపరులు పెట్టుబడులు పెట్టే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దింది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	660	విజయవాడ	700
వరంగల్	662	గోదావరి	680
చిత్తూరు	693	విశాఖపట్నం	680
		డజను గుడ్లు రూ. 96	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	132	విజయవాడ	133
వరంగల్	132	గుంటూరు	138
కరీంనగర్	132	ఒంగోలు	138
మహబూబ్‌నగర్	132	చిత్తూరు	129
కర్నూలు	132	నెల్లూరు	134
విశాఖపట్నం	116	అనంతపురం	134
గోదావరి	133		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,34,150 ▼	1,22,950 ▼	2,26,000 ▲
విజయవాడ	1,36,000 ▼	1,20,000 ▼	2,08,500 ▲
విశాఖపట్నం	1,34,180 ▼	1,23,000 ▼	2,26,000 ▲
రాజమండ్రి	1,34,180 ▼	1,23,000 ▼	2,06,000 ▲
ప్రొద్దుటూరు	1,33,000 ▲	1,22,360 ▲	2,00,000 ▲
ముంబై	1,31,779 ▼	1,20,710 ▼	2,00,067 ▼

ఆర్సీ.జి2/324/2024 తేది : 20-12-2025

కలెక్టరు వారి కార్యాలయము, నెల్లూరు జిల్లా

ఫారం నెం.VII

విభాగం 19(1) మరియు నియమము 25(1) మేరకు)
(భూసేకరణలో న్యాయమైన పరిహారం, పారదర్శకత, పునరావాసం మరియు పునఃస్థాపన చట్టం 2013
(నెం.30/2013)

రూఢి ప్రకటన

ఈ క్రింద షెడ్యూల్ లో నిర్ధిష్ట పరచిన శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, **ఉలవపాడు మండలముకరేడు గ్రామములో** వున్న భూముల విస్తీర్ణము **ఎ.44.99సెంట్లు** భూమి ప్రజాహిత కార్యాలకు అనగా ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్, మంగళగిరి వారు **ఉలవపాడు మండలము కరేడు గ్రామము** నందు పారిశ్రామిక కూడలి/పరిశ్రమలు స్థాపించుట కొరకు భూములు అవసరమై వున్నవని, శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, వారు భావించివున్నారు. భూములు ప్రజా ప్రయోజనార్థం సేకరించుటలో ఆసక్తిగల వ్యక్తుల ఆక్షేపణలు మరియు వాటిని చట్టం 13 విభాగం 15 ప్రకారం విచారించిన పిమ్మట ఈ క్రింది షెడ్యూల్ లోని భూములు సేకరించుటకు జిల్లా కలెక్టరు వారు తృప్తిచెందివున్నారు. ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్, మంగళగిరి వారు భూసేకరణ కు కావలసిన మొత్తమును డిపాజిట్ చేసివున్నందున, న్యాయమైన పరిహారం, పారదర్శకత, పునరావాసం మరియు పునఃస్థాపన చట్టం 2013 లోని విభాగము 19 (1) మేరకు ఈ క్రింది డిక్లరేషను చేయుచున్నారు.

డిక్లరేషను

ఈ క్రింది షెడ్యూలు నందు కనబరచిన విస్తీర్ణం **ఎ.44.99 సెంట్లు** గల భూములను, అంతియే గాని, కొంచెం తక్కువ ఎక్కువ గాని, ప్రజాహిత కార్యాలకు అంటే అనగా **ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్, మంగళగిరి** వారు ఉలవపాడు మండలము **కరేడు గ్రామము** నందు పారిశ్రామిక కూడలి/పరిశ్రమలు స్థాపించుట నిమిత్తము అవసరమైనట్లు న్యాయమైన పరిహారం, పారదర్శకత, పునరావాసం మరియు పునఃస్థాపన చట్టం 2013 లోని విభాగము 19 (1) మేరకు శ్రీయుత జిల్లా కలెక్టర్, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వారు ప్రకటించుచున్నారు.

షెడ్యూలు

జిల్లా : శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా **మండలము :** ఉలవపాడు **గ్రామము :** కరేడు

క్రమ సంఖ్య	సర్వే. నెం.	పూర్తి విస్తీర్ణం	భూమి రకం	సేకరించిన విస్తీర్ణం ఎకరాల	సంబంధిత ఆసామి పేరు మరియు పట్టాదారుని చిరునామా పట్టాదారు/ అనుభవదారు	సరిహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు, కట్టడములు మరియు ఇతర ములు, వివరాలు
1	2	4	5	6	7	8	9	10	11	12
1	397	8.66	పట్టా	3.000	నాగండ్ల సాయి బసవేశ్వర వేణుగోపాల్ (నాగేశ్వరరావు)	400	395	389, 399	396	జామాయిల్
2			పట్టా	0.980	నాగండ్ల సాయి బసవేశ్వర వేణుగోపాల్ (నాగేశ్వరరావు)	400	395	389, 399	396	
3			పట్టా	0.170	సయ్యద్. అమర్బీబీ (సయ్యద్)	400	395	389, 399	396	
4					పులిమి వెంకమ్మ (వెంకారెడ్డి)	427	385	392, 406	429, 430	
5					పులిమి కోటిరెడ్డి (వెంకారెడ్డి)	427	385	392, 406	429, 430	
6					పులిమి సంపూర్ణ (శ్రీనివాసులు రెడ్డి)	427	385	392, 406	429, 430	
7	428	3.65	చుక్కల భూమి	2.680	సురే వెంకట రమణమ్మ (కృష్ణారెడ్డి)	427	385	392, 406	429, 430	సపోటా
8					సూరే యానాదిరెడ్డి (సుబ్బారెడ్డి)	427	385	392, 406	429, 430	
9					పులిమి వేణుగోపాల్‌రెడ్డి	427	385	392, 406	429, 430	
10				0.280	సురే సుబ్బారెడ్డి	427	385	392, 406	429, 430	
11	430	4.49	పట్టా	1.460	షేక్ షాబ్జాది బేగం (బాషా మొహిద్దీన్)	429	379	428	431	సపోటా
12			పట్టా	0.780	పున్నేపల్లి నరసింహం (కొండయ్య)	429	379	428	431	
13	1054	1.44	చుక్కల భూమి	1.440	ఇతరులు (ఇతరులు)	1053	1051	1049	1072	
14	1061	4.56	పట్టా	0.010	దేవండ్ల మల్లమందయ్య (సుబ్బరామయ్య)	1062	-	1060	1072	
15	1064	6.16	పట్టా	2.000	నల్లపురెడ్డి సత్యవతి (గోపాల్‌రెడ్డి)	1067	1063	1065	1072	జామాయిల్
16	1068	1.48	పట్టా	0.490	చేజర్ల నివాస్‌రెడ్డి (సుధాకర్‌రెడ్డి)	1071	1067	1048	1069	జామాయిల్
17	1069	1.41	పట్టా	0.110	పేరూరి సుబ్బిశెట్టి (రాఘవులు)	-	1067	1070	1072	
18			పట్టా	0.650	తోట వెంకయ్య (నరసింహం)	-	1067	1070	1072	
19			పట్టా	0.680	నల్లపురెడ్డి శివరామిరెడ్డి (నారాయణరెడ్డి)	1072	1089	1091	1086	
20			పట్టా	0.700	నల్లపురెడ్డి అపర్ణ (శివరామిరెడ్డి)	1072	1089	1091	1086	
21	1085	9.33	పట్టా	2.265	నల్లపురెడ్డి నారాయణరెడ్డి (నల్లపురెడ్డి శివరామిరెడ్డి)	1072	1089	1091	1086	జామాయిల్
22			పట్టా	2.265	నల్లపురెడ్డి ఈశ్వరరెడ్డి (శివరామిరెడ్డి)	1072	1089	1091	1086	
23			పట్టా	3.420	నల్లపురెడ్డి రాజేష్‌కుమార్‌రెడ్డి (శ్రీ)	1072	1089	1091	1086	
24			పట్టా	0.740	కూనం కోదండరెడ్డి (వెంకటరెడ్డి)	1085	1093	1094	1122	
25	1091	8.05	పట్టా	0.740	కూనం వెంకారెడ్డి (కృష్ణారెడ్డి)	1085	1093	1094	1122	జామాయిల్
26			పట్టా	0.010	కత్తి నారాయణమ్మ (లక్ష్మి నారాయణ)	1085	1093	1094	1122	
27			పట్టా	0.230	బాపనపల్లి వెంకట శేషయ్య (సుబ్బరాయుడు)	1091	1094	1095	1092	
28	1093	7.87	పట్టా	0.200	బాపనపల్లి అచ్యుత లక్ష్మి అండాలు (వేణుగోపాల్)	1091	1094	1095	1092	జామాయిల్
29			పట్టా	1.000	రేగలగడ్డ వెంకట నాగ వసంత్ కుమార్ (మై గా లక్ష్మి గాయత్రి)	1091	1094	1095	1092	
30			పట్టా	0.280	బాపనపల్లి వెంకట శేషయ్య (సుబ్బరాయుడు)	1091	1094	1095	1092	
31	1095	6.34	పట్టా	0.460	బాపనపల్లి వెంకట శేషయ్య (సుబ్బరాయుడు)	1094	1096	1072	1093	
32	1101	1.88	పట్టా	0.940	కేశవరపు కవిత (కేశవరపు సుధాకర్‌రెడ్డి)	1100	1108	1102	1120	జామాయిల్
33	1118	8.71	పట్టా	0.200	తన్నీరు కర్తమాడు (చిన్నయ్య)	1142	1116	1119	1145	
34			పట్టా	0.030	వడ్డీ మంగమ్మ (వడ్డీ)	1142	1116	1119	1145	
35	1120	4.05	పట్టా	0.060	బెల్లంకొండ లక్ష్మమ్మ (కొండయ్య)	1121	1119	1101	1119	
36			పట్టా	0.220	చిట్టా రవణమ్మ (పోలిరెడ్డి)	1135	1127	1122	1135	
37	1126	1.94	పట్టా	0.110	చిట్టా వెంకటేశ్వర్లు (పోలిరెడ్డి)	1135	1127	1122	1135	సవాకా
38			పట్టా	0.110	చిట్టా పద్మ (లక్ష్మణారెడ్డి)	1135	1127	1122	1135	
39	1128	2.46	పట్టా	1.050	యనమద్రి సుప్రజ (శ్రీకాంత్)	1122	1130	1129	1127	
40			పట్టా	1.410	ఎస్.శ్యామల (మల్లికార్జునరావు)	1122	1130	1129	1127	
41	1129	2.96	పట్టా	0.360	యనమద్రి సుప్రజ (శ్రీకాంత్)	1128	1142	1122	1130	
42			పట్టా	0.080	చేవూరి సోమయ్య (కోటయ్య)	1128	1142	1122	1130	
43	1137	1.36	పట్టా	0.380	తన్నీరు కొండయ్య (శింగయ్య)	1136	1138	1130	1147	
44			పట్టా	0.310	తన్నీరు పెద కోటయ్య (పాపయ్య)	1136	1138	1130	1147	
45	1139	1.11	పట్టా	0.165	తన్నీరు కొండమ్మ (బుల్లి కొండయ్య)	1138	-	1142	1140	
46	1143	2.85	పట్టా	0.150	కుంచాల కోటమ్మ (పుల్లయ్య)	1145	1161	1118	1114	అక్వా
47			పట్టా	0.7600	దగుమాటి వెంకట సుబ్బమ్మ (ప్రభాకర్‌రెడ్డి)	1115	1235	1112	1114	
48			పట్టా	0.010	సన్నెబోయిన శింగయ్య (శింగయ్య)	1145	1161	1142	1159	
49	1144	1.52	పట్టా	0.210	కుంచాల కోటమ్మ (పుల్లయ్య)	1145	1161	1142	1159	
50			పట్టా	0.030	కుంచాల పుల్లయ్య (లక్ష్మయ్య)	1145	1161	1142	1159	
51			పట్టా	0.130	కుంచాల కోటమ్మ (పుల్లయ్య)	1158	1145	1141	1159	
52	1146	0.83	పట్టా	0.030	కుంచాల పుల్లయ్య (లక్ష్మయ్య)	1158	1145	1141	1159	అక్వా
53			పట్టా	0.0400	దగ్గుమాటి వెంకట సుబ్బమ్మ (ప్రభాకర్‌రెడ్డి)	1117	1113	1115	1170	
54	1155	4.83	పట్టా	0.600	బదితల శేషమ్మ (శేషయ్య)	402	-	1154	1156	
55	1159	3.24	పట్టా	0.120	కుంచాల కోటమ్మ (పుల్లయ్య)	1179	1161	1158	1160	
56			పట్టా	0.040	కుంచాల పుల్లమ్మ (లక్ష్మయ్య)	1179	1161	1158	1160	
57	1163	21.45	పట్టా	2.000	భూతాలపల్లి మాలతీ (గోపాల్‌రెడ్డి)	1162	1172	1168	1164	
58			పట్టా	2.1100	దగ్గుమాటి వెంకట సుబ్బమ్మ (ప్రభాకర్‌రెడ్డి)	1162	1172	1168	1164	
59			పట్టా	0.255	తన్నీరు యానాది (మూర్తి)	1163	1171	1170	1163	
60	1168	6.32	పట్టా	0.250	తన్నీరు వెంకమ్మ (అంజయ్య)	1163	1171	1170	1163	సపోటా
61			పట్టా	0.500	తన్నీరు కొండమ్మ (వెంకట సుబ్బయ్య)	1163	1171	1170	1163	
62	1178	0.23	అసైన్మెంట్	0.220	ఇతరులు (ఇతరులు)	1179	-	1160	1179	సపోటా
63	1182	1.68	పట్టా	0.060	పాటూరి కోటయ్య (కే)	395	1188	1181	1183	సపోటా
64	1192	3.70	పట్టా	0.560	రావూరి కోదండరామిరెడ్డి (రావూరి)	1191	1197	1193	389	
65	1194	3.64	పట్టా	0.520	మిడసల చిన్నమ్మ (మాల్యాద్రి)	1191	1196	1195	1193	
66	1195	5.14	పట్టా	0.010	జక్కంపూడి వెంకట నాయుడు (కోటయ్య)	1191	1196	1174	1194	సపోటా
67			పట్టా	0.100	షేక్షురండి (నజిసహేబ్)	1191	1196	1174	1194	
68	1198	2.46	అసైన్మెంట్	0.200	చిలకపాటి వెంకయ్య (చిలకపాటి)	1196	1200	1173	388	
69			అసైన్మెంట్	1.510	ఇతరులు (ఇతరులు)	1196	1200	1173	388	సపోటా
70	1219	9.98	పట్టా	1.5500	దగ్గుమాటి వెంకట సుబ్బయ్య (ప్రభాకర్‌రెడ్డి)	1208	1218	1209	1220	
71	1498	3.38	పట్టా	0.5600	దగ్గుమాటి వెంకట సుబ్బయ్య (ప్రభాకర్‌రెడ్డి)	388	1209	1208	376/ఎ	
	మొత్తం			**44.99**						

సదరు భూములకు సంబంధించిన ప్లానును శ్రీ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు వారి కార్యాలయములో ఉంచడమైనది. దానిని కార్యాలయ పని వేళలలో, పని దినములలో తనిఖీ చేసుకొనవచ్చును.

2018 భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టం (2018 లోని 22 చట్టం) ద్వారా సవరించబడిన విధముగా 2013 భూసేకరణ, పునరావాసము, పునఃస్థాపనలో నిష్పాక్షిక నష్ట పరిహారము పొందే హక్కు పారదర్శకత చట్టం (2013లో 30వ చట్టం) సెక్షన్ 10 (ఎ) ప్రకారము "ఉలవపాడు మండలము కరేడు గ్రామము నందు పారిశ్రామిక కూడలి/పరిశ్రమలు స్థాపించుట" సామాజిక ప్రభావ అంచనా ప్రకటనకు మినహాయింపు ఇవ్వడమైనది.

సదరు పై తెలిపిన భూసేకరణకు సంబంధించిన భూముల యందు లభ్యమగు బొగ్గు, గనులు, యినుప ఖనిజం, పలక లేక ఇతర ఖనిజములు ఏవేని సదరు భూమి యందు జరుపు త్రవ్వకం సమయములో బయల్పడిన పక్షంలో సదరు భూమిని తీసుకున్న ఉద్దేశ్యము నెరవేరుటకు ఉపయోగాయుక్తమైనంత మేరకు మాత్రమే సదరు ఖనిజములను ఉపయోగించుకొనబడును.

సం/-హిమాన్షుశుక్ల., కలెక్టరు మరియు జిల్లా మెజిస్ట్రేట్, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా.

ఊరంతా నిక్‌నేమ్‌లే!



చుట్టూ పొలాల మధ్య చిననింద్రకొలను అలియాస్ ఫత్తేపురం గ్రామం

ఆ పేరుతో పిలిస్తేనే పలుకుతారు.. ముద్దు పేర్లకు కేరాఫ్ ఫత్తేపురం!

అసలు పేరు చిననింద్రకొలను

నిక్‌నేమ్‌తో పిలవడం, పిలిపించుకోవడం వారికి.. అదో తుత్తి!

గోదారి జిల్లాలంటేనే వెటకారం అన్నమాటకు రుజువు

(నిడమర్రు-ఆంధ్రజ్యోతి)

గోదావరి జిల్లాలంటేనే వెటకారానికి పెట్టింది పేరు! అందులోనే ఆట పట్టింపు, హాస్యం.. ఆ వెంటనే ఆప్యాయత కలబోత ఉంటుంది! అలాంటి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు మండలంలోని చిననింద్రకొలను ఊరి పేరుకూ ఓ నిక్‌నేమ్ ఉంది. అదే 'ఫత్తేపురం'. రికార్డుల ప్రకారం చిన నింద్రకొలను అని ఉన్నప్పటికీ ఫత్తేపురం అంటేనే ఈ ప్రాంతం వారికి తెలుస్తుంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాల పరిధిలో ఉందీ గ్రామం.

మారు పేర్ల వెనుక కథ..

ఓ వ్యక్తి ప్రతి విషయంలోనూ నిబంధనలు పాటించాలని రూల్స్ మాట్లాడతాడు. అందుకే అతడిని కలెక్టర్ అంటారు. మరో వ్యక్తిని సీఐడీ గాడు అని ఎందుకంటారంటే.. ఊరిలో ఏదైనా విషయం జరిగితే ముందుగా పడేది వాడిచెవినే. ఎవరికీ తెలియని విషయాలు కూడా తెలుసుకుని ఆరాలు తీస్తుంటాడు. యుక్త వయస్సు వచ్చినప్పటి నుంచీ గెడ్డం తీయకుండా పెంచుకుంటున్నాడని ఒకరిని గెడ్డం శ్రీను అని పిలుస్తుంటారు. ఒకాయన చంద్రబాబులా గెడ్డం పెంచుకొని, ఆయనలా కనిపించడంతో అతడిని జూనియర్ చంద్రబాబు అని పిలుస్తారు. ఇలా చెప్పుకుంటూ పోతే మొండేలు కొండయ్య, చినమూర్తి, బియ్యంగాడు,, మోచేతులోడు, మువ్వ గాడు, బొమ్మలోడు, అబ్బులిక్కం, ట్రాక్టర్ శ్రీను, కాన్వెంట్ శ్రీను.. ఇలా ఎన్నో మరెన్నో నిక్ నేమ్‌లు తారసపడుతుంటాయి. వీరందరికీ అసలు పేర్లు వేరే ఉన్నాయి. ఇలా ఒక్కో నిక్ నేమ్‌కు ఒక్కో చరిత్ర... ఒక్కో కథ. అయితే, మారుతున్న కాలంతోపాటు అధికంగా విద్యావంతులు కావడంతో నిక్ నేమ్‌లు సంప్రదాయం తగ్గుతూ వస్తోందని స్థానికులు చెబుతున్నారు. కానీ నిక్‌నేమ్‌తో పిలవడం, పిలిపించుకోవడం గోదావరి యాస, భాష, ఓ సరదా. ఓ తుత్తి.. అని అక్కడి వారు చెబుతారు.

అసలు పేరు మరుగున..

ఫత్తేపురం పక్కా పల్లెటూరు. ఆ ఊరిలో వ్యక్తుల వ్యవహార శైలి, మనిషి నడవడిక, అతని ప్రవర్తన బట్టి వాడి గురించి తెలిసిన బంధువుల్లో, స్నేహితుల్లో వాడికి ఆ నిక్‌నేమ్‌లతో పిలవడం పరిపాటి. ఆ వ్యక్తులు తమ నిక్‌నేమ్‌తో పిలిపించుకోవడం నమోషీగా ఫీలవకుండా అలవాటు చేసుకోవడం విశేషం. ఇక్కడ అసలు పేరు మరుగున పడిపోయి మారు పేర్లు చలామణి అయిపోతున్నాయి. ఆ ఊరిలో అడ్రస్ కావాలంటే అసలు పేరు కన్నా నిక్‌నేమ్ తోనే తొందరగా పట్టుకోవచ్చు. అసలు పేరు పెట్టి పోస్టుమాన్ ఉత్తరం అందిస్తే ఇది నాకు కాదు అని చెప్పిన సందర్భాలున్నాయి. 'ఒరేయ్ బాబూ అది నీ పేరున వచ్చిన ఉత్తరం రా.. తీసుకో' అంటూ పోస్టుమాన్ బతిమాలి చెప్పిన సందర్భాలూ అనేకం.!!

ఫత్తేపురం పేరు ఇలా వచ్చింది..


పూర్వం నిజాం నవాబు పాలనలో ఈ ప్రాంతం ఉండేది. నిజాం ప్రభువు ప్రతినిధి ఫత్తేఖాన్ అనే అధికారి చిననింద్రకొలనులోనే నివాసం ఏర్పాటు చేసుకొని ఆ ప్రాంత ప్రజల బాగోగులు చూస్తుండేవారు. దీంతో కొల్లేరు ముఖద్వారంగా ఉండే ఈ ప్రాంతం ఫత్తేఖాన్ పేరు మీద ఫత్తేపురంగా పిలువబడుతూ వచ్చింది. చిననింద్రకొలను పేరు అధికారికంగా నిలిచినా, ఫత్తేపురమని అంటేనే బయటివారికి తెలుస్తుంది.

ప్రముఖుల ముద్ర

ప్రముఖ గాంధేయవాది చింతలపాటి వరప్రసాదమూర్తి రాజు స్వస్థలం ఫత్తేపురం. ఆయన తన ఇంటిని నెహ్రూ గారి ఇంటి నమూనాలో నిర్మించుకొని గాంధేయవాద సిద్ధాంతాలను ప్రచారం చేస్తూండేవారు. 30 ఏళ్ల పాటు స్థానిక ఎమ్మెల్యేగా నిలిచి ఎన్నో విద్యాసంస్థలను నెలకొల్పి ఈ ప్రాంత ప్రజలకు విద్యాదాతగా పేరుపొందారు. చిననింద్రకొలను సరిహద్దులో మూర్తిరాజు పార్లమెంట్ నమూనాలో నిర్మించిన గాంధీ భవన్ ఇప్పటికీ చారిత్రక, పర్యాటక ప్రదేశంగా వెలుగొందుతోంది. ప్రస్తుత ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు స్వగ్రామం కూడా ఫత్తేపురమే. రాజకీయ ముఖచిత్రంలోను ఈ గ్రామానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడ 2019 సార్వత్రిక ఎన్నికల్లో మెజారిటీ ఓటుకు రూ.లక్ష చొప్పున పందేలు జరిగాయి. అలా వైసీపీకి 131 ఓట్లు మెజారిటీ రావడంతో.. ఓడిన వారు కోటీ 31 లక్షల పందెం సొమ్మును ప్రత్యర్థులకు సమర్పించుకున్నారు.



ఉత్తరం ఇవ్వడానికి మూడు రోజులు పట్టింది..



నా రూపం, ఆహార్యం అచ్చు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాదిరి ఉండడం వల్ల నన్ను గ్రామంలో అందరూ జూనియర్ బాబు అని, జూనియర్ చంద్రబాబు అని పిలుస్తుంటారు. నా అసలు పేరు శ్రీరాప సత్యనారాయణ. ఈ పేరుతో ఉత్తరం వస్తే పోస్టుమాన్ నాకు అందించడానికి మూడు రోజులు పట్టింది. గ్రామస్థులందరూ అభిమానంతో పిలవడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. ఈ నిక్‌నేమ్‌లు మా ఊరిలో చాలా మందికి ఉన్నాయి. మా ఊరోళ్లకు ఇదో సరదా!

- జూనియర్ చంద్రబాబు అలియాస్ శ్రీరాప సత్యనారాయణ

పిలుపులో ఆప్యాయతనే చూస్తాం..



మా గ్రామం ఆచారాలకు, అభిమానానికి పెట్టింది పేరు. పూర్తిగా గ్రామీణ వాతావరణం. ప్రతి ఒక్కరూ ఎదుటివారిని ఆప్యాయతగా పిలవడం అలవాటు. నేను చిన్ననాటి నుంచి లావుగా, బొద్దుగా ఉండి కొండలా కనబడడం వల్ల నన్ను కొండయ్య, కొండరాజు అని మా పెద్దల్లో పిలిచివారు. అదేపేరు వాడుక పేరుగా మారిపోయింది. ఆ పిలుపులో ఆప్యాయతను చూస్తామే కానీ వెక్కిరింపును పట్టించుకోం.

- వెంకటేశ్వరరాజు, గ్రామ ఉపసర్పంచ్ ఫత్తేపురం

సంతకానికే అసలు పేరు వాడుతాను



ఊరిలో నన్ను అందరూ బాచిరాజు అని పిలుస్తారు. స్కూల్ రికార్డులలో నా పేరు చింతలపాటి వెంకట సత్యనారాయణరాజు. కానీ ఆ పేరు ఊర్లో చాలామందికి తెలియదు. నా అసలు పేరును బ్యాంకుల్లో, ప్రభుత్వ సంతకాల సమయంలోనే వాడతాను. - సత్యనారాయణరాజు, ఆక్వా వ్యాపారి

పరిశోధనలకు సహకరించే వెబ్‌సైట్

▸▸ విశాఖ యువకుడి అద్భుత ఆవిష్కరణ.. ఏడాదిపాటు శ్రమించి డిజైన్ చేసిన పృథ్వీసాయి

▸▸ ఉచితంగా వినియోగించుకునే అవకాశం



విశాఖపట్నం, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పరిశోధనలు చేసే విద్యార్థులకు ఉపకరించేలా విశాఖ నగరానికి చెందిన యువకుడు ఆకుల పృథ్వీసాయి కృష్ణ ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించారు. గీతంలో బి.ఫార్మసీ, విజ్ఞాన్‌లో ఎం.ఫార్మసీ పూర్తిచేసిన పృథ్వీసాయి కొన్నాళ్లపాటు హైదరాబాద్‌లోని ప్రముఖ ఫార్మా కంపెనీలో పనిచేసి ఆ తర్వాత అమెరికా వెళ్లారు. బోస్టన్‌లో మాస్టర్స్ పూర్తిచేసి, న్యూజెర్సీలోని ప్రముఖ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. అక్కడ పనిచేస్తూనే పరిశోధకులకు ఉపయోగపడేలా ఏదైనా చేయాలన్న ఆలోచనతో ఏడాదిపాటు శ్రమించి డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.కారా.లైఫ్ (www.qara.life) పేరుతో వెబ్‌సైట్‌ను డిజైన్ చేశారు. రిసెర్చ్ చేస్తున్న విద్యార్థులు, పరిశోధకులు తమ ప్రాజెక్టుల్లో భాగంగా రూపొందించే పరిశోధన పత్రాల సమాచారాన్ని ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. దీనిలోని రిసెర్చ్ కంపారిజన్ టూల్‌లో రెండు వేర్వేరు వ్యాసాలను ఒకేసారి పేస్ట్ చేసి సరిపోల్చుకునే అవకాశం ఉంది. దీంతో కాపీ కంటెంట్‌ను గుర్తించే అవకాశం ఉంటుంది. ఇంకా, తమ పరిశోధన పత్రాలను ఇందులో పబ్లిష్ చేసుకునే అవకాశాన్ని కూడా పృథ్వీసాయి కృష్ణ కల్పించారు. సాధారణంగా ఈ తరహా వెబ్‌సైట్‌లను వినియోగించుకునేందుకు కొంత మొత్తాన్ని వసూలు చేస్తుంటారు. అయితే.. పరిశోధకులకు దీన్ని పూర్తిగా ఉచితంగా అందుబాటులోకి తెచ్చినట్టు పృథ్వీసాయి వెల్లడించారు. ఇప్పటికే సుమారు 40 మంది పరిశోధకులు ఈ వెబ్‌సైట్‌లో తమ పత్రాలను పబ్లిష్ చేసుకున్నట్టు తెలిపారు. ఈ వెబ్‌సైట్ వల్ల పరిశోధన, విశ్లేషణ మరింత సులభతరం కావడంతోపాటు ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయని చెప్పారు. అదే సమయంలో పరిశోధనల్లో నాణ్యత కూడా పెరుగుతుందన్నారు.


అల్లూరి జిల్లా హుకుంపేట మండలం గొందూరుకు సమీపంలో 'భీముడు రాయి'


తమిళనాడులోని మహాబలిపురంలో 'కృష్ణుడి వెన్న బంతి'గా ప్రాచుర్యం పొందిన రాయి

ఈ రాయి కూడా వింతేనోయి!

▸▸ అల్లూరి జిల్లా హుకుంపేట మండలం గొందూరు వద్ద భీముడి రాయి

పాడేరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఓ కొండపై ఉన్న రాయి విశేషంగా ఆకట్టుకుంటోంది. హుకుంపేట మండలం తడిగిరి పంచాయతీ గొందూరు గ్రామానికి సమీపంలో ఈ రాయి ఉంది. కొండపైన ప్రత్యేకంగా పెట్టినట్టు కనిపించే ఈ రాయి... తమిళనాడు మహాబలిపురంలోని 'కృష్ణుడి వెన్న బంతి'ని పోలి ఉండడం విశేషం. ఈ రాయి చుట్టూ అనేక గిరిజన విశ్వాసాలు అల్లుకొని ఉన్నాయి. వారు ఆ ప్రాంతాన్ని అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. చెప్పులు దూరంగా విడిచి మాత్రమే అక్కడకు వెళతారు. దానిపై స్థానికులు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ... 'ఈ రాయిని మేం భీముడు రాయిగా పిలుస్తాం. ఆ కాలంలో ఒక వరాహాన్ని వెతుక్కుంటూ ఇటుగా వచ్చిన ఆయన ఈ రాయిని కొండపై పెట్టి, దానిపైకెక్కి వరాహాన్ని వెతికాడని మా పూర్వీకులు చెప్పారు. అందుకే ఈ రాయికి సమీపంలో ఉన్న గిరిజన పల్లెకు పందిమెట్ట అనే పేరు వచ్చింది' అని తెలిపారు.

పాముతో కాటేయించి తండ్రి హత్య!

▸▸ బీమా డబ్బుల కోసం కొడుకుల ఘాతుకం

▸▸ తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో ఘటన


గణేశన్(ఫైల్)

తిరుత్తణి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బీమా డబ్బుల కోసం తండ్రిని పాముతో కాటు వేయించి హత్య చేసిన కుమారులను పోలీసులు అరెస్టు చేశారు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పొదటూరుపేటకు చెందిన గణేశన్(56) అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేసేవాడు. ఈ ఏడాది అక్టోబరు 22న ఇంటి బాత్రూమ్‌లో పాము కాటుకు గురై గణేశన్ మృతిచెందారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టిన పొదటూరుపేట పోలీసులు కూడా.. గణేశన్ పాము కాటుకు గురై చనిపోయినట్లు భావించారు. గణేశన్ కుమారులు మోహన్‌రాజ్, హరిహరన్ తమ తండ్రికి బీమా డబ్బులు రావాలంటూ బీమా సంస్థలను సంప్రదించారు. విచారణ చేపట్టిన బీమా సంస్థలు.. గణేశన్ కుమారుల వైఖరిపై సందేహం వ్యక్తం చేస్తూ ఉత్తరమండల ఐజీ అస్రాగార్గ్‌కు ఫిర్యాదు చేశాయి. గుమ్మిడిపూండి డీఎస్పీ జయశ్రీ నేతృత్వంలోని పోలీసులు దర్యాప్తు చేపట్టగా విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న మోహన్‌రాజ్, హరిహరన్.. తమ తండ్రి రూ.2.5కోట్లకు బీమా చేసిన విషయం తెలుసుకున్నారు. తండ్రిని చంపి బీమా డబ్బుతో పబ్బం గడుపుకోవాలని కుట్రపన్నారు. 3నెలల క్రితం ఓ పామును తెచ్చి తండ్రిపైకి వదిలారు. ఆ పాము కాటువేసినా గణేశన్ మరణించలేదు. దీంతో ఈసారి పనవూరుకు చెందిన బాలాజీ, ప్రశాంత్, తిరుత్తణి దినకరన్, నవీన్‌కుమార్‌తో కలిసి తాచుపామును తెచ్చి అక్టోబరు 21న నిద్రపోతున్న తండ్రి మెడకు చుట్టారు. ఆ పాముకాటు వేయడంతో గణేశన్ మరణించారు. బాత్రూంలో పాము కరచి తమ తండ్రి చనిపోయాడంటూ మోహన్‌రాజ్, హరిహరన్ అందరినీ నమ్మించారు. అయితే, ఆలస్యంగా ఈ విషయాన్ని గ్రహించిన పోలీసులు.. శుక్రవారం వారిద్దరినీ అరెస్టు చేసి పుళల్ జైలుకు తరలించారు.

‘పేట ముఠా’@ 50 కార్లు చోరీ

▸▸ ఇప్పటికి15 వాహనాలు స్వాధీనం

నరసరావుపేట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణలో కార్ల దొంగల ముఠా గుట్టురట్టయింది. కార్లు అపహరించి విక్రయించడంతోపాటు.. తమ నేరాలకు సహకరించిన పోలీసులకు కొన్ని కార్లను గిఫ్టుగా కూడా ఇచ్చారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు ఆయా కార్లను ఎవరెవరికి విక్రయించారు? కానుకలుగా తీసుకున్న అధికారులు ఎవరు? అనే విషయాలపై దృష్టిపెట్టారు. ముఠా సభ్యులు ఏఎస్‌ఐ కొడుకు మదమంచి వెంకట అనుజ్ఞ నాయుడు, పుల్లంశెట్టి మహేశ్, బెల్లంకొండ గోపి, షేక్ నబీ బాషా, నాలి వెంకటరావులను అరెస్టు చేశారు. అనంతరం వీరిని కస్టడీకి తీసుకున్నారు. అదేవిధంగా మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరందరినీ వేర్వేరుగా విచారించి.. వివరాలు రాబడుతున్నారు. మొత్తం 50 కార్లను దొంగిలించినట్టు గుర్తించారు. వీటిలో ఇప్పటికి 15 కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నెంబర్లు మార్చి..

సుమారు 50 కార్ల వరకు చోరీ చేసిన ముఠా వాటి నెంబర్ ప్లేట్లు.. చాసిస్ నెంబర్లు మార్చి విక్రయించినట్టు విచారణలో అంగీకరించారు. మరోవైపు కేసు విచారణ ఊపందుకోవడంతో ఒకరిద్దరు పోలీసు అధికారులు ముఠా


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

నుంచి తీసుకున్న కార్లను తిరిగి ఇచ్చినట్టు సమాచారం. అదేవిధంగా కొందరు రాజకీయ నేతలు కొనుగోలు చేసిన కార్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న కార్లను నరసరావుపేట రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. కొన్ని కార్లకు నెంబర్లు లేకపోవడం, మరికొన్నిటికి రిజిస్ట్రేషన్‌లు కూడా జరగలేదని తెలిసింది. కొన్ని కార్లకు తెలంగాణకు చెందిన నెంబరు పేట్లు ఉన్నాయి. కార్ల చాసిస్ నెంబర్లు సేకరించి రవాణశాఖ పరిశీలనకు పంపారు. ఈ క్రమంలో కొన్ని కార్లకు నకిలీ నెంబర్లు ఉన్నట్టు గుర్తించారు. వీటిలో ఇన్నోవా, కియా, పార్చ్యునర్ వంటి ఖరీదైన కార్లు ఉన్నాయి. కొన్ని కార్లకు తాత్కాలిక నెంబర్లు ఉన్నాయి. మరోవైపు, ఈ కేసులో ముఠా నాయకుడు మదమంచి వెంకట అనుజ్ఞ నాయుడు తండ్రి ఏఎస్ఐ శ్రీనివాసరావు, ముఠాకు సహరించిన చిలకలూరిపేట ఎస్ఐ రహంతుల్లాలను సస్పెండ్ చేశారు.

చైర్మన్ లేరు.. నోటిఫికేషన్ ఇవ్వరు

2026–27కు సంబంధించిన ఫీజుల ఖరారులో విద్యా మండలి తీవ్ర జాప్యం

▸▸ ఈ ఏడాదితో ముగుస్తున్న బ్లాక్ పీరియడ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్యాశాఖకు సంబంధించిన కీలక వ్యవహారాలు ముందుకు సాగడం లేదు. ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చైర్మన్ రిటైర్ కావడం, ప్రభుత్వం ఈ పోస్టును భర్తీ చేయకపోవడంతో కీలకమైన ఫీజుల నిర్ణయం అటకెక్కింది. కనీసం ఇన్‌చార్జ్ చైర్మన్‌ను కూడా నియమించకపోవడంతో ఫీజుల నిర్ణయంలో ఆలస్యం జరుగుతోంది. ఇటీవల వరకు చైర్మన్‌గా ఉన్న హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎం. వెంకటరమణ పదవీకాలం నవంబరు 9తో ముగిసింది. కమిషన్ నిబంధనల ప్రకారం.. ఉన్నత విద్యకు సంబంధించిన ఫీజులపై చైర్మనే నోటిఫికేషన్ జారీచేయాలి. 2023-24 నుంచి 2025-26 వరకు మూడేళ్ల కాలాని(బ్లాక్ పీరియడ్)కి ఖరారు చేసిన ఫీజుల గడువు ఈ విద్యా సంవత్సరంతో ముగుస్తోంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి మూడేళ్ల కాలానికి త్వరలో ఫీజులు ఖరారు చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్, డిగ్రీ, వైద్యం, నర్సింగ్ సహా ఇతర ఉన్నత విద్యా సంస్థలు సుమారు 3 వేల వరకు ఉన్నాయి. ప్రతి విద్యా సంస్థకు వారి మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాల ఆధారంగా ఫీజులు నిర్ణయించాలి. ఈ ప్రక్రియకు ఎక్కువ సమయమే పడుతుంది. గతంలో బ్లాక్ పీరియడ్‌కు ఫీజులు ఖరారు చేసేందుకు 2022, ఆగస్టు సమయంలోనే ప్రక్రియ ప్రారంభించేవారు. తొలుత కమిషన్ నోటిఫికేషన్ జారీచేస్తే అనంతరం నెల రోజుల పాటు విద్యా సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తారు. ఆ తర్వాత విద్యా సంస్థలు సమర్పించిన వివరాల్లో లోపాలుంటే తిరిగి వాటిని సరిదిద్దడానికి కొంత సమయం ఇస్తారు. విద్యా సంస్థలు ఇచ్చిన వివరాలపై ఆడిటింగ్ చేయించడానికి మరో నెల సమయం పడుతుంది.

సమయం సరిపోతుందా?

ఇప్పుడు నోటిఫికేషన్ జారీ చేసినా ప్రక్రియ పూర్తికావడానికి ఎక్కువ కాలం పడుతుంది. 31 రకాల ఖర్చులు, వివరాలను విద్యా సంస్థలు సమర్పించాలి. వాటిలో ఒక్కటి తగ్గినా కమిషన్ మళ్లీ ఆ విద్యా సంస్థను పరిశీలనకు పిలుస్తుంది. దీనిలోనూ కోర్సుల వారీగా ఫీజులు సిఫారసు చేయాలి. ప్రస్తుత బ్లాక్ పీరియడ్‌లో ఇంజనీరింగ్ కోర్సులకు రూ.43 వేల నుంచి రూ.1.05 లక్షల వరకు ఫీజులున్నాయి. డిగ్రీ కోర్సులకు చాలా తక్కువగా ఫీజులు అమలవుతున్నాయి. అన్ని కోర్సులకు ఫీజులు పెంచాలని కాలేజీలు డిమాండ్ చేస్తున్నాయి. ఫీజులు భారీగా పెంచితే ప్రభుత్వంపై ఫీజు రీయింబర్స్‌మెంట్ భారం పెరుగుతుంది. అయితే, ఫీజులు ఎలా ఉండాలన్న విషయాన్ని ప్రభుత్వం నిర్ణయించలేదు. ఫీజులు సవరించాలన్నా మళ్లీ కమిషన్‌కు పంపాల్సిందే. దీంతో ఫీజులు సిఫారసు చేసిన తర్వాత కూడా సమయం పట్టే అవకాశం ఉంది. 2026లో ఉన్నత విద్య కోర్సులు ప్రారంభమయ్యే నాటికి ఫీజులు ఖరారు చేసి ప్రభుత్వం జీవో జారీచేయాలి. సుమారు మే నెల నాటికి జీవో వస్తే ప్రక్రియ సాఫీగా సాగుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో వచ్చే ఏడాది నాటికి సమయం సరిపోతుందా.. అనేది ప్రశ్న.

కోర్టులకు వెళ్తే మరింత ఆలస్యం

2023లో ఫీజులు ఖరారు చేసినప్పుడు అనేక విద్యా సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. ఇంజనీరింగ్ ఫీజులు చాలా తక్కువగా పెంచారని, వాటితో కాలేజీలు నడపలేమని వాదించాయి. దీంతో కౌన్సెలింగ్ ప్రారంభమయ్యే తేదీ వరకు ఫీజుల జీవో విడుదల కాలేదు. అది అడ్మిషన్లపై తీవ్ర ప్రభావం చూపింది. అప్పటి ఉన్నత విద్యాశాఖ అధికారులు కూడా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం కమిషన్ స్వేచ్ఛగా పనిచేయకుండా చేసిందన్న ఆరోపణలున్నాయి. తొలుత సిఫారసు చేసిన ఫీజులను ఇంకా తగ్గించాలని ప్రభుత్వం కమిషన్‌కు ఫైలు తిప్పి పంపింది. ఆ తర్వాత కొందరు ప్రభుత్వ పెద్దల ప్రోద్బలంతోనే న్యాయస్థానానికి వెళ్లారన్న ఆరోపణలు వచ్చాయి. అయితే, ఎవరు కోర్టుకు వెళ్లినా ఎక్కువ సమయం పడుతుంది. ఈ నేపథ్యంలోఇప్పటి వరకు నోటిఫికేషన్ జారీచేయక పోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ప్రేక్షకుల స్పందన బాగుంది



నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ‘గుర్రం పాపిరెడ్డి’ చిత్రం శుక్రవారం విడుదలై ప్రేక్షకుల్ని అలరిస్తోంది. మురళీ మనోహర్ దర్శకత్వంలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ నిర్మించారు. శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాతల్లో ఒకరైన వేణు మాట్లాడుతూ ‘మా సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు, యూనిట్‌లోని ప్రతి ఒక్కరూ మంచి ఎఫర్ట్ పెట్టి వర్క్ చేసి సినిమాను హిట్ చేశారు’ అన్నారు. మరో నిర్మాత అమర్ బురా మాట్లాడుతూ ‘మా సినిమాలో నరేశ్, రాజ్‌కుమార్, వంశీ కామెడీకి ప్రేక్షకులు బాగా నవ్వుతున్నారు. సంగీతం, విజువల్స్.. అన్నీ క్వాలిటీగా ఉన్నాయని అభినందిస్తున్నారు’ అన్నారు. దర్శకుడు మురళీ మనోహర్ మాట్లాడుతూ ‘అవతార్ రిలీజ్ వల్ల మార్నింగ్ షోలు స్లోగా మొదలయ్యాయి. మ్యాట్నీ నుంచి పికప్ అయింది. ఒక చిన్న సినిమాకు ఇంత సంఖ్యలో ప్రేక్షకులు రావడం ఆనందంగా ఉంది’ అని అన్నారు.



రవితేజ మార్క్ కామెడీతో...

రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల తెరకెక్కిస్తున్న చిత్రం ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’. ఎస్ఎల్‌వీ సినిమాస్ బేనర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. డింపుల్ హయాతి, ఆషికా రంగనాథ్ కథానాయికలు. సునీల్, సత్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 13న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిశోర్ తిరుమల మాట్లాడుతూ ‘పూర్తి స్థాయి వినోదంతో అన్ని వర్గాల ప్రేక్షకుల్నీ ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉండబోతోంది. రవితేజతో మంచి కుటుంబ కథా చిత్రం చేయాలనే ఈ కథ రాసుకున్నాను. ఆయన మార్క్ కామెడీ ఉంటూనే నా స్టైల్‌లో సాగుతుంది. మన జీవితాన్ని తెరపై చూసుకున్నట్లే ఉంటుంది. అందర్నీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది’ అని అన్నారు. సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ ‘ఇది ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే చిత్రం. కచ్చితంగా ఘనవిజయం సాధిస్తుంది’ అని చెప్పారు. ‘ఇందులో బాలామణి పాత్రలో కనిపిస్తా’ అని డింపుల్ హయాతి తెలిపారు. ‘ఆధునిక సంబంధాలను వినోదాత్మకంగా చూపిస్తున్నాం’ అని ఆషికా రంగనాథ్ పేర్కొన్నారు.

ఆ బడ్జెట్‌లోపు తీసిన చిత్రాలకు అవార్డులు

– కేఎస్ రామారావు



ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) అధ్యక్షుడు కేఎస్ రామారావు ఫిల్మ్ మేకర్లకు ఓ తీపికబురు అందించారు. చిన్న సినిమాలను ప్రోత్సహించడానికి అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ‘ఈ నెల 31న మా ఎఫ్ఎన్‌సీసీలో జరిగే సాంస్కృతిక ఉత్సవంలో రూ.10 కోట్లలోపు తెరకెక్కించిన చిత్రాలకు అవార్డులు అందజేయనున్నాం. సమాజానికి ఉపయోగపడే విధంగా సందేశాత్మక, ప్రజలను మంచి ఆలోచనల వైపు నడిపించే చిత్రాలను పరిగణలోకి తీసుకుంటాం. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ హీరో, ఉత్తమ హీరోయిన్‌గా మొత్తం నాలుగు విభాగాల్లో పురస్కారాలు ఇవ్వనున్నాం. త్వరలోనే విజేతలను ప్రకటిస్తాం’ అని తెలిపారు.

విభిన్నమైన చిత్రం



ఆదిసాయికుమార్ హీరోగా రూపుదిద్దుకున్న డిఫరెంట్ హారర్ ఎంటర్‌టైనర్ ‘శంబాలా’ ఈ నెల 25న విడుదలవుతోంది. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. విడుదల సందర్భంగా నిర్మాతలు మీడియాతో ముచ్చటించి చిత్ర విశేషాలు వెల్లడించారు. చిత్రకథ బాగా నచ్చడం, డివోషనల్, హారర్ ఎలిమెంట్స్ కనెక్ట్ కావడంతో చిత్రనిర్మాణం ప్రారంభించామని తెలిపారు. ‘మొదట తక్కువ బడ్జెట్‌తో సినిమా తీయాలనుకున్నాం. కానీ కథ మీద బాగా నమ్మకం కుదరడంతో బడ్జెట్ బాగా పెంచాం. ఇప్పటికే జరిగిన బిజినెస్‌తో సేఫ్ జోన్‌లోకి వచ్చాం. థియేట్రికల్ రన్‌తో లాభాల్లోకి వస్తామని నమ్ముతున్నాం. అలాగే హిందీలో కూడా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. తెలుగులో రిలీజ్ అయిన వారం రోజుల్లో హిందీ రిలీజ్ ఉంటుంది’ అని తెలిపారు. దర్శకుడు యుగంధర్ ముని గురించి మాట్లాడుతూ ‘ఆయన షాట్ మేకింగ్, కథ చెప్పే విధానం బాగుంటుంది. సినిమా బాగా వచ్చింది. స్టోరీ పరంగా చూస్తే ఇది టోటల్ డిఫరెంట్ సినిమా ఇది. ఏ సినిమాతోనూ పోలిక లేదు. శ్రీ చరణ్ పాకాల సంగీతం సినిమాకు పెద్ద ఎస్సెట్’ అని చెప్పారు. శంబాలా అనే టైటిల్ పెట్టడానికి గల కారణాన్ని వివరిస్తూ ‘కల్కి చిత్రంతో శంబాలా అనే పదం అందరికీ తెలిసింది. ఆ పదానికి ఓ అర్థం ఉంది. శంబాలా ఎక్కడ ఉంది అనేది చిత్రంలో చూపిస్తున్నాం’ అని చెప్పారు రాజశేఖర్, మహీధర్.

షూటింగ్ షురూ



ప్రధాని నరేంద్ర మోదీపై ‘మా వందే’ బయోపిక్ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. శనివారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు మేకర్స్. ‘మార్కో’ ఫేమ్ ఉన్ని ముకుందన్ మోదీ పాత్రను పోషిస్తున్నారు. రవీనా టాండన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. క్రాంతికుమార్ సీహెచ్ దర్శకత్వంలో సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎమ్ వీర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ ‘మోదీ జీవితంలోని కీలక సంఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమా ఎన్నో పోరాటాల కంటే తల్లి సంకల్పం గొప్పదని నిరూపిస్తుంది. ఆయన వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని విశేషాలన్నీ ఎంతో సహజంగా ఇందులో చూపించబోతున్నాం. అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా భాషలతో పాటూ ఆంగ్లంలోనూ విడుదల చేస్తాం’ అని అన్నారు.


అందరినీ మెప్పిస్తుంది

– రోషన్



‘అందరికీ తెలిసిన బైరాన్‌పల్లి చరిత్రకు మైఖేల్ అనే ఫిక్షనల్ క్యారెక్టర్ జోడించి తీసిన చిత్రమే ఇది’ అని అన్నారు రోషన్. ఆయన లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘ఛాంపియన్’. అనస్వర రాజన్ కథానాయిక. ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఈ నెల 25న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో చిత్రవిశేషాలను ముచ్చటించారు రోషన్. ‘ఇది 1948లో నడిచే యాక్షన్ వార్ డ్రామా. నా పాత్ర కోసం దర్శకుడు ప్రదీప్ అద్వైతం ఎన్నో రిఫరెన్సులు ఇచ్చారు. ప్రతీ పాత్ర కొత్తగా ఉంటుంది. భావోద్వేగాలు, యాక్షన్, డ్రామా, సెంటిమెంట్ ఇలా అన్ని అంశాలను ఆసక్తికరంగా తెరపై చూపించనున్నాం. ఖర్చు విషయంలో నిర్మాత స్వప్న ఎక్కడా రాజీపడలేదు. ప్రతీ సన్నివేశానికి లింక్ ఉంటుంది. మిక్కీ జే మేయర్ సంగీతం సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లనుంది. ఈ సినిమా నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా అందర్నీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది. నేను చేసే ప్రతీ చిత్రం విభిన్నంగా ఉండాలనుకుంటాను’ అని చెప్పారు.

రెండు విభిన్న పాత్రల్లో...



మలయాళ కథానాయకుడు మోహన్‌లాల్ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం ‘వృషభ’. నందకిశోర్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని కనెక్ట్ మీడియా, బాలాజీ టెలీఫిల్మ్స్, అభిషేక్ ఎస్ వ్యాస్ స్టూడియోస్ బేనర్లపై శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, సీకే పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్ వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నాని, జూహి పరేఖ్ మెహతా నిర్మించారు. ఈ నెల 25న పాన్ ఇండియా స్థాయిలో చిత్రం విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఇందులో మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆదిదేవ వర్మ అనే వ్యాపారవేత్తగా.. అసమాన యోధుడు రాజా విజయేంద్ర వృషభగా రెండు విభిన్న పాత్రల్లో మోహన్‌లాల్ కనిపించనున్నారు. ఇందులో కథానాయకుడి వర్తమానానికి.. గత జన్మతాలుకూ జ్ఞాపకాలకూ ఉన్న సంబంధం ఏంటనేది ఆసక్తికరంగా చూపించి సినిమాపై అంచనాలు పెంచేశారు. సమర్జిత్ లంకేశ్, రాగిణి ద్వివేది, నయన్ సారిక, అజయ్, నేహా సక్సేనా, గరుడ రామ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

టార్గెట్ 2030!



- నాయకత్వం దశకు అమరావతి క్వాంటం వ్యాలీ
- రూ.1,000 కోట్లతో క్వాంటం ఆవిష్కరణల నిధి
- పునాది, విస్తరణ, లీడర్‌షిప్ దశలకు లక్ష్యాలను నిర్దేశించిన సీఎం
- తొలి దశలో స్టార్టప్ పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదముద్ర

గుంటూరు, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): క్వాంటం టెక్నాలజీకి పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా అమరావతి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో దశల వారీగా లక్ష్యాలను సీఎం చంద్రబాబు నిర్దేశించారు. పునాది, విస్తరణ, నాయకత్వ దశల లక్ష్యాలను తాజాగా విడుదల చేశారు. రాబోయే సంవత్సరం 2026 మొత్తం పునాది దశగా పరిగణిస్తారు. 2027, 2028, 2029 విస్తరణ దశ, 2030 నుంచి నాయకత్వ దశగా నిర్ణయించారు. వీటికి వేర్వేరుగా లక్ష్యాలను నిర్ణయించారు. ప్రస్తుత పునాది దశలో స్టార్టప్ పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. క్యూపీఏఐ, నోస్ట్రాడమస్ టెక్నాలజీస్, 42 టెక్నాలజీ, క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్, సైబ్రానెక్స్ టెక్నాలజీస్, సెంటెల్లా సైంటిఫిక్, క్యూక్లెయిర్ వోయన్స్ క్వాంటం ల్యాబ్స్ పెట్టుబడులకు రెండు రోజుల క్రితం ఆమోదముద్ర వేసింది.

పునాది దశ...

ఈ దశలో పరిపాలన వ్యవస్థ ఏర్పాటు, హార్డ్‌వేర్‌ని యాంకర్ చేయడం, క్వాంటం విద్య ప్రారంభం, ప్రతిభను గుర్తించడం తదితరాలు చేపడతారు. ఐబీఎం క్వాంటం సిస్టమ్ 2 ఇన్‌స్టలేషన్ చేస్తారు. క్వాంటంకు సంబంధించి విద్యా కార్యక్రమాలు ప్రారంభించి 100 క్వాంటం ఆల్గోరిథమ్స్‌ని టెస్టింగ్ చేస్తారు. 200 మంది స్పెషలిస్టులను సిద్ధం చేస్తారు.

విస్తరణ దశ...

ఈ దశలో హార్డ్‌వేర్ స్కేల్-అప్ చేయడం, పరిశోధనలను విస్తరించడం, భారీ పెట్టుబడులు రాబట్టడంతో పాటు స్టార్టప్‌ల్లో పర్యావరణ వ్యవస్థని ఏర్పాటు చేస్తారు. ఇందులో భాగంగా 1,000కి పైగా ఆల్గోరిథమ్స్‌ను ఏటా టెస్టింగ్ చేస్తారు. జాతీయ క్వాంటం స్టార్టప్ ఫోరంని నెలకొల్పుతారు. రూ.1,000 కోట్లతో క్వాంటం ఆవిష్కరణల నిధిని ప్రారంభిస్తారు. వెయ్యి ప్రభావతి క్యూబిట్స్, ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడుల సాధన, రూ.5వేల కోట్ల వార్షిక క్వాంటం ఎగుమతులను సాధిస్తారు.

నాయకత్వ దశ.. (2030-35)

ఈ దశలో అంతర్జాతీయ గుర్తింపు, ఎగుమతుల్లో వృద్ధి, అంతర్జాతీయ ప్రమాణాలు, ప్రీమియర్ క్వాంటం ఈవెంట్స్ నిర్వహిస్తారు. అమరావతి క్వాంటం అకాడమీ ఇంజనీర్లు, పరిశోధకులు, టెక్నీషియన్ల ద్వారా 5వేల మంది నిపుణులను ఏటా తయారు చేస్తారు. లివింగ్- ల్యాబ్ యాక్సెస్, రెగ్యులేటరీ శ్యాండ్‌బాక్స్‌ల మద్దతుతో 100 క్వాంటం స్టార్టప్‌లు ఏర్పాటు చేస్తారు.

అమరావతిలో 200 ఎకరాల భూ సేకరణ

క్వాంటం టెక్నాలజీల హార్డ్‌వేర్‌ని ఉత్పత్తి చేసేందుకు అమరావతికి దగ్గరగా ఏపీఐఐసీ ద్వారా 200 ఎకరాల భూమిని సేకరిస్తారు. ఇక్కడ హార్డ్‌వేర్ పరిశ్రమలను నెలకొల్పుతారు. ఇది అమరావతి క్వాంటం వ్యాలీకి ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది.

2026 జూన్ నాటికి ప్లాస్టిక్ ఫ్రీ ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

జీవితాన్ని ఇచ్చేందుకే దీనిని నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం 25 ప్రాంతాల్లో స్వచ్ఛ రథాలు పనిచేస్తున్నాయి. వాటి ద్వారా పొడి చెత్తను సేకరిస్తున్నాం. వాటి సంఖ్య త్వరలో వందకు పెంచుతాం. పట్టణ ప్రాంతాల్లో ఐదు లక్షల ఇళ్లలో హోం కంపోస్టు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇది ప్రస్తుతం 3.91 లక్షల ఇళ్లలో జరుగుతోంది. గ్రామీణ ప్రాంతంలో పది లక్షల ఇళ్లలో హోం కంపోస్టు తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించాం. వచ్చే ఏడాది మార్చి 26 నాటికి ఆ లక్ష్యాన్ని చేరుకుంటాం." అని వివరించారు. సూపర్ సిక్స్ అమలు చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని సీఎం తెలిపారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

పారిశ్రామిక హబ్‌గా అనకాపల్లి జిల్లా

అనకాపల్లి జిల్లా పరిశ్రమల హబ్‌గా మారింది. రాంబిల్లి, నక్కపల్లి, మాకవరపాలెం, వల్లూరుల్లో 24,843 ఎకరాల్లో పరిశ్రమలు వస్తాయి. పరవాడ, అచ్యుతాపురాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు తీసుకొచ్చాం. నక్కపల్లిలో 93 ఎకరాల్లో తొలి ప్రైవేటు పార్కు ఏర్పాటు చేశాం. ఒక్క అనకాపల్లి జిల్లాలోనే రూ.2.89 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. అనకాపల్లిలో ఆర్గానిక్ బెల్లం తయారు చేసి ప్రపంచానికి ఎగుమతి చేయవచ్చు."

మూడేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి

"మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. అనకాపల్లికి త్వరలో పోలవరం నీళ్లు వస్తాయి. గోదావరిని వంశధారకు అనుసంధానం చేస్తాం. ఉత్తరాంధ్రకు నిధులు ఇవ్వాలని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరాను. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తుంది. నాలెడ్జ్ లెవల్ ఎకానమీకి ఏఐ నెక్స్ట్ లెవల్." అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

స్వచ్ఛ రథాలు ప్రారంభం

"స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ రథాలను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.68.25 కోట్లతో చేపట్టే ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు, శుద్ధి ప్లాంటు వంటి నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు. గ్రీన్ అంబాసిడర్స్‌ను చంద్రబాబు సత్కరించారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలానికి చెందిన శానిటేషన్ వర్కర్ హరికృష్ణను, అనకాపల్లి మండలం మార్టూరు గ్రామానికి చెందిన వీరరమణ, చోడవరం మండలం చౌడువాడ గ్రామానికి చెందిన కొట్యాడ అప్పారావులను ముఖ్యమంత్రి శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

సంపద కేంద్రం పరిశీలన

కశింకోట, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని 'సంపద' కేంద్రాన్ని పరిశీలించారు. తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, ఎరువుగా తయారీపై పారిశుధ్య కార్మికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చెత్త సేకరణను స్వయంగా పరిశీలించారు. స్థానికులు, రైతులతో మాట్లాడారు. తాను పది ఎకరాల్లో కూరగాయలు, వరి, చెరకు వేస్తున్నానని, వాటికి సంపద కేంద్రాల్లో తయారైన ఎరువును వాడుతున్నానని ఒక రైతు చెప్పారు.

రాక్షసులు వస్తున్నారు.. జాగ్రత్త

"మా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి యజ్ఞాన్ని భగ్నం చేసేందుకు రాక్షసులు వస్తున్నారు. ఐటీ కంపెనీలు రాకుండా ఈ రాక్షసులు కేసులు వేస్తున్నారు.. మెగా డీఎస్సీ నుంచి కానిస్టేబుల్ పోస్టుల దాకా కేసు వేశారు. వీళ్లకు ఒక్కటే చెబుతున్నా! ఎన్ని అడ్డంకులు సృష్టించినా నన్ను అడ్డుకోలేరు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకే పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తున్నాం. వాస్తవం ఇది కాగా, ప్రైవేటుపరం చేస్తున్నారంటూ మాట్లాడుతున్నారు. విశాఖలో ప్రపంచం మెచ్చేలా జరిపిన యోగాంధ్రపైనా విమర్శలు చేస్తున్నారు."

ఈ వయసులోనే జీవితానికి బాట

- ఏం సాధించాలన్నా ఇప్పుడే ప్రారంభించాలి
- విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నాదీ హామీ
- శుభ్రత, ఆత్మవిశ్వాసం పెంచేందుకే 'ముస్తాబు'
- విద్యార్థులందరికీ త్వరలో వైద్య పరీక్షలు
- అనకాపల్లి జిల్లా తాళ్లపాలెం గురుకుల పాఠశాలలో ముస్తాబు కార్యక్రమం ప్రారంభించిన చంద్రబాబు


అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలోని గురుకుల పాఠశాలలో పిల్లలతో కలిసి 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

కశింకోట (అనకాపల్లి జిల్లా), డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంచేందుకే పాఠశాలల్లో 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. శనివారం అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ... వ్యక్తిగత శుభ్రతతో పాటు నాయకత్వ లక్షణాలు కూడా విద్యార్థుల్లో పెంపొందించడం ముస్తాబు లక్ష్యమన్నారు. చక్కగా తలదువ్వుకోవడం, భోజనానికి ముందు శుభ్రంగా చేతులు కడుక్కోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. డబ్బులను ఖర్చు పెట్టాల్సిన అవసరం లేకుండానే ముస్తాబు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇలాంటి వినూత్నమైన ఆలోచనలతో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. విద్యార్థులందరికీ మంచి భవిష్యత్తు రావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యార్థులపైనే ఆశలు పెట్టుకుందన్నారు. అందరికీ 'తల్లికి వందనం' కింద ఆర్థిక సాయం అందించామని, విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలనే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, భోజనం అన్నీ ఉచితంగానే ఇస్తున్నామని తెలిపారు. "జీవితంలో ఏం సాధించాలన్నా చిన్న వయస్సు నుంచే కృషి చేయాలి. విద్యార్థులంతా రాష్ట్రానికి చెందిన ఆస్తి. మీరంతా నాలెడ్జ్ ఎకానమీలో భాగం. త్వరలోనే విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తాం." అని సీఎం వివరించారు. విద్యాశాఖ మంత్రి లోకేశ్ తన శాఖలో వినూత్నమైన సంస్కరణలు తీసుకువస్తున్నారని తెలిపారు. వివిధ శాఖల మంత్రులు కూడా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకే కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బంగారంగా మార్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

ప్రిన్సిపాల్‌ను అవుతా సర్..

ముస్తాబు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో సీఎం ముచ్చటించారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శ్రీవల్లి లక్ష్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పగా...ఆ ఉద్యోగాన్నే ఎందుకు ఎంచుకున్నావని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. "స్కూలులో ప్రిన్సిపాల్ ఎంతో క్రమశిక్షణ నేర్పారు. అందువల్ల నేను కూడా ప్రిన్సిపాల్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాను." అని శ్రీవల్లి బదులిచ్చింది.

జనం చెవిలో జగన్ 'బొకే'

- విమానంలో పక్కాగా బర్త్‌డే 'సెట్టింగ్'
- బాలిక బొకే ఇచ్చినట్టు సినిమాటిక్ వీడియో
- వైసీపీ సోషల్ మీడియా హడావుడి
- కానీ, జగన్‌కు బిల్డప్ ఇవ్వబోయి బోల్తా కొట్టారంటూ ట్రోల్ చేస్తున్న నెటిజన్లు

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు వెళ్తున్న మాజీ సీఎం జగన్‌కు విమానంలో బాలిక పుష్పగుచ్ఛం అందించేలా వేసిన 'బర్త్‌డే' సెట్టింగ్ బెడిసికొట్టింది. జగన్ ఎక్కడకు వెళ్లినా, ఆఖరికి విమానం ఎక్కినా అభిమానులు చుట్టుముడుతున్నారని జనం బుర్రల్లోకి ఎక్కించేందుకు వైసీపీ సోషల్‌మీడియా చేసిన వీడియో, చివరకు జనం పరిహాసానికి గురయింది. ఇలాంటి సినిమాటిక్ వీడియోలతో తమ కళ్లు కప్పలేరంటూ నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. శుక్రవారం ఎంపీ మిధున్‌రెడ్డితో కలసి జగన్ విమానంలో బెంగళూరుకు బయలుదేరారు. విమానంలోని తన సీటు వద్దకు చేరుకుంటున్న ఆయన వద్దకు ఒక బాలిక వచ్చింది. జగన్‌కు హ్యాపీ బర్త్‌డే చెప్పి, బొకే అందించగా, ఆయన ఆప్యాయంగా ఆ బాలికను పలకరించినట్టుగా ఉన్న ఓ వీడియోను వైసీపీ సోషల్ మీడియా ప్రచారంలో పెట్టింది. అయితే, వీడియోలో కనిపించిన బాలిక దుస్తులపై హ్యాపీ బర్త్‌డే జగన్ మామ అని రాసి ఉండటం, వానిపై ఆయన ఫొటో ఉండటం, జగన్ తన సీటు వద్దకు వచ్చేటప్పటికే బాలిక అక్కడ సిద్ధంగా ఉండటం వంటివి ఎవరినైనా సందేహానికి గురిచేస్తాయి. బస్సుల్లో, రైళ్లలో తిరగనిచ్చినట్టు స్వేచ్ఛగా విమానాల్లో తిరగనీయరు. నియంత్రణలు, కట్టుదిట్టాలు ఉంటాయి. కానీ, జగన్ విమానంలోకి వచ్చినప్పటి నుంచీ వెనుక నుంచి.. ఎదురు నుంచి.. ఒక బృందం కదులుతుండటం ఆ వీడియోలో కనిపించింది. ఆ బృందమే వీడియో తీసింది. ఆయన విమానంలోకి వస్తూనే.. బాలిక ఆయన వద్దకు రావడాన్ని ఒక సినిమా తరహాలో చిత్రీకరించారు. ప్రయాణికులకు ప్రత్యేకించి ఆ బాలిక తల్లిదండ్రులకు జగన్ అదే విమానంలో వస్తున్నారని ఎలా తెలుసుననేది ఆ వీడియో చూసినవారికి కలిగిన మొదటి సందేహం. కొంచెం నిశితంగా గమనిస్తే బొకేతోపాటు కేక్ కూడా జగన్ సీటు పక్కన కనిపించింది. నిజానికి, విమానంలోకి వీటిని తీసుకురావడం సులువేమీ కాదు. సెక్యూరిటీ చెక్ గట్టిగా ఉంటుంది. అలాంటిది బొకే, కేక్ ఎలా విమానంలో వచ్చాయంటూ నెటిజన్లు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుల ప్రకటన

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుల ఎంపికపై కసరత్తు తుది దశకు వచ్చింది. ఆదివారం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులను ప్రకటించే అవకాశం ఉంది. అనకాపల్లి పర్యటన నుంచి శనివారం రాత్రి అమరావతి చేరుకున్న సీఎం చంద్రబాబు పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుల ఎంపికపై తుది కసరత్తును పూర్తి చేశారు. సామాజిక సమీకరణాలు, సామర్థ్యం, సీనియార్టీ, విధేయత ఆధారంగా జిల్లా అధ్యక్ష పదవులకు నాయకులను ఎంపిక చేశారు. సీఎం సూచించిన మార్పులు చేర్పులతో ఆదివారం తుది జాబితా ప్రకటించే అవకాశం ఉంది.

ఎన్నికల్లో అక్రమ వ్యయంపై విచారణకు ఆదేశించండి

- లిక్కర్ స్కామ్‌లో సిట్ చార్జిషీట్ నేపథ్యంలో హైకోర్టులో పిటిషన్

అమరావతి, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేందుకు రూ.కోట్లు ఖర్చు చేశారని మద్యం స్కాంపై దర్యాప్తు చేస్తున్న సిట్ ఏసీబీ కోర్టులో చార్జ్‌షీట్ వేసిందని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై శనివారం హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ వినతిపై ఏ నిర్ణయం తీసుకున్నారన్న ధర్మాసనం ప్రశ్నకు వివరాలు తెప్పించుకుని కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని ఈసీఐ తరఫు న్యాయవాది కోరారు. అంగీకరించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. జై భీమ్‌రావ్ భారత్ పార్టీ తరఫున పోటీ చేసిన విజయవాడకు చెందిన పరసా సురేశ్‌కుమార్ మరో 20 మంది హైకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు.

పశ్చిమ గోదావరిలో బాలుడికి స్క్రబ్ టైఫస్

- తణుకులో చికిత్స పొంది కోలుకున్న బాలుడు

తణుకు రూరల్, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లాలో మొట్టమొదటి సారిగా స్క్రబ్ టైఫస్ కేసు నమోదైంది. తణుకులోని శ్రీముళ్లపూడి వెంకటరమణమ్మ మెమోరియల్ ఆస్పత్రిలో 9 సంవత్సరాల బాలుడికి సెప్సిస్‌తో కూడిన స్క్రబ్ టైఫస్‌కు వైద్యం అందించినట్లు వైద్యులు తెలిపారు. ఈనెల 15న తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం ముక్కామల గ్రామానికి చెందిన ఆ బాలుడు తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతుండగా తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్య పరీక్షల్లో సెప్సిస్‌తో కూడిన స్క్రబ్ టైఫస్‌గా నిర్ధారణ అయింది. దీనితో పీఐసీయూలో ఉంచి పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ కోడూరి సాయిమనోజ్ చికిత్స అందించారు. పూర్తి చికిత్స అనంతరం శనివారం డిశ్చార్జి చేశారు.

24న పోలవరానికి పీపీఏ సీఈవో

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) కొత్త సీఈవో యోగేందర్ పైథాంకర్ ఈ నెల 24 ప్రాజెక్టును సందర్శించనున్నారు. ఆయన 23న రాజమహేంద్రవరంలో వాప్కోస్ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షిస్తారు. 24న పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటిస్తారు. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో శుక్రవారం కేంద్ర జలశక్తి మంత్రి పాటిల్‌ను కలిసి పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల కాంటూరులో నిర్మించేందుకు తుది అంచనా వ్యయానికి ఆమోదించాలని కోరారు. ఈ క్రమంలో పనుల పురోగతిపై సమీక్షించి నివేదిక ఇవ్వాలని పైథాంకర్‌ను జలశక్తి శాఖ ఆదేశించిందని జల వనరుల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకే ఆయన హడావిడిగా పోలవరం పర్యటనకు వస్తున్నారని అంటున్నారు.

రెస్టారెంట్లలో జీఎస్టీ తనిఖీలు

- అర్ధరాత్రి దాటినా కొనసాగుతున్న సోదాలు

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అనేక రెస్టారెంట్లలో జీఎస్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం ఉదయం మొదలైన ఈ సోదాలు 250 పైగా రెస్టారెంట్లలో అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. అనేక రెస్టారెంట్లలో జరుగుతున్న వ్యాపార లావాదేవీలకు, వాటి నిర్వాహకులు ప్రభుత్వానికి చెల్లిస్తున్న పన్నులకు ఎక్కడా పొంతన లేదని జీఎస్టీ అధికారుల తనిఖీల్లో గుర్తించినట్లు సమాచారం.

మీకు యోగి ట్రీట్‌మెంటే కరెక్ట్

- గీతలు దాటి మాట్లాడితే.. మీ చేతుల్లో గీతలు తీసేస్తాం
- జగన్ అండ్ కోకు పవన్ వార్నింగ్


అమరజీవి జలధార కార్యక్రమ శిలాఫలకం ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం పవన్, పక్కన కేంద్ర మంత్రి వర్మ, రాష్ట్ర మంత్రులు

రాజమహేంద్రవరం, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం తలచుకుంటే 48 గంటల్లో.. కిరాయి గ్యాంగ్‌లను మెయింటెన్ చేసే వ్యక్తుల చుట్టుపక్కల ఎవరెవరు ఉన్నారు.. వాళ్ల పేరేంటో కనుక్కొని ఒక పొలిటికల్ నిర్ణయం తీసుకుంటే ఏమవుతారో ఆలోచించండి. అక్కడి వరకు తీసుకెళ్లకండి. మళ్లీ మేమొస్తాం. అందరినీ జైలుకు పంపిస్తాం అనే బెదిరింపులకు మేం భయపడం. కానీ అధికారులు భయపడుతున్నారు. ఎందుకంటే వాళ్ల వెనుక చాలామంది రౌడీలు ఉంటారని చెవిలో చెబుతున్నారు. ఇంత కిరాయి హంతకులు ఉన్నారంటే మీకు యోగి ఆదిత్యనాథ్ ట్రీట్‌మెంటే కరెక్ట్. రౌడీయిజం అన్నవాడి కాలుకు కాలు, కీలుకు కీలు మడతపెట్టి మూలన కూర్చోపెడితేనే తెలిసొస్తుంది. కరడుగట్టిన వామపక్ష తీవ్రవాదులతో మనం ఏకీభవించవచ్చు.. ఏకీభవించకపోవచ్చు. అలాంటి బలమైన నక్సలైట్ల ఆర్గనైజేషనే కకావికలం అయిపోయింది. మీరెంత' అని వైసీపీ అధినేత జగన్ అండ్ కోకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలోని పెరవలిలో అమరజీవి జలధార పథకానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి కందుల దుర్గేశ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 'ప్రతిపక్ష హోదా కూడా లేని గత సీఎం పార్టీ వాళ్లు చాలా మాట్లాడుతూ ఉంటారు. వాళ్లకు ఒకటే చెబుతున్నా.. మీరు అధికారంలో ఉన్నప్పుడు మీ బెదిరింపులకు, దౌర్జన్యాలకు మేం భయపడలేదు. మీరు బాధ్యతగా మెలగకుండా ఒక్కొక్కరినీ చంపేస్తాం.. మళ్లీ మేం వస్తాం అని అంటున్నారు. పిఠాపురం వంటి చోట చిన్నపిల్లల మధ్య క్యాస్ట్ ఫీలింగ్ తెచ్చారు. మీ రాజకీయాల కోసం మాట్లాడడానికి వేరే దారులులేవా? సిగ్గుందా? కాంట్రాక్టులు చేస్తే జైలులో పెడతామని బెదిరిస్తున్నారు. మేమేం మారలేదు గుర్తుపెట్టుకోండి. అలా బెదిరించే సమూహం ఎవరైనా సరే.. నాకు అధికారం ఉన్నా, లేకున్నా ఎప్పుడూ పవన్‌లాగే ఉంటాను. భయపడను. ఇంట్లో నుంచి బయటకు వచ్చేటప్పుడు తిరిగి వెళ్తామో లేదో అని డిసైడ్ అయ్యే వెళతాం' అని అన్నారు.

2027కు అమరజీవి జలధార పూర్తి

'అమరజీవి జలధార ప్రాజెక్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఐదు జిల్లాల్లో రూ.7,910 కోట్లు ఖర్చుపెడుతున్నాం. ఈ ప్రాజెక్టు ద్వారా 30 ఏళ్లలో 1.2 కోట్లమందికి దాహం తీర్చాలని సంకల్పించాం. ముఖ్యంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల తీర ప్రాంతాల్లో నివసించే మత్స్యకార సోదరులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఎక్కువ తీర ప్రాంతాలతో కలిపి ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాం. ప్రజలందరికీ స్వచ్ఛమైన తాగునీరు అందివ్వడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. 2027 నాటికి పనులు చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాం. గతంలో పాలకులు జలజీవన్ మిషన్‌లో ఇంటింటికీ ట్యాప్‌లు వేశారు. కానీ నీళ్లు ఇవ్వలేదు. రోడ్లు, జలజీవన్ మిషన్‌లో నాణ్యత లోపిస్తే కఠిన పనిష్మెంట్ ఉంటుంది. నాడు బూర్గుల రామకృష్ణారావు తెలుగు వారందరూ ఏకంగా కావాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడడానికి సీఎం పదవి త్యాగం చేశారు. తెలుగుజాతి, తెలుగు ఆత్మగౌరవం అని మాట్లాడడానికి మూలకారకుడు అమరజీవి పొట్టి శ్రీరాములు. వాటర్ గ్రిడ్‌కు ఏ పేరు పెట్టాలని ఆలోచిస్తే అమరజీవి పేరు తప్ప ఇంకేమీ రాలేదు. హక్కుల కోసం పోరాడేవారిని ఆరాధించాను. అందువల్లే.. పార్టీ పెట్టి పదేళ్లు అయినా సీట్ల విషయంలో తగ్గాను. అమ్మేశానని ఒకడు, దిగజారిపోయానని ఇంకొకడు అన్నాడు. అమరజీవి జలధార సాక్షిగా చెబుతున్నా.. రాష్ట్రానికి మంచి జరగాలని, ప్రజలకు మంచి జరగాలని మాత్రం ముందుకు వస్తున్నాను. నాకు స్వార్థం లేదు. ప్రధానమంత్రి కూడా నేనున్న సభలకు రావడానికి ఆలోచించాల్సి వస్తోంది. ప్రధాని భద్రత చూసే స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్... తమకు ఇబ్బంది అవుతుందని, తోసుకుని ముందుకు వచ్చేస్తున్నారని, మీ వాళ్లకు బాధ్యత చెప్పండి అని అంటుంటారు.' అని అభిమానులకు పవన్ చెప్పారు.

పద్ధతులు మార్చుకోండి

'మీ ఆకు రౌడీలు అంటే అధికారులు కూడా భయపడుతున్నారు. సామాజిక మాధ్యమాలు, విదేశాల్లో కూర్చుని మాట్లాడేవాళ్లతో సహా ఇక్కడ కూర్చుని భవిష్యత్‌లో మేమొస్తాం.. ఏదో చేస్తాం అంటున్నారు. మీరు వచ్చినపుడు ఏం చేశారు? బెదిరిస్తే భయపడతాం అనుకుంటున్నారా? పార్టీ పెట్టి వచ్చామంటే సమాజం, ప్రజలు, రాష్ట్రం, దేశం మీద ఎంత కమిట్‌మెంట్ ఉండాలి. పద్ధతులు మార్చుకోండి. ఒక మాట అనాలంటే అనండి.. తప్పేమీ లేదు. కానీ గీతలు దాటి మాట్లాడితే మీ చేతులు ఇక ముద్రలు వేయడానికి ఉండవు. మీ చేతుల్లో గీతలు తీసేస్తాం. సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన కలెక్టర్ల మీటింగ్‌లో రాష్ట్రంలో రౌడీయిజం, బెదిరింపులు వద్దని చెప్పాను. వైసీపీ నేతలకు చెబుతున్నా. వైసీపీ నుంచి మా పార్టీలోకి కొందరు నేతలు వచ్చారు. వాళ్లు బ్యాలెన్స్‌గానే ఉన్నారు. కానీ మీరు పాత పద్ధతిలోనే ఇష్టానుసారం చేస్తానంటే కుదరదు.' అని పవన్ అన్నారు.

35 కోట్లతో కొండగట్టులో మండపం

'తెలంగాణలోని కొండగట్టు అంజన్న అంటే నాకు ఇష్టం. దర్శనానికి వెళ్తే భక్తులు 2 వేలమందికి దీక్షా విరమణ మండపం కావాలని చెప్పారు. 96 గదుల ఈ మండపం కోసం రూ.35.19 కోట్లతో టీటీడీ బోర్డు ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు, పాలకమండలికి కృతజ్ఞతలు.' అని పవన్‌కల్యాణ్ అన్నారు.



వైసీపీ జెండా రంగులు, ఆ పార్టీ మాజీ ఎంపీ సత్యవతి చిత్రంతో ఉన్న అంబులెన్స్


సీఎం కాన్వాయ్‌లో అంబులెన్స్‌లపై వైసీపీ రంగులు!

- ఆ పార్టీ మాజీ ఎంపీ సత్యవతి ఫొటో కూడా...

అనకాపల్లి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కాన్వాయ్‌లో వైసీపీ మాజీ ఎంపీ బి.సత్యవతి ఫొటో, ఆ పార్టీ జెండా రంగులున్న అంబులెన్స్‌లను వినియోగించడం చర్చనీయాంశమైంది. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం తాళ్లపాలెంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్ నుంచి బంగారయ్యపేటలో సభా ప్రాంగణం వరకు సీఎం కాన్వాయ్‌లో ఇలాంటివి రెండు అంబులెన్స్‌లు కనిపించాయి. దీనిపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి హైమావతిని వివరణ కోరగా, గతంలో ఎంపీ నిధులతో అంబులెన్స్‌లు కొనుగోలు చేసినందున ఫొటోలు మార్చలేదని చెప్పారు. అనకాపల్లిలో రెండు, తాళ్లపాలెంలో రెండు అంబులెన్స్‌లు వినియోగించాల్సి రావడంతో, గత ఎంపీ నిధులతో కొనుగోలు చేసిన వాటిని వినియోగించామని తెలిపారు.

ఎమ్మెల్యేల పనితీరును గమనించండి

- పార్టీ బలోపేతంలో మీ పాత్ర కీలకం
- టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ల సమావేశంలో మంత్రి లోకేశ్ దిశానిర్దేశం


శనివారం టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

అమరావతి, డిసెంబరు 20(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ ఎమ్మెల్యేల పనితీరులో ఇటీవల కాలంలో చాలా మార్పు వచ్చింది. నియోజకవర్గ స్థాయిలో గ్రీవెన్సుల నిర్వహణ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం మెరుగుపడింది. కానీ ఇంకా కొంత మంది తీరు మారాల్సి ఉంది' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. జోనల్ కో-ఆర్డినేటర్లతో పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన సమావేశం‌అయ్యారు. ఈ సమావేశంలో లోకేశ్ మాట్లాడుతూ... 'ఎమ్మెల్యేల పనితీరును గమనిస్తూ ఎప్పటికప్పుడు పార్టీకి నివేదించాల్సిన బాధ్యత జోనల్ కో-ఆర్డినేటర్లపై ఉంది. అందరికీ పార్టీనే సుప్రీం. పార్టీ ఆదేశాలను ప్రతి ఒక్కరూ తు.చ. తప్పకుండా పాటించాలి. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల అమలు తీరు ఎలా ఉందో క్షేత్రస్థాయిలో కో-ఆర్డినేటర్లు పర్యవేక్షించాలి. ఏమైనా లోపాలు ఉంటే పార్టీ దృష్టికి తీసుకురావాలి. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో 5 శాతం కమిటీలు ఇంకా పెండింగ్ ఉన్నాయి. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలి. నామినేటెడ్ పదవులు పెండింగ్‌లో ఉన్న చోట కూటమి పార్టీల నాయకులతో మాట్లాడి వీలైనంత త్వరలో భర్తీ చేయాలి. కో-ఆర్డినేటర్లు, ఇన్‌చార్జి మంత్రులు తమ పరిధిలోని జిల్లాల్లో నెలలో కనీసం రెండు రోజులు ఉండాలి. కో-ఆర్డినేటర్లు నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని సమీక్షించాలి' అని లోకేశ్ పేర్కొన్నారు. జిల్లాల్లో నిర్మించ తలపెట్టిన పార్టీ కార్యాలయాల నమూనాలను ప్రదర్శించి కో-ఆర్డినేటర్ల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయ నిర్మాణం గురించి ఇన్‌చార్జి మంత్రితో కో-ఆర్డినేటర్లు చర్చించాలని, వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చూడాలని అన్నారు.

పూసపాటి.. దానంలో మేటి!

- 1000 కోట్లు విలువైన భూమి దానం
- ఏవియేషన్ ఎడ్యుసిటీకి 136 ఎకరాలు
- మాన్సాస్ ట్రస్టు తరఫున అందించిన పూసపాటి రాజవంశం

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

రాజులు లేరు.. రాజ్యాలు లేవు.. కానీ విజయనగరం పూసపాటి రాజవంశీయులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే కార్యక్రమాలు చేపడతున్నారు. ఇప్పటికే విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజల కోసం రూ.వేల కోట్ల ఆస్తులను వదులుకున్నారు. ఇప్పుడు సుమారు రూ.1000 కోట్లు విలువైన భూమిని భావితరాల భవితకు, ఏవియేషన్ ఎడ్యుసిటీ కోసం దానం చేశారు. విశాఖపట్నం జిల్లా భీమిలిమండలం అన్నవరం వద్ద మాన్సాస్ ట్రస్టుకు చెందిన 136.63 ఎకరాలను ఏవియేషన్ ప్రాజెక్టుకు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. భోగాపురంలో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణం దాదాపు పూర్తయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పౌరవిమానయాన రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా ప్రపంచంలో పౌరవిమానయానానికి సంబంధించిన యూనివర్సిటీ బ్రాంచ్‌లను ఒకచోటకు తెచ్చేందుకు ఏపీ మంత్రి నారా లోకేశ్ సంకల్పించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు సమీపంలోని ప్రభుత్వ భూముల్లో కానీ.. రైతుల నుంచి సేకరించిన భూముల్లో కానీ ఏవియేషన్ ప్రాజెక్టు నిర్మించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇప్పటికే అంతర్జాతీయ విమానాశ్రయాల నిర్మాణం చేపడుతున్న జీఎంఆర్ సంస్థ ఇందుకు ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం మాన్సాస్ ట్రస్ట్ తరఫున రూ.1000 కోట్ల విలువైన 136.63 ఎకరాల భూమిని ఇచ్చేందుకు పూసపాటి రాజవంశీయురాలు, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు కుమార్తె, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ముందుకు వచ్చారు. ఈ ప్రాజెక్టుకు తమ రాజవంశీయుడైన అలక్ మహారాజా గజపతి పేరు పెట్టాలని కోరారు. అప్పట్లోనే పూసపాటి రాజవంశీయులకు రెండు సొంత విమానాలు ఉండేవి. విమానాశ్రయాలను సైతం సొంతంగా నిర్మించారట. అశోక్ గజపతిరాజు సైతం పైలట్ కావాలనుకున్నారు కానీ అది సాకారం కాలేదు. పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన హయాంలోనే భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు శ్రీకారం చుట్టారు. ఇప్పుడు ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీలో పూసపాటి కుటుంబానికి భాగస్వామ్యం దక్కింది. ఇటీవల విశాఖలో ఒప్పందం జరగగా.. ఏవియేషన్ ఎడ్యుసిటీకి 136.63 ఎకరాలు భూములు కేటాయించేలా దేవదాయశాఖ అనుమతులిచ్చేందుకు సమ్మతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పౌరవిమానయాన అభివృద్ధికి ఊతం

దేశంలో విమానయానం, ఏరోస్పేస్, రక్షణ రంగాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో ప్రయాణికుల రాకపోకలు ఏటా పెరుగుతున్నాయి. ఇందుకు తగ్గట్టు పౌరవిమానయాన శాఖలో మానవ వనరులు అందించేందుకు మన దేశంలో ఎడ్యుకేషన్ సంస్థలు లేవు. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాపంగా ఏవియేషన్ రంగంలో ఉన్న యూనివర్సిటీల బ్రాంచ్‌లను ఇక్కడికి రప్పించేలా మంత్రి లోకేశ్ ఏర్పాట్లు చేశారు. జీఎంఆర్‌తో పాటు మాన్సాస్ ముందుకు రావడంతో ఏవియేషన్ ఎడ్యుసిటీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

ఆనందంగా ఉంది



ప్రతి ఒక్కరూ చదవాలనే ఆకాంక్షతో పూర్వం నుంచి మా తాతగారైన పీవీజీ రాజు ఏన్నో విద్యాసంస్థలను స్థాపించారు. వాటి ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యను అందించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనతో మాన్సాస్ తరఫున ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్టుకు భూములు ఇస్తున్నాం. మా పూర్వీకులకు పౌరవిమానయానంపై ప్రత్యేక దృష్టి ఉంది. మా తాత అలక్‌నంద మహారాజా గజపతి పేరుతో ఈ ప్రాజెక్టు ఏర్పాటు అవుతుండడం శుభ పరిణామం. ప్రజల శ్రేయస్సు పూసపాటి వంశీయుల లక్ష్యం.

- పూసపాటి అదితి గజపతిరాజు, విజయనగరం ఎమ్మెల్యే



'పోస్టు'తో పోస్టు గల్లంతు!

- సోషల్ మీడియా పోస్టులతో కొంప కొల్లేరు
- వీసా మంజూరులో ఇప్పుడు ఇవే కీలకం

హైదరాబాద్, డిసెంబరు 20 (ఆంధ్రజ్యోతి): జగదీశ్ న్యూజెర్సీలోని ఓ ఐటీ సంస్థలో మూడేళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. భారత ఉత్పత్తులపై అమెరికా భారీగా సుంకాలను పెంచిన సమయంలో ఎక్స్‌లో ఓ పోస్టు చేశాడు. 'భారత ఉత్పత్తులపై సుంకాలు పెంచితే అమెరికాకే తీవ్ర నష్టం. ఈ నిర్ణయంతో ట్రంప్ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుంది..' అని పోస్టులో రాశాడు. తర్వాత రెండ్రోజుల్లోనే అతడి హెచ్-1బి వీసా రద్దయింది. ఆ వెంటనే అతడిని సంబంధిత కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించింది. ఇలా విదేశాల్లో ఉంటూ అక్కడి ప్రభుత్వాల నిర్ణయాలపై సామాజిక మాధ్యమాల్లో విమర్శలు గుప్పించి ఉద్యోగాలు కోల్పోయిన వారి సంఖ్య ఈ ఏడాది 3వేలకు పైగా ఉంది. ఇది కేవలం అమెరికాకే పరిమితం కాలేదు.. యూకే, కెనడా, ఆస్ట్రేలియా, గల్ఫ్ దేశాల నుంచి అనేకమందిని వెనక్కి పంపేశారు. ప్రభుత్వం, ప్రజలు, ఇతర మతాలకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన వారిని తొలగించడం ఏటా వందల సంఖ్యలో ఉండగా.. ఈసారి ఎన్నడూ లేనివిధంగా 3వేలకు పైగా భారతీయులను తొలగించారని హైదరాబాద్‌లో గత మూడు దశాబ్దాలుగా వీసా సేవలు అందిస్తున్న ఓ సీనియర్ కన్సల్‌టెంట్ తెలిపారు.

సోషల్ మీడియా ఖాతాల జల్లెడ

ఉన్నతవిద్య పేరుతో వెళ్లి నిబంధనలకు వ్యతిరేకంగా ఉద్యోగాలు చేస్తున్న భారతీయుల సంఖ్య పెరుగుతుండటంతో ట్రంప్ ప్రభుత్వం గత రెండేళ్లుగా కఠినంగా వ్యవహరిస్తోంది. ఇప్పుడు స్టూడెంట్ వీసా కోసం దరఖాస్తు చేస్తే, వారి ఉద్దేశం తెలుసుకునేందుకు అభ్యర్థి సోషల్ మీడియా ఖాతాలను జల్లెడ పడుతోంది. 'డిజిటల్ ఫుట్ ప్రింట్'తో మొత్తం చరిత్ర తవ్వితీస్తోంది. అమెరికాకు ఉద్యోగం కోసం కాకుండా నిజంగా ఉన్నత విద్య కోసమే వెళ్లే ఉద్దేశం ఉందనీ గుర్తించినప్పటికీ.. సోషల్ మీడియాలో రాజకీయ, వివాదాస్పద, మతపరమైన అంశాలపై పోస్టులు చేసిఉన్నా, అలాంటివాటిని సమర్థిస్తూ లైక్, కామెంట్లు చేసినా.. దరఖాస్తులను తిరస్కరిస్తుంది. దీనికోసం దేశంలోని వివిధ దేశాల దౌత్య కార్యాలయాలు, రాయబార కార్యాలయాలు ప్రత్యేకంగా కన్సల్టెన్సీలను నియమించుకుంటున్నాయి. వీసా దరఖాస్తు అందిన వెంటనే వారు పేర్కొన్న వివరాలను కన్సల్టెన్సీలకు అందించి సమాచారం రాబడుతున్నారు. ప్రతి దరఖాస్తుదారుడు తనతో పాటు తల్లిదండ్రుల ఫోన్, ఈ-మెయిల్ వివరాలనూ పేర్కొనాల్సి ఉంటుంది. వీటితో అనుసంధానమై ఉన్న సోషల్ మీడియా అకౌంట్లను నిశితంగా పరిశీలిస్తున్నారు. అభ్యంతరకర అంశాలుంటే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభానికి ముందే ముగిసిపోతోంది. వీసా ప్రక్రియలో సోషల్ మీడియా ఖాతాల పరిశీలనను అమెరికా నాలుగైదేళ్లుగా చేస్తుండగా.. ఇప్పుడు మరింత నిశితంగా గమనిస్తోంది. ట్రంప్ ప్రభుత్వం వచ్చాక కఠిన నిబంధనలను అమలుచేస్తుండగా.. యూకే, కెనడా, ఆస్ట్రేలియాతో పాటు గల్ఫ్ దేశాలు కూడా దరఖాస్తుదారుల సోషల్ మీడియా చరిత్రపై ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

భారీగా వీసా దరఖాస్తులు తిరస్కరణ

ఉన్నతవిద్య, ఉపాధి, వ్యాపారం, పర్యాటకం కోసం అమెరికాకు ఎక్కువగా వెళ్లేంది భారతీయులే. 2023, 2024లో వరుసగా అమెరికా దాదాపు 10లక్షల తాత్కాలిక (నాన్ ఇమిగ్రెంట్) వీసాలు జారీచేసింది. ఇందులో ఎక్కువగా ఎఫ్-1, హెచ్-1బి, బి-1, బి-2 వీసాలు, అక్కడి పౌరసత్వం పొందిన భారతీయుల కుటుంబసభ్యులు, బంధువులకు ఇచ్చే వీసాలున్నాయి. అమెరికా పౌరసత్వం పొంది అక్కడ స్థిరపడ్డవారిని కలిసేందుకు వారి తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులకు వీసాలు వెంటనే లభిస్తుండగా.. ఇప్పుడు ఇవి కూడా తిరస్కరణకు గురవుతున్నాయి. గతంలో స్టూడెంట్ వీసా దరఖాస్తుల్లో తిరస్కరణ రేటు 50శాతం ఉంటుండగా.. ఇప్పుడు 80శాతం వరకు ఉంది. వ్యాపార, పర్యాటక వీసాల తిరస్కరణ కూడా పెరిగింది. దరఖాస్తుకు కనీసం 6నెలల ముందు ఫోన్, సిమ్ మార్చండి, ఈ-మెయిల్ కొత్తగా ప్రారంభించండి అని దరఖాస్తుదారులకు వీసా కన్సల్టెంట్లు సలహా ఇస్తున్నారు. దీంతో గతంలో సోషల్ మీడియాలో విచ్చలవిడిగా పోస్టులు చేసినవారు, వాటికి మద్దతు పలికినవారు.. విదేశీయానం కోసం ముందుగానే జాగ్రత్తపడుతున్నారు. అయితే వీసా కోసమే కొత్త ఫోన్, ఈ-మెయిల్ సృష్టించారని అనుమానంతోనూ దరఖాస్తులు రద్దవుతున్నాయి.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.